RNI NO.TELTEL / 2013 /50370

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

బుధవారం 23.04.2025 | సంపుటి : 11 సంచిక :274 | పేజీలు : 12 వెల: రూ. 4/-

తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698







## ఇంటర్ ఫలితాల్లో అమ్మాయిలదే పైచేయి

**విడుదల చేసిన ఉప ముఖ్యమంత్రి భట్టి మంత్రులు కోమటిరెడ్డి ,పొన్నం**

హైదరాబాద్(జనంసాక్షి): ఇంటర్ వార్షిక పరీక్షల ఫలితాలు విడుదల అయ్యాయి. నాంపల్లిలోని ఇంటర్మీడియట్ బోర్డులో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ కలిసి విడుదల చేశారు. ఇంటర్ ఫస్టియర్, సెకండియర్‌లో అమ్మాయిలు సత్తా చాటారు. ఫస్టియర్ ఫలితాల్లో 65.96 శాతం ఉత్తీర్ణత నమోదైంది. బాలికలు 73.83 శాతం, బాలురు 57.83 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఫస్టియర్ పరీక్షలకు 4,88,430 మంది హాజరు కాగా 3,22,191 మంది ఉత్తీర్ణత సాధించారు. సెకండియర్‌లో 65.65 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా, బాలికలు 74.21 శాతం, బాలురు 57.31 శాతం ఉత్తీర్ణత సాధించారు. సెకండియర్ పరీక్షలకు 5,08,582 మంది హాజరు కాగా, 3,33,908 మంది ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్మీడియట్ ఫలితాల కోసం సంబంధిత వెబ్‌సైట్‌లో చూడొచ్చు

జమ్మూకాశ్మీర్‌లో పర్యాటకులపై



# మిలిటెంట్ల దాడి

**కాల్పుల్లో 27 మంది మృతి**

**పలువురికి తీవ్రగాయాలు**

**వారిలో కొందరి పరిస్థితి విషమం**



మిలిటెంట్ల కాల్పుల్లో మృతి చెందిన తన భర్త మృతదేహం వద్ద విషణ్ణ వదనంతో మహిళ

**ఘటనను తీవ్రంగా ఖండించిన రాష్ట్రపతి ముర్ము , ప్రధాని నరేంద్ర మోదీ**

**హుటాహుటిన జమ్ముకశ్మీర్‌కు హోంమంత్రి అమిత్ షా**

**కారకులపై అత్యంత కఠిన చర్యలుంటాయని హెచ్చరిక**

శ్రీనగర్(జనంసాక్షి):మినీ స్విట్జర్లాండ్‌గా పేర్కొనే పహల్గాంలోని బైసరన్ ప్రాంతాన్ని ముష్కరులు లక్ష్యంగా చేసుకున్నట్లు తెలుస్తోంది. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదులు మరోసారి పేట్రేగిపోయారు. అనంత్‌నాగ్ జిల్లా పహల్గాంలో పర్యటకులే లక్ష్యంగా దాడులకు తెగబడ్డారు.

మిగతా 2లో..






## సివిల్స్ ఫలితాల్లో సత్తాచాటిన మనోళ్లు..

**ఉత్తమ ర్యాంకులు సాధించిన ఆంధ్రా,తెలంగాణ అభ్యర్థులు**

న్యూఢిల్లీ(జనంసాక్షి): సివిల్స్ ఫలితాల్లో ఆంధ్రా,తెలంగాణ రాష్ట్రాలకు చెందిన అభ్యర్థులు సత్తా చాటారు. ఎట్టబోయిన సాయి శివానికి 11వ ర్యాంకు వచ్చింది. ఇక బన్నా వెంకటేశ్ 15వ ర్యాంకు సాధించాడు. సివిల్స్ ఫలితాల్లో తెలుగు రాష్ట్రాలకు చెందిన అభ్యర్థులు సత్తా చాటారు. ఎట్టబోయిన సాయి శివానికి 11వ ర్యాంకు వచ్చింది. ఇక బన్నా వెంకటేశ్ 15వ ర్యాంకు సాధించాడు. అభిషేక్ శర్మకు 38వ ర్యాంకు, రావుల జయసింహారెడ్డికి 46వ ర్యాంకు, శ్రవణ్‌కుమార్ రెడ్డికి 62వ ర్యాంకు, సాయి చైతన్య జాదవ్‌కు 68వ ర్యాంకు, ఎన్ చేతనరెడ్డికి 110వ ర్యాంకు, చెన్నంరెడ్డి శివగణేష్ రెడ్డికి 119వ ర్యాంకు వచ్చాయి.అయితే ఈసారి టాప్-10 జాబితాలో తెలుగు రాష్ట్రాలకు చెందిన అభ్యర్థులు ఒక్కరు కూడా లేరు. శక్తి దూబే అనే అభ్యర్థికి ఫస్ట్ ర్యాంకు వచ్చింది.

మిగతా 2లో..

## హిరోషిమా-తెలంగాణ

**ఏర్పాటుకు ఆ రాష్ట్ర ప్రభుత్వానికి సీఎం రేవంత్ ప్రతిపాదనలు**

# ఆటోమోటివ్, మొబిలిటీ కారిడార్

**పరస్పర సహకారానికి ఉన్న అవకాశాలపై చర్చ**

**శాంతితో పాటు సాంకేతిక పురోగతిలో హిరోషిమా ప్రపంచంలోనే ప్రత్యేక గుర్తింపు సాధించిందని ప్రశంసా**

టోక్యో(జనంసాక్షి):రాష్ట్రముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు మంత్రి శ్రీధర్ బాబు నేతృత్వంలోని తెలంగాణ అధికారుల బృందం జపాన్‌లోని హిరోషిమా ప్రి ఫెక్చర్ (రాష్ట్ర ప్రభుత్వం) ను సందర్శించింది. ఈ సందర్భంగా హిరోషిమా డిప్యూటీ గవర్నర్‌తో సమావేశమయ్యారు. రెండు రాష్ట్రాల మధ్య పరస్పర సహకారానికి ఉన్న అవకాశాలపై విస్తృతంగా చర్చించారు.సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ హిరోషిమా ప్రభుత్వ

మిగతా 2లో..






## ఎండలు బాబోయ్..

**పలు జిల్లాలకు రెడ్, ఆరెంజ్ అలర్ట్..**

**అప్రమత్తంగా ఉండాలన్న అధికారులు**

హైదరాబాద్(జనంసాక్షి): పలు జిల్లాలకు రెడ్, ఆరెంజ్ అలర్ట్‌లను వాతావరణ శాఖ జారీ చేసింది. ఈ నెల 23న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు రెడ్ అలర్ట్, ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, మెదక్, భూపాలపల్లి జిల్లాలకు ఆరెంజ్ జారీ చేసింది. ఈ నెల 24, 25 తేదీల్లో ఉమ్మడి ఆదిలాబాద్

మిగతా 2లో..



## సినీనటుడు మహేశ్‌బాబుకు ఈడీ నోటీసులు

**ఈనెల 27న విచారణకు హాజరుకావాలని ఆదేశిస్తూ తాఖీదులు**

హైదరాబాద్(జనంసాక్షి):ప్రముఖసినీనటుడు మహేశ్‌బాబుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నోటీసులు జారీ చేసింది. ఈనెల 27న విచారణకు హాజరు కావాలని అందులో పేర్కొంది.సాయిసూర్య డెవలపర్స్, సురానా ప్రాజెక్టు కేసుల్లో ఈడీ ఆయనకు నోటీసులు ఇచ్చింది.ఆ రెండు సంస్థలకు మహేశ్‌బాబు ప్రచారకర్తగా ఉన్నారు. పెట్టుబడులు పెట్టేందుకు

మిగతా 2లో..

## తెలంగాణ గర్వించే విధంగా గద్దర్ అవార్డులు

**జూన్ 14న గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డుల ప్రదానోత్సవం : డిప్యూటీ సీఎం భట్టి**



**తెలంగాణ రాష్ట్రంలో ఆ మహానుభావుడు పుట్టడం మన అదృష్టం**

**రాష్ట్ర ఆవిర్భావానికి పునాది వేశారు**

**గత 10 ఏళ్లుసినీపరిశ్రమ నిరాదరణకు గురైంది**

**సమాజంలో అభివృద్ధి, విలువలను ప్రోత్సహించే మీడియాను కాపాడుకోవాల్సిన బాధ్యత పాలకులపై ఉందని వెల్లడి**

హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చిత్ర పరిశ్రమను ప్రోత్సహిస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. తెలుగు చిత్రాలను మాత్రమే కాదు..ఉర్దూ చిత్రాలనూ ప్రోత్సహిస్తామని తెలిపారు. గద్దర్ తెలంగాణ చలన చిత్ర అవార్డులపై నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.' 'తెలంగాణ గుండె చప్పుడును తన పాటల ద్వారా విశ్వవ్యాప్తం చేసిన గొప్ప వ్యక్తిగద్దర్. చిన్నారుల నుంచి వృద్ధుల వరకూ గద్దర్ బాణి, పాటలను అనుకరిస్తారు. గద్దర్ తన పాటలతో తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోశారు. ఆయన పేరు

మిగతా 2లో..

## పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల ఎంపిక

**30 లోపు దరఖాస్తుల ఫీల్డ్ వెరిఫికేషన్ పూర్తి చేయాలి: మంత్రి పొంగులేటి**

**ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ప్రతి దశలో లబ్ధిదారులకు సహకారం అందించాలి**

**భూ భారతి చట్టం ద్వారా ప్రజల భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం**

**ఎల్ఆర్ఎస్ ఫీజులో 25% రాయితీ గడువు పొడిగింపు ఉండదని వెల్లడి**




హైదరాబాద్(జనంసాక్షి):ఇందిరమ్మ ఇళ్లు,భూ భారతి,ఎల్ఆర్ఎస్ పై కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేదల సొంతింటి కల నిజం చేసే దిశగా ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం మొదటి విడత లబ్ధిదారుల ఎంపికను అధికారులు పారదర్శకంగా పూర్తి చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు.మంగళవారం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హైదరాబాద్ సచివాలయం నుంచి రాష్ట్ర సీఎస్ శాంతి కుమారి,పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్, హౌసింగ్ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ గౌతమ్ లతో కలిసి ఇందిరమ్మ ఇళ్లు, భూ భారతి పై కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.

మిగతా 2లో..

## సౌదీలో మోదీకి అరుదైన గౌరవం

**తమ గగనతలంలోకి మోదీ విమానం రాగానే ఫైటర్ జెట్స్‌తో ఘనస్వాగతం**



రియాద్(జనంసాక్షి):ప్రధాని నరేంద్రమోదీ మంగళవారం సౌదీ అరేబియా పర్యటనకు వెళ్లారు. ఈ సందర్భంగా అరుదైన సందర్భం చోటుచేసుకుంది.ఎన్నడూ లేనివిధంగా ఆ దేశం మోదీని ప్రత్యేకంగా స్వాగతించింది. మోదీ ప్రయాణిస్తున్న విమానం సౌదీ అరేబియా గగనతలంలోకి ప్రవేశించగానే.. రాయల్ సౌదీ ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన ఎఫ్-15 విమానాలు దానిని అనుసరించి, సగౌరవంగా స్వాగతించాయి.






## లగచర్ల ఆడబిడ్డలపై దారుణాలకు సీఎం రేవంత్ క్షమాపణ చెప్పాలి

- జాతీయ మానవ హక్కుల నివేదిక మేరకు బాధ్యులైన పోలీసులను సర్వీస్ నుంచి డిస్మిస్ చేయాలి
- కేటీఆర్ డిమాండ్
- అధికారంలోకి వచ్చాక అతి చేసే అధికారులపై కఠిన చర్యలుంటాయని హెచ్చరిక

హైదరాబాద్ (జనంసాక్షి): రాష్ట్ర ముఖ్యమంత్రిగా, హెూం మినిస్టర్‌గా, కొడంగల్ ఎమ్మెల్యేగా లగచర్లలో పోలీసులు చేసిన దౌర్జన్యానికి బాధ్యత తీసుకొని.. సిగ్గు

మిగతా 2లో..





## బీజాపూర్‌లో భారీ ఎన్‌కౌంటర్

**మరోసారి ఎదురుకాల్పులతో దద్దరిల్లిన దండకారణ్యం**

బీజాపుర్ (జనంసాక్షి): ఛత్తీస్‌గఢ్ మరోసారి ఎదురుకాల్పులతో దద్దరిల్లుతోంది. సరిహద్దు జిల్లా బీజాపుర్ అటవీ ప్రాంతంలో మంగళవారం ఉదయం భద్రతా బలగాలు, పోలీసుల మధ్య ఎన్‌కౌంటర్ కొనసాగుతోంది.మావోయిస్టులు ఉన్నారనే సమాచారంతో ఉసూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నంబి అడవుల్లో భద్రతా బలగాలు గాలింపు చేపడుతోన్న తరుణంలో

మిగతా 2లో..

## భారత్‌తో వాణిజ్యఒప్పంద చర్చలకు రోడ్‌మ్యాప్ ఖరారైంది

**పాఠాలు బోధించేందుకు కాదు.. స్నేహితుడిలా వచ్చా: అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్**

న్యూఢిల్లీ(జనంసాక్షి):భారత్‌తో వాణిజ్య ఒప్పంద చర్చలకు రోడ్‌మ్యాప్ ఖరారైందని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ తెలిపారు.యూఎస్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రపంచ దేశాలపై టారిఫ్‌లు విధించిన తరుణంలో వాన్స్ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం భారత్ పర్యటనలో ఉన్న ఆయన వాణిజ్య ఒప్పందం దిశగా ప్రధాని మోదీతో చర్చలు జరిపిన సంగతి తెలిసిందే వాణిజ్య చర్చలకు సంబంధించిన నిబంధనలను అమెరికా, భారత్ అధికారికంగా ఖరారు చేశాయి. ట్రంప్-మోదీ దార్శనికతను సాకారం చేసుకునే దిశగా ఇది కీలక అడుగని నేను భావిస్తున్నాను. మన దేశాల మధ్య ఒప్పందానికి ఇది రోడ్‌మ్యాప్‌గా మారనుంది" అని వాన్స్ అన్నారు. రాజస్థాన్ రాజధాని జైపుర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. "మన బంధాన్ని బలోపేతం చేసుకోవడానికే మేం ఇక్కడకు వచ్చాం. మీరు ఇలాగే చేయాలని అని పాఠాలు చెప్పడానికి మేం రాలేదు. గతంలో అలా జరిగింది. తక్కువ



వేతనాలకు కార్మికులను అందించే దేశంగా భారత్‌ను గత ప్రభుత్వాలు చూశాయి. విమర్శలు చేశాయి. మన రెండు దేశాలు శ్రామిక శక్తిని గౌరవించే భాగస్వాములు. ప్రజాస్వామ్య ప్రపంచంలో అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభుత్వం ఇదే. మోదీకున్న ప్రజామోద రేటింగ్‌లు నాకు అసూయ కలిగించేలా ఉన్నాయి. ఇదే విషయాన్ని మోదీ వద్ద ప్రస్తావించాను.అమెరికాతో

మిగతా 2లో..

## పార్లమెంటే సుప్రీం

**ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్**

న్యూఢిల్లీ(జనంసాక్షి): రాష్ట్రపతిని సుప్రీం కోర్టు ఆదేశించలేదంటూ ఉప రాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర చర్చకు దారితీసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో తాజాగా ఆయన మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. రాజ్యాంగపరమైన అంశాల్లో ఎన్నికైన ప్రజాప్రతినిధులే 'అల్టిమేట్ మాస్టర్స్' అని ధన్‌ఖడ్

మిగతా 2లో..



## బీజాపూర్‌లో భారీ ఎన్‌కౌంటర్

ఈ కాల్పులు మొదలయ్యాయి. ఇక నిన్న సాయంత్రం తెలంగాణ సరిహద్దు నుంచి వేల సంఖ్యలో పారామిలిటరీ బలగాలు ఛత్తీస్‌గఢ్‌కు తరలివెళ్లాయి.

## సమ్మిళిత ఆవిష్కరణల దిశగా హైదరబాద్ అంకుర సదస్సు ఒక ప్రధాన మెట్టు

– కేంద్రమంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్

**హైదరాబాద్(జనంసాక్షి):**సుస్థిరమైన అంకుర వ్యవస్థ కోసం ఆవిష్కరణలు, పరిశ్రమల మధ్య మరింత సమన్వయం అవసరమని కేంద్ర శాస్త్ర-సాంకేతిక, భూవిజ్ఞాన శాఖ సహాయ మంత్రి(స్వతంత్ర).. ప్రధానమంత్రి కార్యాలయం, అణుశక్తి-అంతరిక్ష శాఖలు, సిబ్బంది-ప్రజా ఫిర్యాదులు-పింఛన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. అడ్డంకులను చెరిపేసి పరిశ్రమలు, పెట్టుబడిదారులు, ప్రజలతో సహా భాగస్వాములతో భారతీయ విజ్ఞాన శాస్త్రం ఏకీకృతం కావాల్సిన సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. సీఎస్ఐఆర్-ఐఐసీటీ, సీఎస్ఐఆర్-సీసీఎంబీ, సీఎస్ఐఆర్-ఎన్‌జీఆర్ఐ సంయుక్తంగా హైదరాబాద్‌లో నిర్వహించిన అంకుర సదస్సులో డాక్టర్ జితేంద్ర సింగ్ మాట్లాడుతూ శాస్త్ర విజ్ఞానం, ఆవిష్కరణల్లో భారత్ సమయం వచ్చిందన్నారు. శాస్త్రవేత్తలు, పారిశ్రామికవేత్తలు, విద్యార్థులు, విధాన నిర్ణేతలు హాజరైన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్‌కు చెందిన మూడు సీఎస్ఐఆర్ ప్రయోగశాలలు ఉమ్మడిగా చేపట్టిన అరుదైన కార్యక్రమాన్ని ప్రశంసించారు. “ఒకే గొడుగు కింద శాస్త్ర విజ్ఞానం, పాలన ఏకీకృతమైన ఇలాంటి దృశ్యం” సహకార, సమ్మిళిత ఆవిష్కరణల విషయంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దార్శనికతను ప్రతిబింబిస్తోందని తెలిపారు.

## లగచర్ల ఆడబిడ్డలపై దారుణాలకు సీఎం రేవంత్ క్షమాపణ చెప్పాలి

ఉంటే ముక్కు నేలకి రాసి రేవంత్ రెడ్డి రాజీనామా రాయాలి అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. లగచర్ల ఘటనపై ఎన్‌హెచ్ఆర్సీ సంచలన విషయాలు బయటపెట్టారు. లగచర్ల రైతులను కొట్టి, శారీరకంగా హింసించారని జాతీయ మానవ హక్కుల కమిషన్ దర్యాప్తు బృందం నిర్ధారించిన సంగతి తెలిసిందే. ఇవాళ నందినగర్‌లో కేటీఆర్ నివాసంలో ఆయనను లగచర్ల బాధితులు కలిశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. లగచర్లలో ఎక్స్‌ట్రాలు చేసి ప్రజలను చిత్ర హింసలు పెట్టి, ఆడపిల్లల మీద అఘాయిత్యాలకు పాల్పడ్డ పోలీస్ అధికారులను డిస్మిస్ చేయాలని నేను రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాను అని తెలిపారు. భూసేకరణ కూడా చట్ట విరుద్ధంగా జరిగిందని ఎన్‌హెచ్ఆర్సీ చెప్పింది. దొంగచాటుగా భూసేకరణ చేయడం ఆపకపోతే కంటెంప్ట్ ఆఫ్ కోర్ట్ అవుతుంది అని కేటీఆర్ పేర్కొన్నారు. లగచర్ల రైతులను పోలీసులు చిత్రహింసలు పెట్టి, దారుణంగా కొట్టారని ఎన్‌హెచ్ఆర్సీ రిపోర్ట్‌లో చెప్పారు. సొంత నియోజకవర్గ రైతులను దారుణంగా కొట్టించిన రేవంత్ రెడ్డికి సిగ్గు, ఇజ్జత్ ఉంటే ఈపాటికి రాజీనామా చేయాలి. కానీ రేవంత్ రెడ్డికి ఇజ్జత్ లేదు. పోలీసులు తమపై లైంగిక దాడి చేశారని లగచర్ల మహిళలు ఎన్‌హెచ్ఆర్సీ బృందానికి తెలిపారు. రాత్రిపూట గ్రామంపై పోలీసులు దాడి చేసి మహిళల తొడలపై దారుణంగా కొట్టి, కొట్టినట్టు జడ్జి ముందు చెప్తే ఇంకా దారుణంగా కొడతామని బెదిరించారని గిరిజన మహిళలు ఎన్‌హెచ్ఆర్సీ వాళ్లకు చెప్పారని కేటీఆర్ తెలిపారు.

## భారత్‌తో వాణిజ్య ఒప్పంద చర్చలకు రోడ్‌మ్యాప్ ఖరారైంది

పాటు భారత్ అభివృద్ధి చెందాలని ట్రంప్ కోరుకుంటున్నారు. మన రెండు దేశాల భాగస్వామ్యం వృద్ధి చెందాలన్నదే ట్రంప్ ఆకాం క్ష. ఇక భారత శిల్పాకళా నైపుణ్యం నన్ను అబ్బుర పరిచింది. భారత్.. చరిత్ర, సంప్రదాయాలతో సుసంప˜న్నమైంది. భవిష్యత్తు పట్ల భారత్ దార్శనికత మెచ్చుకోద గినది. అభివృద్ధి చెందేందుకు భారత్‌లో ఎన్నో అవకాశాలున్నాయి. అలాగే ఏదో సాధించాలనే తపన భారతీ యుల్లో అధికం” అని వాన్స్ కొనియాడారు. కాగా.. అమెరికాకు వివిధ దేశాల నుంచి వచ్చే దిగుమతులపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పన్నుల మోత మోగించిన సంగతి తెలిసిందే. అన్ని దేశాల వారూ తమ ఉత్పత్తులను అమెరికా మార్కెట్లో విక్రయించుకోవచ్చని.. అయితే కనీసం 10% సుంకం చెల్లించాలని ఆయన స్పష్టం చేశారు. భారత్ తమ ఉత్పత్తులపై 52% సుంకం విధిస్తున్నందున, తాము 26% సుంకం విధిస్తున్నట్లు స్పష్టం చేశారు. అయితే ఆ తర్వాత ప్రతీకార సుంకాలను 90 రోజుల పాటు వాయిదా వేస్తూ నిర్ణయం తీసుకున్నారు. భారత్, అమెరికా మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదిరేందుకు తగిన సమయం లభిస్తుందని అప్పట్లో అభిప్రాయం వ్యక్తమైంది. అనుకున్నట్టుగానే ఇప్పుడు ఆ దిశగా అడుగులు పడుతున్నాయి. భారత్- అమెరికా మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంలో కీలక ముందడుగు పడింది. వాణిజ్య చర్చల కోసం రోడ్ మ్యాప్‌ను వివరించే సూచనలు, నిబంధనలపై ఇరు దేశాలు ఓ అంగీకారానికి వచ్చాయి. త్వరలో జరగబోయే చర్చలు ఈ విషయంలో సమతూకం పాటించడానికి దోహదపడతాయని యూఎస్ వాణిజ్య ప్రతినిధి జేమిసన్ గ్రీర్ పేర్కొన్నారు. యూఎస్ వాణిజ్య ప్రతినిధుల కార్యాలయం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో గ్రీర్ మాట్లాడుతూ.. అమెరికా- భారత్ వాణిజ్య సంబంధాలలో ఇప్పటివరకు పలు లోపాలు ఉన్నాయని అన్నారు. అమెరికన్ వస్తువులకు కొత్త మార్కెట్లను తెరవడం, ఇక్కడి కార్మికులకు హాని కలిగించే అన్యాయమైన పద్ధతులను తొలగించడం వంటి విషయాలపై ప్రస్తుతం భారత్‌తో చర్చిస్తున్నామన్నారు.

అంబర్ కోటను సందర్శించిన జేడీ వాన్స్ దంపతులు

అగ్రరాజ్య ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశమయిన అనంతరం ఈ ప్రకటన వెలువడింది. ఇరుదేశాల నేతలు ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదుర్చుకునేందుకు భారత్, అమెరికా కొనసాగిస్తున్న చర్చల్లో పురోగతిపై సంతృప్తి వ్యక్తంచేశారు.

## హిరోషిమా-తెలంగాణ ఆటోమోటివ్, మొబిలిటీ కారిడార్

ఆతిథ్యానికి హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు. శాంతితో పాటు సాంకేతిక పురోగతిలో హిరోషిమా ప్రపంచంలోనే ప్రత్యేక గుర్తింపు సాధించిందని అన్నారు. తెలంగాణ కూడా కొత్త ఆవిష్కరణలు, సుస్థిర విధానాలు, శాంతియుత వాతావరణానికి కట్టుబడి ఉందని అన్నారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, తెలంగాణ, హిరోషిమా కలిసి పని చేయగలిగే రంగాలపై విస్తృతంగా చర్చలు జరిపారు. వ్యర్థాల నుంచి ఇంధనం లాంటి క్లీన్ టెక్నాలజీ, మున్సిపాలిటీల్లో వ్యర్థాల ప్రాసెసింగ్, మురుగు నీటి శుద్ధి, పునరుత్పాదక విద్యుత్తు ప్రాజెక్టులు, అర్బన్ ఇన్నోవేషన్, ఇన్‌ఫ్రా స్ట్రక్చర్, హైదరాబాద్లో విపత్తుల నివారణ డిజైన్లు, భూగర్భ మెట్రో ఇంజనీరింగ్, స్మార్ట్ సిటీ సొల్యూషన్స్, పారిశ్రామిక సహకారం, ఎలక్ట్రిక్ వాహనాలు, ఎలక్ట్రానిక్స్, అధునాతన ఉత్పత్తుల తయారీకి హిరోషిమా-తెలంగాణ ఆటోమోటివ్ అండ్ మొబిలిటీ కారిడార్ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనలను ప్రస్తావించారు. వీటితో పాటు విద్య, సాంస్కృతిక మార్పిడి కార్యక్రమాలు,



హిరోషిమా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీతో తెలంగాణలోని ప్రముఖ విశ్వవిద్యాలయాల మధ్య సంబంధాలు, పరిశోధనలకు సహకారం, తెలంగాణ సంస్కృతి, శాంతి, పర్యాటకం, పీస్ పార్క్, సాంస్కృతిక ప్రదర్శనలు, బౌద్ధ వారసత్వానికి సహకరించాలని కోరారు.

## సౌదీలో మోదీకి అరుదైన గౌరవం

దీనికి సంబంధించిన వీడియోను విదేశాంగశాఖ షేర్ చేసింది. రెండు దేశాల మధ్య రక్షణ సహకారాన్ని మరింత బలోపేతం చేసుకునే దిశగా అడుగులు పడతాయని ఈ ఆత్మీయ స్వాగతం చాటుతోంది. ప్రధాని రెండు రోజుల పర్యటనలో భాగంగా ఈ రోజు సౌదీ వెళ్లారు. ఇంధనం, వాణిజ్యం, రక్షణ వంటి పలు కీలక రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవడం లక్ష్యంగా ఈ పర్యటన సాగనుంది. మోదీ, సౌదీ అరేబియా యువరాజు మొహమ్మద్ బిన్ సల్మాన్‌ల నడుమ ఇటీవల జరిగిన చర్చల తర్వాత ఇరుపక్షాల మధ్య పలు ఒప్పందాలు కుదిరాయి. భారత్, సౌదీ అరేబియాల మధ్య ఇప్పటికే బలమైన వ్యూహాత్మక భాగస్వామ్యం ఉంది. సౌదీ అరేబియా యువరాజు మొహమ్మద్ బిన్ సల్మాన్ ఆహ్వానం మేరకు ప్రధాని మోదీ జెడ్డాలో ల్యాండ్ అయ్యారు.



## జమ్మూకాశ్మీర్‌లో పర్యాటకులపై మిలిటెంట్ల దాడి

మినీ స్విట్జర్లాండ్‌గా పేరొందిన బైసరన్ ప్రాంతంలో విహారానికి వచ్చిన వారిపై పాశవిక దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో 27 మంది పర్యటకులు ప్రాణాలు కోల్పోగా.. మరో 20 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవల కాలంలో జమ్మూకశ్మీర్‌లో అతిపెద్ద ఉగ్ర ఘటన ఇదేనని ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా పేర్కొన్నారు. మంగళవారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో బైసరన్ ప్రాంతంలో ఉన్న దాదాపు 40 మంది పర్యటకులను అటవీ ప్రాంతం నుంచి వచ్చిన ఉగ్రవాదులు ఒక్కసారిగా చుట్టుముట్టారు. అనంతరం విచక్షణా రహితంగా కాల్పులకు తెగబడ్డారు. దీంతో కొంతమంది అక్కడికక్కడే కుప్పకూలగా.. అనేక మంది తీవ్ర గాయాలపాలయ్యారు. రక్తపు మడుగులో పడిఉన్న మృతదేహాలతో స్థానికంగా భీతావహ వాతావరణం నెలకొంది. తమ వారిని కాపాడాలంటూ పలువురు విజ్ఞప్తి చేస్తున్న దృశ్యాలు బయటకు వచ్చాయి. ఈ ప్రాంతానికి కేవలం కాలినడకన లేదా గుర్రాలపై మాత్రమే చేరుకునే అవకాశం ఉండటంతో బాధితులను తరలించడం కష్టమైంది. బైసరన్‌లో కాల్పుల శబ్దం వినిపించడంతో వెంటనే అప్రమత్తమైన భద్రతా బలగాలు హుటాహుటిన ఘటనా ప్రాంతానికి తరలివెళ్లాయి. గాయపడిన వారిని హెలికాప్టర్ ద్వారా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే స్థానికులు గుర్రాల సాయంతో పలువురిని తీసుకెళ్లినట్లు సమాచారం. తొలుత మృతుల సంఖ్య తక్కువగానే ఉన్నట్లు పేర్కొన్నప్పటికీ.. ప్రస్తుతం 27కి చేరినట్లు తెలుస్తోంది. గాయపడిన వారిలో మరికొందరి పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్లు సమాచారం. మరోవైపు.. కాల్పుల ఘటనతో పహల్గాం వీధులు నిర్మానుష్యంగా మారాయి. పర్యటకులు సైతం సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లినట్లు తెలిసింది.

**అమర్‌నాథ్ యాత్ర వేళ..**

38 రోజుల పాటు కొనసాగే అమర్‌నాథ్ యాత్ర జులై 3 నుంచి ప్రారంభం కానుంది. దేశవ్యాప్తంగా లక్షల మంది యాత్రికులు రెండు మార్గాల్లో ఇక్కడకు చేరుకుంటారు. అనంత్‌నాగ్ జిల్లాలో పహల్గాం మార్గంలోనే 48 కి.మీ మేర ఉండగా.. 14కి.మీ మార్గం గందేర్బల్ జిల్లా నుంచి ఉంటుంది. ఈ నేపథ్యంలో పర్యటకులపై ఉగ్రవాదులు దాడికి తెగబడటం ఆందోళన కలిగిస్తోంది.

**ఉగ్ర దాడిని తీవ్రంగా ఖండించిన మోదీ**

మ్ముకశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఇవాళ పర్యటకులపై జరిగిన ఉగ్ర దాడిని ప్రధాని నరేంద్ర మోదీ తీవ్రంగా ఖండించారు. సౌదీ పర్యటనలో ఉన్న ఆయన కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో ఫోన్‌లో మాట్లాడారు. జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఇవాళ పర్యటకులపై జరిగిన ఉగ్ర దాడిని ప్రధాని నరేంద్ర మోదీ తీవ్రంగా ఖండించారు. సౌదీ పర్యటనలో ఉన్న ఆయన కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో ఫోన్‌లో మాట్లాడారు. దాడి ఘటన గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఘటనపై తగిన చర్యలు తీసుకోవాలని, తక్షణమే ఘటనా స్థలానికి వెళ్లి పరిస్థితిని సమీక్షించాలని అమిత్‌షాను ప్రధాని ఆదేశించారు. ఈ ఉగ్రదాడిపై అమిత్ షా స్పందిస్తూ.. పర్యటకులపై దాడి తీవ్రంగా బాధించిందన్నారు. దాడికి పాల్పడిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని చెప్పారు. నేరస్థులపై అత్యంత కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఘటన గురించి ప్రధాని మోదీకి వివరించానని, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించానని చెప్పారు. అత్యవసర భద్రతా సమీక్ష కోసం తాను శ్రీనగర్ వెళ్తున్నానిని వెల్లడించారు. ఈ మేరకు కేంద్ర హోంమంత్రి ట్వీట్ చేశారు. కాగా ఈ ఉగ్రదాడిని జమ్మూకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా కూడా ఖండించారు. దీనిని హేయమైన చర్యగా పేర్కొన్నారు. దాడికి పాల్పడినవారు మానవ మృగాలని, ఘటనను ఖండించేందుకు మాటలు రావడం లేదని సోషల్ మీడియా వేదికగా ఒమర్ ఆవేదన వ్యక్తం చేశారు. దిల్లీ: జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రదాడి ఘటనపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రధాని నరేంద్ర మోదీ సహా పలువురు నేతలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దీన్ని అత్యంత హేయమైన ఘటనగా పేర్కొన్నారు. ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తూ ‘ఎక్స్’ వేదికగా పోస్టులు పెట్టారు. “పహల్గాం ఉగ్రదాడి దిగ్భ్రాంతికరం. ఇదొక క్రూరమైన, అమానవీయ చర్య. అమాయక పౌరులను లక్ష్యంగా చేసుకోవడం భయానకం. ఇది క్షమించరానిది. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నా. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నా” అని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పోస్ట్ చేశారు. పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిని ప్రధాని నరేంద్ర మోదీ తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనపై కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో ఫోన్‌లో మాట్లాడిన ఆయన.. ఈ ఘటనలో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ‘ఎక్స్’లో పోస్టు పెట్టారు. అత్యంత హేయమైన ఈ చర్య వెనుక ఉన్నవారిని చట్టం ముందుకు తీసుకొస్తామని.. వారిని వదిలిపెట్టబోమన్నారు. ఉగ్రమూకల దుష్ట ఎజెండా ఎప్పటికీ విజయవంతం కాదన్నారు. ఉగ్రవాదంపై పోరాడాలనే తమ సంకల్పం దృఢమైనదన్న ప్రధాని.. అది మరింతగా బలపడుతుందని స్పష్టంచేశారు.

దొంగ దెబ్బలతో భారతీయుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయలేరు: సీఎం రేవంత్ రెడ్డి జమ్మూకశ్మీర్‌లో ఉగ్రకాల్పుల్లో పదుల సంఖ్యలో పర్యాటకులు మృతిచెందిన ఘటనపై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దుశ్చర్యను ఖండించారు. ఇలాంటి దొంగదెబ్బలతో భారతీయుల ఆత్మ స్థైర్యాన్ని దెబ్బతీయలేరన్నారు. ఉగ్రవాద మూకల విషయంలో అత్యంత కఠినంగా వ్యవహరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని దేవుడిని ప్రార్థిస్తూ.. బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

తీవ్ర ఆవేదన కలిగించింది: ఏపీ సీఎం చంద్రబాబు

పహల్గామ్‌లో అమాయకులైన పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడి ఘటన తీవ్ర ఆవేదనకు గురిచేసిందని ఏపీ సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఉగ్రమూకల పాశవిక ఘటనను ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ దాడిలో బాధిత కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపిన సీఎం.. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు. తీవ్ర పరిణామాలు ఎదుర్కోకోక తప్పదు: గజేంద్ర సింగ్ షెకావత్ ఉగ్రదాడి ఘటనపై కేంద్ర పర్యటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దీన్ని పిరికిపంద చర్యగా పేర్కొన్న ఆయన.. ఈ కిరాతక దాడికి పాల్పడిన వారు తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఉగ్రదాడుల కారకుల్ని వదిలిపెట్టే ప్రసక్తే లేదు: కిషన్‌రెడ్డి జమ్మూకశ్మీర్ ఉగ్రదాడి ఘటన పట్ల కలతచెందినట్లు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు.

## పార్లమెంటే సుప్రీం

పేర్కొన్నారు. మంగళవారం ఒక కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ‘ఎన్నికైన ప్రజాప్రతినిధులు జవాబుదారీతనంగా ఉండాలి. ఎమర్జెన్సీ విధించిన ప్రధాని అయినా సరే. ప్రజలకు రక్షణ కల్పించేందుకే ప్రజాస్వామ్యం. రాజ్యాంగపరమైన అంశాల్లో ప్రజాప్రతినిధులే అల్టిమేట్ మాస్టర్స్. పార్లమెంట్ కంటే అత్యుత్తమమైనది ఉందని రాజ్యాంగంలో ఎక్కడా లేదు. పార్లమెంటే సుప్రీం’ అని ధన్‌ఖడ్ వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీ సమయం గురించి కూడా ధన్‌ఖడ్ ప్రస్తావించారు. ఎమర్జెన్సీ సమయంలో ప్రాథమిక హక్కుల ఉల్లంఘన జరిగిందన్నారు. రాష్ట్ర గవర్నర్ పంపిన బిల్లులకు రాష్ట్రపతి నిర్ణీత గడువులోపు సమ్మతి తెలపాలని సుప్రీంకోర్టు గడువు నిర్ణయిస్తూ ఇటీవల తీర్పునిచ్చింది. దీనిపై ధన్‌ఖడ్ మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. “రాష్ట్రపతికి గడువు నిర్దేశించేలా న్యాయవ్యవస్థ వ్యవహరించడం తగదు. ప్రజాస్వామ్యశక్తులపై అణుక్షిపణిని సుప్రీంకోర్టు ప్రయోగించరాదు. ఇప్పుడు.. శాసనాలు చేయగలిగే జడ్జీలు మనకు ఉన్నారు! కార్యనిర్వాహక విధులూ వారే నిర్వర్తించేస్తారు. సూపర్ పార్లమెంటులా వ్యవహరిస్తారు. వారికి మాత్రం ఎలాంటి జవాబుదారీతనం ఉండదు. ఎందుకంటే దేశ చట్టాలు వారికి వర్తించవు” అని అన్నారు. ఇదే అంశంపై భాజపా ఎంపీ నిషికాంత్ దూబే చేసిన వ్యాఖ్యలు మరింత చర్చనీయాంశంగా మారిన సంగతి తెలిసిందే. “ఒకవేళ సుప్రీంకోర్టు చట్టాలు చేస్తే గనుక.. పార్లమెంట్ భవనాన్ని మూసివేయాలి” అని ఎంపీ వ్యాఖ్యానించారు. అయితే భాజపా నేతల

## పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల ఎంపిక

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పేదవాడు సొంత ఇండ్లు నిర్మించుకునేందుకు ప్రజా ప్రభుత్వం ఐదు లక్షల రూపాయలను ఉచితంగా సబ్సిడీ కింద అందిస్తుందని, దేశంలో మరే రాష్ట్రంలో ఇంత పెద్దగా సాయం అందడం లేదని, మిగిలిన రాష్ట్రాల్లో లక్షన్నర నుంచి 3 లక్షల వరకు ప్రభుత్వాలు సహాయం చేస్తుంటే మన తెలంగాణ ప్రభుత్వం ప్రతి ఇంటి నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలను అందిస్తుందని మంత్రి తెలిపారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి మొదటి విడత లో 3 వేల 500 ఇండ్లను ప్రభుత్వం మంజూరు చేస్తుందని, ఇందిరమ్మ ఇండ్ల పనుల పురోగతి పర్యవేక్షించేందుకు నియోజకవర్గానికి ఒక ప్రత్యేక అధికారిని నియమించాలని అన్నారు. మనకు వచ్చిన ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తులు, జనాభా ఆధారంగా గ్రామాలకు, మున్సిపల్ వార్డులకు ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపు పూర్తి చేయాలని అన్నారు. గ్రామాలు, మున్సిపల్ వార్డులో ఉన్న ఇందిరమ్మ కమిటీల ద్వారా ఇందిరమ్మ ఇండ్లకు అర్హుల జాబితా ఎంపిక చేయాలని, ఇందిరమ్మ కమిటీ ఆమోదించిన ప్రతి 200 ఇండ్లకు ఒక ప్రత్యేక అధికారిని నియమించి ఏప్రిల్ 30 లోపు మరో సారి ఫీల్డ్ వెరిఫికేషన్ పూర్తి చేయాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక పూర్తి నాణ్యతతో పారదర్శకంగా జరగాలని, ఇందిరమ్మ కమిటీలు అందించిన జాబితాలో ఎవరైనా అనర్హులు ఉంటే మంజూరు చేసే జాబితా నుంచి తొలగించాలని అన్నారు. ప్రతి మండలంలో ఎంపిక చేసిన పైలెట్ గ్రామంలో మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్లలో బేస్మెంట్ లెవల్ పూర్తి చేసుకున్న వారికి మొదటి విడత కింద లక్ష రూపాయలను ఇటీవలే విడుదల చేశామని అన్నారు. ఇందిరమ్మ ఇండ్లు పెద్ద సంఖ్యలో గ్రౌండ్ అవుతున్న నేపథ్యంలో ఎక్కడ సామాగ్రి ధరలు పెరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, వ్యాపారులు ఎక్కడ కృత్రిమ కొరత సృష్టించకుండా చూడాలని మంత్రి పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఇసుక కొరత రాకుండా చూడాలని, బలహీన వర్గాల ఇంటి నిర్మాణానికి ఉచితంగా సరఫరా చేయాలని ప్రభుత్వ మార్గదర్శకాలు ఉన్నందున, ప్రతి మండల కేంద్రంలో ఇసుక అందుబాటులో పెట్టాలని మంత్రి తెలిపారు. మండలంలో నిర్మించిన మోడెల్ ఇండ్లు నమూనాలను లబ్ధిదారులకు చూపించాలని మంత్రి అధికారులకు సూచించారు. పేదలకు ఇంటి నిర్మాణంలో ప్రతి దశ లోను అధికారులు సహాయం అందించాలని మంత్రి పేర్కొన్నారు.

## తెలంగాణ గర్వించే విధంగా గద్దర్ అవార్డులు

మీద అవార్డులు ప్రదానం చేయడం హర్షణీయం. హైదరాబాద్‌లో జరిగే చలన చిత్ర అవార్డులు ఘనంగా నిర్వహించాలి. అందుకు కావాల్సిన సహాయ సహకారాలను ప్రభుత్వం నుంచి అందిస్తాం” అని అన్నారు. జూన్ 14న గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డుల ప్రదానోత్సవం ఉంటుందని ఈ కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ దిల్ రాజు పేర్కొన్నారు. సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి మాట్లాడుతూ గద్దర్ సినిమా అవార్డుల ఫంక్షన్ కార్యక్రమాన్ని నభూతో నా భవిష్యత్తు అన్నట్టుగా జరపాలి అందుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారం ఉంటుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు భరోసా ఇచ్చారు. హైదరాబాదులో నిర్వహించబోయే గద్దర్ చలనచిత్ర అవార్డుల ఫంక్షన్ గురించి ప్రపంచవ్యాప్తంగా మాట్లాడుకునేలా కార్యక్రమాన్ని నిర్వహించాలని కమిటీ సభ్యులు, అధికారులకు డిప్యూటీ సీఎం సూచించారు. గత పది సంవత్సరాలు రాష్ట్రంలో చలనచిత్ర పరిశ్రమ నిరాదరణకు గురైంది అన్నారు. 2011లో చలనచిత్ర అవార్డుల పంపిణీ కార్యక్రమం నిలిచిపోయి ప్రోత్సాహం కరువైంది అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో గద్దర్ పుట్టడం మన అదృష్టం, దశాబ్దానికి ఒకరు అలాంటి మహానుభావులు పుడతారు అని కీర్తించారు. తెలంగాణ సంస్కృతి, గుండె చప్పుడును విశ్వవ్యాప్తం చేసిన మహానుభావుడు గద్దర్ అని తెలిపారు. తెలంగాణ సంస్కృతి భావజాలాన్ని రాష్ట్రానికి దేశానికి ప్రపంచానికి స్పష్టమైన మార్గంలో గద్దర్ ప్రచారం చేశారని వివరించారు. ఆయన బానిని చిన్నపిల్లలు నుంచి ముసలి వాడి వరకు అనుకరించారని తెలిపారు. సింగరేణి ప్రాంతంలో తెలంగాణ రాష్ట్ర సాధన డిమాండ్తో గద్దర్ పాదయాత్ర చేసి ప్రత్యేక రాష్ట్రానికి నాంది పలికారని వివరించారు. ఎక్కడో ఉన్న చిత్ర పరిశ్రమను కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్కు తరలించి ప్రోత్సహించింది అన్నారు. చిత్ర పరిశ్రమను తరలించి ప్రోత్సాహకాలు అందించడమే కాదు, సినీ పరిశ్రమ లో పనిచేసే వారికి ఇళ్ల స్థలాలను సైతం కేటాయించాం అన్నారు. సమాజంలో అభివృద్ధి, విలువలను ప్రోత్సహించేది మీడియానే, మీడియాను కాపాడుకునే బాధ్యత పాలకులపై ఉంది అన్నారు. ప్రజల జీవన ప్రమాణాల పెరుగుదలకు బాధ్యత గల ప్రభుత్వాలు బలమైన సినిమా రంగం ద్వారానే సమాజానికి సందేశం ఇవ్వాలన్నారు. దశబ్ద కాలంగా ప్రోత్సాహకానికి నోచుకోని సినీ రంగానికి చేయూతనివ్వాలని సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు.

## అన్ని విభాగాల్లో ‘అల్ఫోర్స్’దే హవా





**రాష్ట్రస్థాయి అత్యుత్తమ మార్కులతో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో..**

**– ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డా.వి.నరేందర్ రెడ్డి**

**కరీంనగర్ బ్యూరో, ఏప్రిల్ 22 (జనం సాక్షి) :**మంగళవారం ప్రకటించిన ఇంటర్మీడియట్ ప్రథమ , ద్వితీయ సంవత్సర ఫలితాలలో అల్ఫోర్స్ జూనియర్ కళాశాలలకు చెందిన వివిధ విభాగాల విద్యార్థిని విద్యార్థులు తెలంగాణ రాష్ట్రస్థాయి అత్యుత్తమ మార్కులను సాధించారని అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్ రెడ్డి తెలిపారు. వారు ఈ సందర్భంగా మాట్లాడుతూ...సీనియర్ ఇంటర్మీడియట్ బైపిసి విభాగంలో 1000 మార్కులకు గాను జె. అంజనా 997 మార్కులు సాధించి రాష్ట్రములో అగ్రగామిగా నిలవడం జరిగింది. 11 మంది విద్యార్థులు 990 అపై మార్కులు సాధించారు. ఎంపీసీ విభాగంలో 1000 మార్కులకు కె. రుత్విక్ 996 రాష్ట్రములో అత్యున్నత స్థానంలో నిలిచాడు. ఎం.ఇ సి విభాగంలోను 1000 మార్కులకు గాను వి. అక్షయ్వర్ధన్ 988. వి. రిషీత 988, మార్కులు సాధించారు. సిఇసి విభాగంలోను 1000 మార్కులకు గాను బి. గ్రీష్మా 987 మార్కులు సాధించారు. జూనియర్ ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ విభాగంలో 470 మార్కులకు గాను ఎస్. లహరి 468 హప్సహస్నాన్ 468, తహూరా నూర్ 468. టి. అన్విత రెడ్డి 468 సి. హెచ్. అమతౌరాజ్ 468, పి. కిర్తిశ్రీ 468, జె. ప్రసూనాశ్రీ 468 ఎన్. క్రిష్ణవేణి 468, జి. తరుణ్ 468, డి. నాగాసాగర్ 468, జె.ప్రణవ్హ 468, జి. సూర్యప్రకాశ్ 468, ఎ. శశివర్ధన్రెడ్డి 468, ఎల్. హాసిని 468, యమ్. శ్వేత 468, కె. పల్లవి 468, కె. అనుపమ 468, ఏ నిచిత 468, జి. తరుణ్ 468 జి. లక్ష్మిప్రియ 468. 66 మంది విద్యార్థులు 467 మార్కులు సాధించి అల్ఫోర్స్ ఖ్యాతిని పెంచారు. బైపీసి విభాగంలో 440 మార్కులకు గాను నభిలాతరీమ్ 438, జోహ మహవీష్ 438, సామాపిరదోష్ 438 మార్కులు సాధించారు. 10 మంది విద్యార్థులు 437 అపై మార్కులు సాధించారు. ఎంఈసి విభాగంలో 500 మార్కులకు గాను ఆర్. చిద్విలాస 491, మార్కులు, సిఈసి విభాగంలో 500 మార్కులకు గాను పి. భవజ్ఞ 493 మార్కులు సాధించారు. విద్యార్థులకు అత్యుత్తమ విద్యద్వారా సంచలనాత్మక విజయాలను నమోదు చేయవచ్చని నాణ్యమైన భోధన ద్వారా అద్భుతాలు సృష్టించవచ్చన్నారు అద్భుత మార్కులు సాధించిన అణిముత్యాలను, వారి తల్లిదండ్రులను అభినందిస్తూన్నానని తెలిపారు.

## సివిల్స్ ఫలితాలు విడుదల

ఆ తర్వాత హర్షిత గోయెల్, డోంగ్రే అర్చిత్ పరాగ్, షా మార్గి చిరాగ్, ఆకాశ్ గార్గ్, కోమల్ పూనియా వరుసగా రెండు, మూడు, నాలుగు, ఐదు, ఆరు ర్యాంకులు సాధించారు. ఆయుషి బన్సల్, రాజ్‌కృష్ణ ఝా, ఆదిత్య విక్రమ్ అగర్వాల్, మయాంక్ త్రిపాఠిలు వరుసగా 6 నుంచి 10 ర్యాంకులు దక్కించుకున్నారు. కాగా కేంద్ర ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో మొత్తం 1056 ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ తదితర పోస్టుల భర్తీకి గత ఏడాది ఫిబ్రవరిలో నోటిఫికేషన్ విడుదలైంది. జూన్ 16న ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహించారు. అందులో అర్హత సాధించిన వారికి సెప్టెంబర్ 20 నుంచి 29వ వరకు మెయిన్స్ పరీక్షలు నిర్వహించారు. మెయిన్స్‌లో సత్తాచాటిన వారికి జనవరి 7 నుంచి ఏప్రిల్ 17 వరకు దశల వారీగా పర్సనల్ ఇంటర్వ్యూలు చేశారు. తాజాగా తుది ఫలితాలను ప్రకటించారు. మొత్తం 1,009 మందిని యూపీఎస్సీ ఎంపిక చేయగా జనరల్ కేటగిరీలో 335 మంది, ఈడబ్ల్యూఎస్ నుంచి 109 మంది, ఓబీసీ నుంచి 318 మంది, ఎస్సీ కేటగిరీలో 160 మంది, ఎస్టీ కేటగిరీ నుంచి 87 మంది చొప్పున ఉన్నారు.

**తండ్రి ప్రోత్సాహంతోనే విజయం సాధించా : సివిల్స్ రెండో ర్యాంకర్**

సివిల్ సర్వీసెస్ ఫలితాల్లో గుజరాత్‌కు చెందిన హర్షిత గోయల్ సత్తా చాటారు. ఆలిండియా ర్యాంకింగ్స్‌లో ఆమె రెండో ర్యాంకును సొంతం చేసుకున్నారు. సివిల్స్‌లో ఇంత అద్భుత విజయం దక్కడంపట్ల ఆమె ఆనందం వ్యక్తంచేశారు. తన కుటుంబం నుంచి తానే మొదటి సివిల్ సర్వెంట్ కాబోతున్నానని అన్నారు. సివిల్స్ లక్ష్యం వైపు ప్రయాణంలో తన కుటుంబం నుంచి ఎంతో మద్దతు లభించిందని హర్షిత తెలిపారు. తల్లి లేకపోయినా తన తండ్రి అన్ని విధాలుగా ఎంతగానో ప్రోత్సహించారని ఈ సందర్భంగా హర్షిత గుర్తుచేసుకున్నారు. తన స్నేహితులూ సపోర్టు చేశారని ఆమె చెప్పారు. ప్రజల జీవితాల్లో మరీ ముఖ్యంగా మహిళల జీవితాల్లో మార్పు తీసుకురావాలనే లక్ష్యంతో ఐఏఎస్ కావాలనుకుంటున్నట్లు ఆమె వెల్లడించారు. కాగా కేంద్ర ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ వంటి పోస్టుల భర్తీకి గతేడాది ఫిబ్రవరిలో నోటిఫికేషన్ ఇచ్చిన విషయం తెలిసిందే. జూన్ 16న ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహించిన యూపీఎస్సీ.. ఇందులో అర్హత సాధించిన వారికి సెప్టెంబర్ 20 నుంచి 29వ తేదీ వరకు మెయిన్స్ పరీక్షలు నిర్వహించింది. మెయిన్స్‌లో సత్తా చాటిన వారికి జనవరి 7 నుంచి ఏప్రిల్ 17వరకు దశల వారీగా పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి తాజాగా తుది ఫలితాలను ప్రకటించింది. ఈ ఫలితాల్లో 1,009 మందిని ఐఏఎస్, ఎఫ్ఎస్, ఐపీఎస్, సెంట్రల్ సర్వీసెస్ గ్రూప్ ఎ, గ్రూప్ బి సర్వీసులకు ఎంపిక చేయగా.. వీరిలో జనరల్ కేటగిరీలో 335 మంది, ఈడబ్ల్యూఎస్ నుంచి 109, ఓబీసీ నుంచి 318, ఎస్సీ కేటగిరీలో 160, ఎస్టీ కేటగిరీ నుంచి 87మంది చొప్పున ఉన్నారు. 241 మంది అభ్యర్థుల అభ్యర్థిత్వాన్ని ప్రొవిజనల్ జాబితాను రూపొందించి ఉంచిన యూపీఎస్సీ.. ఒకరి ఫలితాన్ని నిలిపివేసినట్లు పేర్కొంది. అలాగే, సివిల్ సర్వీసెస్ నిబంధనలను అనుసరించి సివిల్స్ సాధించిన వారిలో 230 మంది అభ్యర్థులను రిజర్వు జాబితాలో ఉంచినట్లు వెల్లడించింది. ఈ ఫలితాలకు సంబంధించి ఏదైనా సమాచారం కావాలనుకొనేవారి కోసం యూపీఎస్సీ క్యాంపస్‌లోని పరీక్షా హాల్ వద్ద కౌంటర్‌ను ఏర్పాటు చేసినట్లు యూపీఎస్సీ తెలిపింది.

## సినీనటుడు మహేశ్‌బాబుకు ఈడీ నోటీసులు

ఆయన ఇన్‌ఫ్లుయెన్స్ చేశారనే అభియోగంపై ఈడీ నోటీసులు జారీ చేసింది. మహేశ్‌బాబుకు ఆయా సంస్థలు చెల్లించిన పారితోషికంపై ఆరా తీయనుంది.

## ఎండలు బాబోయ్..

జిల్లాకు, ఉమ్మడి నిజామాబాద్, జగిత్యాల జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇవాళ, రేపు, ఎల్లుండి వడగాలులు వీచే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వృద్ధులు, పిల్లలు బయటకు రావొద్దని సూచించింది. రేపట్నుంచి 3 రోజుల పాటు 45 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది.

# సాగులో ఉన్న ప్రతి రైతుకు న్యాయం

- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



**యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో ఏప్రిల్ 22 (జనం సాక్షి):** భూ భారతి ద్వారా సాగులో ఉన్న ప్రతి రైతుకు న్యాయం జరుగుతుందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. భూభారతి పేదలు, బడుగు, బలహీన వర్గాలు, రైతులకు, భూములున్న ఆసాముల కోసం తీసుకొచ్చిందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన తెలంగాణ భూ భారతి- 2025 చట్టంపై నిర్వహిస్తున్న అవగాహన సదస్సులలో భాగంగా మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా,వలిగొండ మండల కేంద్రంలో శ్రీ వెంకటేశ్వర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రంలోని 4 మండలాలను పైలెట్ ప్రాజెక్టు కింద తీసుకున్నామని, ఈ నెలాఖరు నాటికి ఈ పైలెట్ ప్రాజెక్టు పూర్తవుతుందని, జూన్ 2 నుంచి ఈ పైలెట్ మండలాలలో వ్యవసాయ భూముల సమస్యలను శాశ్వతంగా పరిష్కరించనున్నామని తెలిపారు. మే 1 నుంచి అన్ని జిల్లాలలో ఒక మండలాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద తీసుకోనున్నామని, జూన్ 2 నుంచి ప్రతి గ్రామానికి తహసీల్దార్ స్థాయి అధికారులు గ్రామానికి వచ్చి భూ సమస్యల పై దరఖాస్తులు తీసుకుంటారని, రైతులు ఒక్క రూపాయి కూడా చెల్లించకుండా రెవెన్యూ సమస్యలను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. రైతుల భూముల సర్వే కోసం 6000 మంది లైసెన్స్ సర్వేయర్లను నియమించనున్నామని, ప్రతి గ్రామానికి ఒక గ్రామ పరిపాలన అధికారి చొప్పున 10695 మందిని వచ్చే నెల మొదటి వారం నుంచి పంపించనున్నామని ఆయన వెల్లడించారు.ప్రతి మనిషికి ఆధార్ లాగే భూధార్ కార్డు ను ఇచ్చి ఖాతా నెంబర్ ను ఇవ్వనున్నమన్నారు. గతంలో భూములు అమ్మిన, కొన్ని మ్యాపింగ్ లేదని, ఇకపై రాష్ట్ర వ్యాప్తంగా భూమి రిజిస్ట్రేషన్ సమయంలోనే సర్వే మ్యాప్ ను తప్పనిసరిగా ఏర్పాటు చేసేలా చట్టంలో తీసుకురావడం జరిగిందని వెల్లడించారు. సాదా బైనామాలకు ధరణిలో ఎలాంటి అవకాశం లేదని, భూ భారతిలో దీనిని పరిష్కరించనున్నామని, తొమ్మిది లక్షల 26 వేల సాదా బైనామా దరఖాస్తులున్నాయని, వాటిలో న్యాయమైన వాటిని పరిష్కరిస్తామని తెలిపారు.

ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య మాట్లాడుతూ ప్రతి పేద వాడి కన్నీళ్లు తుడిచేందుకు తీసుకువచ్చిన చట్టం భూ భారతి చట్టం అని, ఈ చట్టాన్ని అధికారులు పకడ్బందీగా అమలు చేయాలని, చట్టాన్ని బాగా అమలు చేసి ప్రజలకు ఉపయోగపడే చట్టంగా చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ భూములను పరిశీలించి, ఎవరికి ఎంత భూమి ఉందో నిజంగా సాగులో ఉన్న రైతులకు పట్టాలు ఇస్తామని తెలిపారు.ఒక చోట నుంచి మరో చోటికి రైతులు వెళ్లిన సందర్భంలో రైతులకు ఇచ్చిన భూముల డీ లిమిటేషన్ విషయంలో ఇప్పటివరకు ఇబ్బందులు పడ్డారని, అలాగే డీ లిమిటేషన్ భూముల విషయంలో కూడా ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ధరణి సమయంలో ప్రభుత్వం వద్దకు ప్రజలు వెళ్లాల్సి వచ్చేదని, వీటన్నిటికీ పూర్తిగా న్యాయం జరిగేలా భూ భారతిలో ప్రణాళికలు రూపొందించడం జరిగిందని ఆయన తెలిపారు. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ తమది సమస్యలను పరిష్కరించే ప్రభుత్వమని చేతల ద్వారా నిరూపిస్తున్నామని ఇందిరమ్మ రాజ్యంలో బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందని వెల్లడించారు. భువనగిరి ఎమ్మెల్యే కుంభం కుమార్ రెడ్డి మాట్లాడుతూ భువనగిరి నియోజకవర్గంలోని వలిగొండ భువనగిరి పోచంపల్లి ఎమ్మార్వో కార్యాలయాలు శిధిలావస్థలో ఉన్నాయని గత ప్రభుత్వం పట్టించుకోలేదని వలిగొండ ఎమ్మార్వో కార్యాలయం కూలిపోయే పరిస్థితిలో ఉందన్నారు నూతన ఎమ్మార్వో కార్యాలయాలు నిర్మాణానికి నిధులు కేటాయించాలని వలిగొండలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నిర్మించాలని మంత్రిని కోరగా సానుకూలంగా స్పందించారు. యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతరావు మాట్లాడుతూ మోఖ మీద ఉన్న వారి పేరును భూ భారతి ద్వారా ఎక్కించే బాధ్యత రెవెన్యూ శాఖదేనిని, భూభారతి ద్వారా తహసీల్దార్ ద్వారా అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. రిజిస్ట్రేషన్‌కు దరఖాస్తు చేసుకున్న 30వ రోజు పని పూర్తవుతుందని, ఒకవేళ కానట్లయితే 31వ రోజు ఆటోమేటిక్‌గా అవుతుందని అన్నారు. ఈ అధికారాలు ఆర్డీవోకు ఉన్నాయని, ఉచిత న్యాయ సహాయం ఏర్పాటు చేసే అవకాశం, సంవత్సరానికి ఒకసారి భూమి రికార్డులను అప్డేట్ చేసే అవకాశం భూ భారతిలో ఉన్నాయని కలెక్టర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు వివిధ శాఖల అధికారులు రైతులు మహిళా రైతులు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# జగ్గారెడ్డి దాతృత్వం

- క్యాన్సర్ బాధితురాలికి రూ.10లక్షల నగదు సాయం
- సీఎం క్యాన్సర్ స్క్రీనింగ్ చేయించాలని తీసుకున్న నిర్ణయం మంచిదే : టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టీ.జగ్గారెడ్డి



**సదాశివాపేట ఏప్రిల్ 22( జనం సాక్షి) :** సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే, టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి క్యాన్సర్ తో బాధపడుతున్న బాధితురాలికి అండగా నిలిచి దాతృత్వం చాటుకున్నారు. సదాశివపేట పట్టణానికి చెందిన ఆమని అనే మహిళ క్యాన్సర్‌తో బాధపడుతూ చికిత్స నిమిత్తం ఇప్పటి వరకు రూ. 7లక్షల అప్పులు చేశానని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేశారు. తన భర్త చనిపోయాడని, ఇద్దరు ఆడపిల్లలతో దయనీయ జీవితం గడుపుతున్నానని జగ్గారెడ్డి ముందు బాధితురాలు ఆమని విలపించారు. కొన్ని సందర్భాల్లో ఈ నరకం భరించలేక ఆత్మహత్య చేసుకోవాలని అనుకున్నానని, పిల్లల కోసం బతుకుతున్నానని బాధితురాలు ఆమని జగ్గారెడ్డికి వివరించారు. స్పందించిన మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి తక్షణమే రూ. 10లక్షలు బాధితురాలికి నగదు రూపంలో అందించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి క్యాన్సర్ స్క్రీనింగ్ చేయించాలని తీసుకున్న నిర్ణయం మంచిదని అన్నారు. క్యాన్సర్ బాధితురాలికి ఆర్థిక సహాయం చేయడం తన విధిగా భావించానని అన్నారు. తనకు సాయం చేసి, వీడియోలు, ఫోటోలు తీయించుకునే అలవాటు లేదన్నారు. కానీ ఈ సమస్య పది మంది దృష్టికి రావాలని మీడియా దృష్టి కి తీసుకు వచ్చానన్నారు. పేదలకు ఇలాంటి రోగాలు వస్తే.. కనీసం చికిత్స చేయించుకోవడానికి.. డబ్బులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇలాంటి నిరుపేద క్యాన్సర్ బాధితులకు అండగా నిలిచేందుకు దాతలందరూ ముందుకు రావాలన్నారు. క్యాన్సర్ బాధితులకు సంబంధించి క్షేత్ర స్థాయిలో ఉన్న పరిస్థితులు ట్రీట్ మెంట్ కోసం నిరుపేద క్యాన్సర్ బాధితులు పడుతున్న సమస్యలను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళతానని జగ్గారెడ్డి తెలిపారు.



## చెరువుల అభివృద్ధి.. అభినందనీయం

- హైడ్రా కమిషనర్‌ను కలిసిన కూకట్‌పల్లి ఎమ్మెల్యే

**హైదరాబాద్, ఏప్రిల్ 22 (జనంసాక్షి) :** నగరంలో చెరువుల అభివృద్ధికి హైడ్రా చేస్తున్న కృషిని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అభినందించారు. తన నియోజకవర్గ పరిధిలోని కూకట్‌పల్లి నల్లచెరువును పైలట్ ప్రాజెక్టుగా తీసుకోవడం ఆనందంగా ఉందని అన్నారు. నియోజకవర్గంలో మిగిలిన చెరువులనూ అభివృద్ధి చేయాలని మంగళవారం ఎమ్మెల్సీ నవీన్ కుమార్‌తో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. చెరువు పరిసర ప్రాంతాల్లో ఉన్న భూ యజమానులతో పాటు ప్లాట్లు ఉన్నవారికి టీడీఆర్ కింద తగిన నష్ట పరిహారం అందేలా చూడాలని కోరారు. నకిలీలకు ఆస్కారం లేకుండా అసలు లబ్ధిదారులను గుర్తించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. అభివృద్ధి చేసిన చెరువుల్లో మురుగు నీరు కలవకుండా నాలాలను డైవర్ట్ చేయాలని సూచించారు. కబ్జాలకు పాల్పడిన వారు ఎవరైనా.. పార్టీలతో సంబంధం లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. బీఆర్ ఎస్ ప్రభుత్వ హయాంలో ఐడీఎల్ చెరువు, బోయిన చెరువును, ములకత్వ చెరువు నల్ల చెరువులో కొంత భాగం సుందరీకరణ చేశామని.. కోర్టు కేసులుండడంతో పనులు పూర్తి చేయలేకపోయామని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చెప్పారు. అసలైన లబ్ధిదారులను గుర్తించి వారికి నష్ట పరిహారం అందేలా చూస్తామని, నగరంలోని అన్ని చెరువుల అభివృద్ధి పనులను ప్రాధాన్య క్రమంలో చేపడతామని కమిషనర్ ఏవీ రంగనాథ్ ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు వివరించారు.

## కోడలిపై కన్నేసి.. కన్న కొడుకుని కడతేర్చి..





**రేగొండ, ఏప్రిల్ 22 ( జనం సాక్షి):** కోడల్ని కన్న కూతురు లాగ చూసుకోవాల్సిన మామ ఆమెపై కన్నేశాడు.తనకు అడ్డు తగులుతున్నాడని భావించి కొడుకు నిద్రిస్తున్న సమయంలో రోకలి బండతో తలపై కొట్టి చంపాడు. ఈ అమానవీయ ఘటన మండలంలోని రేపాకపల్లిలో మంగళవారం ఉదయం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రేపాకపల్లి గ్రామానికి చెందిన కసం ఓదెలు (35) 108 విభాగంలో అంబులెన్స్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. పరకాల మండలానికి చెందిన దేవితో 14 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది.వీరికి ఒక కుమారుడు ఉన్నాడు.తండ్రి కసం మొండయ్య కోడలితో పెళ్ళైన కొన్ని సంవత్సరాల నుండి అసభ్యంగా ప్రవర్తిస్తూ ఉండేవాడు. ఈ విషయమై గతంలో పెద్ద మనుషుల సమక్షంలో పంచాయతీలు జరిగాయి. అయినా మొండయ్య ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాలేదు. ఈ క్రమంలో సోమవారం మొండయ్య దేవిల పెళ్లి రోజు కావడంతో రాత్రి 7 గంటల సమయంలో పెళ్లిరోజు వేడుకలు జరుపుకుంటుండగా తండ్రి కొడుకులకు గొడవ జరిగింది. చుట్టుపక్కల వారి చొరవతో గొడవ సర్దుమనిగింది. మంగళ వారం ఉదయం 7 గంటల సమయంలో తన కుమారుడు ఓదెలు ఇంటి ముందు వరండంలో పరుపు పై పడుకొని ఉన్నాడు. ఇదే సరైన సమయం అని భావించిన తండ్రి దగ్గరలో ఉన్న రోకలిబండతో తలపై గట్టిగా కొట్టగా ఓదెలు తలకు రక్తస్రావమై అక్కడికక్కడే చనిపోయాడు. తదుపరి నిందితుడు మొండయ్య అక్కడి నుండి పారిపో యాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు డీఎస్పీ సంపత్ రావు, సిఐ మల్లేష్ యాదవ్ సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సందీప్ కుమార్ తెలిపారు.

# బ్యాంకాక్‌లో ఉద్యోగాలిప్పిస్తామని ఎర

- సైబర్ నేరగాళ్ల వలలో థాయ్‌లాండ్‌లో బందీగా రంగారెడ్డి యువత
- కేంద్ర మంత్రి బండి సంజయ్ జోక్యంతో నలుగురికి విముక్తి
- త్వరలోనే మరికొందరిని రప్పిస్తాం: బండి సంజయ్

**సంగారెడ్డి, ఏప్రిల్ 22 (జనంసాక్షి) :** బ్యాంకాక్ లో మంచి ఉద్యోగం ఇప్పిస్తామని ఆశ చూపి మయన్మార్ కేంద్రంగా సైబర్ ఫ్రాడ్ కేఫ్ లో బందీలుగా మారి బలవంతంగా సైబర్ వెట్టిచాకిరికి గురవుతున్న తెలంగాణకు చెందిన యువతకు విముక్తి లభించింది. వీరిలో ముగ్గురు తెలంగాణకు చెందిన వారు కాగా, మరొకరు ఏపీకి చెందిన వ్యక్తి. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఆదేశాల మేరకు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రత్యేక చొరవ తీసుకుని వీరిని స్వదేశానికి రప్పించారు. బ్యాంకాక్ లో మంచి జాబ్ ఉందని, ప్రతినెలా లక్షల రూపాయల జీతం వస్తుందని బ్రోకర్ ఆశ చూపడంతో వీరంతా నిజమేనని నమ్మి మోసపోయారు. ఇదే విషయంపై రంగారెడ్డి జిల్లా హయత్ నగర్ మండలం కోహెడకు చెందిన మయన్మార్ బాధితుడు రాకేష్ రెడ్డి మాట్లాడుతూ "మా ఏరియాలో ఉండే యశ్ నాథ్ గౌడ్ అనే వ్యక్తి బ్యాంకాక్ లో మంచి ఉద్యోగం ఉందని ఆశ చూపడంతో నిజమేనని నమ్మిన. జగిత్యాలలోని బ్రోకర్ల ఏజెంట్ (టీంలీడర్) వంశీక్రిష్ణ వద్దకు తీసుకుపోయిండు. వంశీక్రిష్ణే నన్ను ఇంటర్వ్యూ చేసిండు. బ్యాంకాక్ కు 200 కి.మీల దూరంలోనే జాబ్ అని చెప్పి తీసుకుపోయారు. తీరా అక్కడికిపోతే రోజుకు 16 గంటల పని అప్పగించారు. ఆ పని ఏందంటే సైబర్ క్రైమ్. ఆ పని చేయకపోతే భోజనం కూడా పెట్టకపోయేవాళ్లు. 5 నెలలు ఆ కంపెనీలో పనిచేసిన. అట్లాంటి పనిచేయడం నాకిష్టం లేక మొండికేసిన. దీంతో అక్కడున్న చైనీస్ వాళ్లు నా పాస్ పోర్టు గుంజుకున్నరు. అన్నం కూడా పెట్టకుండా హింసించారు. అయినా వినకపోవడంతో వాళ్లు అక్కడున్న ఆర్మీ వాళ్లకు చెప్పి మేం దొంగతనంగా ఆ దేశానికి వచ్చామని చెప్పి ఆర్మీ వాళ్లకు పట్టించారు. వాళ్లు మమ్ముల్ని జైల్లో వేశారు"అని వాపోయారు. ఇటీవల మయన్మార్ నుండి వందలాది మంది తనలాంటి బాధితులను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ స్వదేశానికి రప్పించారని తెలుసుకుని కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చానని రాకేష్ రెడ్డి తెలిపారు. "మా నాన్న యాదిరెడ్డి బండి సంజయ్ సార్ కు లెటర్ రాసిన వెంటనే స్పందించి విదేశాంగ శాఖకు లేఖ రాయడంతోపాటు వెంటనే మమ్ముల్ని స్వదేశానికి రప్పించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకున్నారు. బండి సంజయ్ సార్ కు మా కుటుంబమంతా రుణపడి ఉంటది" అని పేర్కొన్నారు. రాకేశ్ రెడ్డితోపాటు కోహెడకు చెందిన ఏ.శివశంకర్, కరీంనగర్ జిల్లాకు చెందిన కనూరి గణేశ్ తోపాటు ఆంధ్రప్రదేశ్ కు చెందిన ఆకుల గురు యువ కిశోర్ బ్రోకర్ల బారిన పడి మయన్మార్ లో సైబర్ క్రైం వెట్టి చాకిరి చేస్తూ తీవ్రమైన హింసలకు గురయ్యారు. వీరంతా బండి సంజయ్ కార్యాలయ చొరవతో స్వదేశానికి తిరిగి రావడం గమనార్హం. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ మయన్మార్ లో పలువురు తెలుగు రాష్ట్రాల యువతతోపాటు వందలాది మంది భారతీయులు సైబర్ క్రైమ్ వెట్టి చాకిరి చేస్తున్నట్లు తమకు సమాచారం ఉందని, త్వరలోనే వారందరినీ స్వదేశానికి రప్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

# ములుగు జిల్లాలో మావోయిస్టుల గాలింపు చర్చలు ఆపాలి

- మావోయిస్టులతో కేంద్రం శాంతి చర్చలు జరపాలి
- చర్చల ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయి : చాడ వెంకటరెడ్డి



**హైదరాబాద్, ఏప్రిల్ 22 (జనంసాక్షి) :** మావోయిస్టులపై జరుగుతున్న బూటకపు ఎన్‌కౌంటర్‌లను నిలిపివేయాలని, సత్వరమే కేంద్రం శాంతి చర్చలు జరపాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈరోజు జరుగుతున్న నక్సల్స్‌ను ఏరివేత లక్ష్యంగా చత్తీష్‌గడ్-తెలంగాణ సరిహద్దులోని ములుగు, కర్రె గుంటలో సిరిపిఎఫ్ బలగాలు మోహరింపును నిలిపివేయాలని ఆయన కోరారు. కేంద్రంలో 3వసారి అధికారంలోకి వచ్చిన బిజెపి వామపక్షభావజాలంపై యుద్ధం ప్రకటించారని, నక్సలిజంను అంతం చేయడానికి అమిత్‌షా పంతం కట్టుకున్నారని, అందుకే ఈ బూటకపు ఎన్‌కౌంటర్లు జరిపి వందల మంది మావోయిస్టులను పొట్టపెట్టుకున్నారని చాడ అన్నారు. సిద్ధాంతం నమ్ముకున్న మావోయిస్టులు ఇప్పటికే చాలా మంది లొంగిపోయారని, మిగిలినవారు శాంతి చర్చలకు సిద్ధమని ప్రకటిస్తున్నా, ఎందుకు కేంద్ర ప్రభుత్వం స్పందించడం లేదని ఆయనన్నారు. ఇరుదేశాల మధ్య గొడవులు, అన్నదమ్ముల తగాదాలు, ఎలాంటి సమస్య అయినా చర్చల ద్వారానే పరిష్కారమయితాయని వెంటనే మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని చాడ వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. పంతాలకు పట్టింపులకు పోకుండా సామరస్య వాతావరంలో చర్చలు జరపాలని, మావోయిస్టులు కూడా జనజీవన స్రవంతిలోకి రావాలని సిపిఐ కోరినట్లు చాడ పేర్కొన్నారు. దేశంలోని పౌరులను అంతం చేయడం లక్ష్యంగా ఆలోచనతో ఉండకూడాదని మానవీయత కోణంలో ఆలోచించాలని చాడ వెంకటరెడ్డి పేర్కొన్నారు.

# సింగరేణిలో మెరిట్ స్కాలర్‌షిప్ రూ.16 వేలకు పెంపు!

- కనీస అర్హత 2 వేల ర్యాంకు నుండి 8 వేల ర్యాంకు వరకు అవకాశం
- ఉత్తర్వులు జారీ చేసిన యాజమాన్యం

**( ప్రత్యేక ప్రతినిధి/ జనం సాక్షి) :** ఎంసెట్, నీట్, జేఈఈ మెయిన్స్, ఎయిమ్స్ తదితర కోర్సుల ప్రవేశ పరీక్షల్లో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన సింగరేణి కార్మికుల, అధికారుల పిల్లలకు ఇప్పటివరకు ఇస్తున్న వార్షిక స్కాలర్ షిప్ మొత్తాన్ని 10 వేల నుండి 16 వేల రూపాయలకు పెంచుతూ యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే కనీస ర్యాంక్ 2000 లోపు నుండి 8000 లోపు వరకు పెంచినట్లు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో తెలియజేసింది. కార్మికుల పిల్లలను ఉన్నత చదువుల పట్ల ఆసక్తి పెంచడానికి, ప్రోత్సహించడానికి 1998లో ఈ స్కాలర్ షిప్ పథకాన్ని ప్రవేశ పెట్టారు. 2000 లోపు ర్యాంకు సాధించిన ఉద్యోగుల పిల్లలకు మాత్రమే దీనిని వర్తింపజేశారు. అన్ని ఏరియాల నుండి అర్హులు ఉండి దరఖాస్తులు స్వీకరించి, సదరు విద్యార్థి చదివే కోర్సు పూర్తయ్యేంతవరకు ఏడాదికి 6000 రూపాయలు చొప్పున స్కాలర్ షిప్ ను కంపెనీ ప్రతి ఏడాది అందిస్తూ వచ్చింది. స్కారల్ షిప్ మొత్తాన్ని పెంచాలని వచ్చిన విజ్ఞప్తి మేరకు 2010లో దీనిని 10 వేల రూపాయలకు పెంచారు. కాగా ఇటీవల గుర్తింపు కార్మిక సంఘంతో జరిగిన నిర్మాణాత్మక సమావేశంలో స్కాలర్షిప్ గా చెల్లించే మొత్తాన్ని రూ.10 నుండి రూ.16 వేలకు పెంచాలని, స్కాలర్షిప్ వర్తింపును కూడా 2000 ర్యాంకు లోపు నుండి 8000 ర్యాంకు లోపు వరకు పెంచాలని గుర్తింపు సంఘం నాయకులు యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు. దీనికి సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ సానుకూలంగా స్పందించారు. ఆయన ఆదేశం మేరకు సవరించిన స్కాలర్ షిప్ నకు సంబంధించిన సర్క్యులర్ ను డైరెక్టర్ పా జారీ చేశారు. ఈ ఉత్తర్వులు 2024-25 విద్యా సంవత్సరంలో ప్రవేశ పరీక్షలకు హాజరైన విద్యార్థిని విద్యార్థులకు వర్తిస్తుందని, ఈ మేరకు అన్ని ఏరియాల నుండి జూన్ 15 లోపు దరఖాస్తులు పంపించాలని డైరెక్టర్ పా వెల్లడించారు. ఎంసెట్ ప్రవేశ పరీక్షల్లో 8 వేల ర్యాంకు వరకు సాధించిన వారికి వారి కోర్సు పూర్తయ్యేంత వరకు ఏడాదికి 16,000 చొప్పున స్కాలర్ షిప్ గా సంస్థ చెల్లిస్తుందని, అలాగే జేఈఈ మెయిన్స్ (ఎన్.ఐ.టి), ఎయిమ్స్, బిట్ సాట్ (బిట్స్-పిలాని) లో ప్రవేశం పొందిన వారికి అత్యుత్తమ ర్యాంకు ఆధారంగా స్కాలర్ షిప్ ను వర్తింపజేయనున్నామని తెలిపారు. ఈ సదవకాశాన్ని ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని యాజమాన్యం విజ్ఞప్తి చేస్తుంది.

# మహామేడారం జాతరకు రూ.145 కోట్లతో పనులు

- ఫీల్డ్ విజిట్ చేసి ప్రతిపాదనలు సమర్పించాలి
- మంత్రి ధనసరి అనసూయ సీతక్క



**ములుగు ప్రతినిధి, ఏప్రిల్ 22(జనంసాక్షి) :** వచ్చే సంవత్సరం ఫిబ్రవరి మాసంలో జరిగే మేడారం మహా జాతర వచ్చే భక్తుల సౌకర్యార్థం చేపట్టే పనులు శ్వాస్వతంగా నిలిచేలా పనులు పూర్తి చేయాలని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. మహా జాతరకు ఏర్పాట్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం 145 కోట్ల రూపాయలను కేటాయించనున్నదని తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధ్యక్షతన 2026 సంవత్సరంలో జరగనున్న మేడారం మహా జాతరను పురస్కరించుకొని అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు శాఖల అధికారులు చేపట్టనున్న పనులను మంత్రికి వివరించారు. అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ గతంలో లాగా జాతరకు రెండు నెలల ముందు పనులు ప్రారంభించి హడావుడిగా పనులు పూర్తి చేయకుండా కనీసం ఆరు నెలల సమయం తీసుకుని పూర్తి నాణ్యత పనులు ముగించాలని సూచించారు. వచ్చే సంవత్సరంలో మేడారం సమ్మక్క సారలమ్మ మహా జాతర తో పాటు గోదావరి పుష్కరాలు నిర్వహించడం జరుగుతుందని, రెండు పెద్ద పండుగలను పురస్కరించుకొని అన్ని శాఖల అధికారులు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. కుంభమేళా తరహాలో జరుగుతున్న శ్రీ మేడారం సమ్మక్క సారలమ్మ జాతరను విజయవంతం చేయడానికి కృషి చేయాలని, గత మహా జాతర సందర్భంగా మిగిలి ఉన్న 50 కోట్ల రూపాయలను రానున్న మహా జాతరకు వినియోగిస్తామని తెలిపారు. గద్దెల పరిసర ప్రాంతాలను సుందరంగా తీర్చిదిద్దరమే కాకుండా జంపన్న వాగుపై ఐదు కోట్ల రూపాయలతో పెద్దలు పిల్లలు సేద తీర్చుకోవడానికి వీలుగా ఏర్పాట్లు చేయాలని, ప్రణాళిక బద్ధంగా శాశ్వత పనులు చెయ్యాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భక్తులకు అవసరము కానున్న పనులను ముందుగానే గుర్తించి సంబంధిత అధికారులు అంచనాలు తయారు చేయాలని, మహా జాతర సందర్భంగా రైతులకు అవగాహన నిర్వహించాలని అన్నారు ఈ సందర్భంగా కలెక్టర్ దివాకర్ టిఎస్ మాట్లాడుతూ గతంలో జరిగిన మేడారం మహా జాతర సందర్భంగా పనిచేసిన అధికారులు ఇప్పటికీ జిల్లాలో పనిచేస్తున్నారని, వారి అనుభవాలను పరిగణలోకి తీసుకొని రానున్న మహా జాతరను విజయవంతంగా పూర్తి చేస్తామని అన్నారు. పలు శాఖల ద్వారా చేపట్టనున్న పనులను గుర్తించి అంచనాలను తయారు చేస్తామని, గతంలో జరిగిన ఇబ్బందులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ సమావేశంలో ఐటీడీఏ పీవో చిత్ర మిశ్రా, అదనపు కలెక్టర్ రెవిన్యూ మహేందర్ జి, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, ములుగు డిఎస్పి రవీందర్, ఆర్డీఓ వెంకటేష్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్, ఎఫ్డిఓ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

**PUBLIC NOTICE**

**NOTICE IS HERBY GIVEN TO THE GENERAL PUBLIC**

That we, Sri Supraja Infracon & others have obtained DTCP Permission for an extent of Ac.14.02 Guntas in Sy No.134/P for making layout for 206 Plots vide Lr.Roc No.3309/447/2024/H/E/P Panchayat Date: 19-09-2024, Ghanapur GP, Marpally Mandal, Vikarabad District. We have now Applied for revised Permission on 18/04/2025 vide Application No. 1045 from the Same Gram Panchayat for revising the permission for the size of the Roads , Place of Parks & No, of Plots if any person has any objections , they may notify the same to the Secretary, Gram Panchayat, Ghanapur GP, Marpally Mandal, and DTCP/TPO Vikarabad within 15 days from the date of this notice along with proper documents and a written statement of objections .

**For Further informations, Please contact;**
**M/S, Sri Supraja Infracon & Others**
**Sy No. 134/P, Ghanapur Village, Marpalle Mandal, Vikarabad.**
**Contact: 9652209315**



# ప్రభుత్వరంగం నిర్వీర్యం చేసే కుట్ర

ప్రభుత్వ రంగం దాదాపు ఖతం కానున్నది.ఇందుకు సంబంధించి పెద్ద ఎత్తున కేంద్రం కుట్ర పన్నుతు న్నది. భారత దేశంలో ప్రధాన ప్రభుత్వ రంగ సంస్థల్లో ప్రభుత్వం షేర్లను అమ్మే విధంగా తద్వారా నిధులు సమకూర్చే విధంగా కేంద్రం ప్లాన్ చేస్తున్నది. ప్రధాన మంత్రి నరేంద్రమోడీ తను రైల్వే లో ఛాయ్ అమ్మినానని తాను ఎందుకు రైల్వేలను ప్రైవేటుపరం చేస్తానని చెప్పి రైల్వేను ప్రైవేట్ పరం చేసిన పరిస్థితిని దేశం ఇప్పుడు ఈసారి పలు ప్రధానమైన ప్రభుత్వ రంగ సంస్థలను మరోసారి అమ్మివేయా లని వాటి షేర్స్ ను బడా పెట్టుబడిదారులకు ఇవ్వాలని నిర్ణయించుకున్నారు.ఇందులో కోల్ ఇండియా కూడా ముందు వరుసలో ఉన్నది. దేశంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ రంగంలో ఒక లక్షమందికి ఉపాధి కల్పించే ప్రభుత్వ రంగ సంస్థ రాలేదు.ఉపాధి కల్పిస్తున్న సంస్థ లను కార్పొరేట్లకు లీజుకు ఇవ్వడం చౌకబారు కు అమ్మి వేయడం చూస్తున్నాము.

**డివిడెంట్లు, పన్నులు వసూలు చేస్తూ కూడా**

లాభాల్లో ఉన్న ప్రభుత్వ రంగంకు కూడా సహకారం లేదు. ప్రభుత్వ రంగాన్ని అభివృద్ధి కోసం కేంద్రం నిధులు మంజూరు చేయడం మానేసింది.తన వాటాలు ఉన్న సంస్థ ల ను కూడా డివిడెంట్లు, పన్నులు వసూలు చేసుకుంటూ కూడా అమ్ముకుంటూ వస్తుంది.2025 చివరికి 6 లక్షల కోట్ల ఆదాయం కేవలం ప్రభుత్వ రంగాన్ని అమ్మి ఎస్సెట్ లను, బొగ్గు బ్లాలను అమ్మి ఆదాయం సమకూర్చుకునే పని లో ఉన్నది.2030 నాటికి ఇలా 10 లక్షల కోట్లు ఆదాయం ప్రభుత్వ రంగాన్ని అమ్మి లీజుకు ఇచ్చి ఆదాయం సమకూర్చే విధంగా ప్రభుత్వం ప్లాన్ చేసుకున్నది.ఇప్పటికే బ్యాంక్, ఎయిర్లైన్స్, రైల్వేస్, బొగ్గు సంస్థలలో ప్రైవేటీకరణ వల్ల లక్షలాది ఉపాధి అవకాశాలు లేకుండా పోయాయి.

**ప్రభుత్వ ఉద్యోగులు రోడ్ల మీదికి వచ్చేశారు.**

ప్రభుత్వ రంగంలో మరోసారి వాటాల విక్రయం ఇందులో భాగంగా కేంద్రం మరోసారి కార్పొరేటికరణలో భాగంగా, కేంద్ర ప్రభుత్వం మరోసారి కొన్ని ప్రభుత్వ రంగ సంస్థలలో తన వాటాను విక్రయించాలని యోచిస్తోంది. ఈ కంపెనీలలో కోల్ ఇండియా, ఎల్ఐసి, రైల్ వికాస్ నిగమ్, గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్ మరియు ఇంజనీర్స్ ఉన్నాయి. ఆఫర్ ఫర్ సేల్ ద్వారా ప్రభుత్వం ఈ కంపెనీలలో తన వాటాను తగ్గిస్తుంది. ఈ సమాచారం మనీ కంట్రోల్‌కు ప్రణాళిక గురించి తెలిసిన ఇద్దరు సీనియర్ అధికారులు అందించారు. "ఈ ఆర్థిక సంవత్సరంలో రెండు పెద్ద కంపెనీలైన కోల్ ఇండియా , లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ లలో వాటాను విక్రయించాలని ప్రభుత్వం పరిశీలిస్తోంది. ప్రస్తుతం, కోల్ ఇండియాలో ప్రభుత్వ వాటా 63.13%. లాభదాయక సంస్థ మరియు 2024 - 25 ఆర్థిక సంవత్సరంలో అత్యధికంగా రూ. 10,252.09 కోట్ల డివిడెండ్ చెల్లించే ప్రభుత్వ సంస్థ. గత ఆర్థిక సంవత్సరం2024-25 లో, కోల్ ఇండియా 782 మిలియన్ టన్నుల బొగ్గును ఉత్పత్తి చేసింది" ప్రస్తుతం ప్రభుత్వ వాటా కోల్ ఇండియాలో 63.13%, ఎల్ ఐ సి లో 96.50%, రైల్ వికాస్ నిగమ్ 72.84%, గోర్డాన్ రీచ్ షిప్‌బిల్డర్స్, ఇంజనీర్స్ 74.50% లో ఉంది. ఇది మార్చి 2024 చివరి నాటికి లెక్క కాగా, కోల్ ఇండియా ఇప్పటికే 36.87 శాతం పబ్లిక్ షేర్ హోల్డింగ్ ఉన్నది.

**కోల్ ఇండియా వాటాను ఇదే ఏడాది**

2025-26లో కోల్ ఇండియాలో కేంద్రం మరికొంత వాటాను విక్రయించే అవకాశం ఉంది. ఇప్పటికే ఉద్యోగుల వేతన ఒప్పందంలో షేర్ హోల్డర్ల జోక్యం పెరిగింది. రానున్న రోజుల్లో ఇలా లాభాల్లో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థల షేర్లను ప్రభుత్వం అమ్ముతూ పోతే రేపు ఉద్యోగుల జీత భత్యాల పైన కూడా కార్పొరేట్ ల ఆధిపత్యం కొనసాగే ప్రమాదం ఉంది. కార్పొరేటికరణ, ప్రైవేటీకరణ ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం విధానం అయిపోయింది. చౌక ధరల కు అమ్మేసి అదానీ, అంబానీ లాంటి వారికి మద్దతుగా నిలబడడమే ప్రభుత్వ విధానాలు. పోరాటాలు ఉద్యమాలు తప్ప దీనిని ఆపలేము. ఇప్పుడు కాకుంటే మరెప్పటికీ ఉద్యమించకుంటే కార్మిక సంఘాలు ఐక్య పోరాటాలు చేయకుం టే పార్లమెంట్లో అటు రాజ్యసభలో మన ఎంపీలు ఐక్యంగా కార్పొరేటీకరణ ప్రైవేటీకరణను ఆపకుంటే కష్టమే అవుతుంది. దేశంలో ప్రభుత్వ రంగం అనేది మిగిలే పరిస్థితి కనిపించదు. ప్రజాప్రతినిధులు ఇప్పటికై నా రాష్ట్రాల నుంచి ఎంపీలుగా ఎంపికైన వారు ప్రతి ఘటించాల్సిన అవసరం ఉంది.



ఎండి.మునీర్
సీనియర్ జర్నలిస్ట్, విశ్లేషకులు,
9951865223,



## నగరంలో గాలులు

అరణ్యం అంచున జీవించి అనుభవించినట్టు
ఇదేం గాలి ఇదేం దుమ్మూధూళి
గురి గమ్యం లేని ఇదేం వానచినుకుల
కదనకాహలి

పంచభూతాల మృత్యురవళి
ఆకులు రాలడం
కొమ్మలు వాలడం కాదు
చెట్లు కూలడం ఇప్పుడు
గొప్పదనం చాటని

గాలి వద్దే వద్దు వాన వద్దుగాక వద్దు


గుడ్లగూబ నగరం పైన వాలి దాపురించిన
దుః శకునంలా వుంది

ఈ హోరుగాలి ఈ జోరువాన
తాపం కోపం మొత్తం
నగరం మీద అన్నట్టు
నగరప్రజ మీద తీసుకున్నట్టు
గాలితో వాన భీకర ప్రదర్శన
నగరం అంటేనే
అనుషంగిక కష్టాలు జన్మత కన్నీళ్లు

జగడంలా గాలులు రణంలా వానలు
ఇతిమితి లేని గాలులు అర్థంపర్థం లేని వానలు
ఆకాశంలో దుర్విద్యలు నేర్చుకొని దాడి చేస్తున్న
గాలులు వానలు
దయ్యం పట్టినట్టు
గాలిలోవానలు వానలోగాలులు
ప్రకృతిలో భాగమై వికృతి నేర్చిన నగరంపై కక్ష

కోటం చంద్రశేఖర్
9492043348

# ప్రజా పాలనలో కూడా మారని బతుకులు



## విశ్వవిద్యాలయ పార్ట్‌టైం అధ్యాపకుల అర్ధాకలి

విద్య కేవలం వ్యక్తులను ఉద్దరించే సాధనంగా కాకుండా సమాజాలను, దేశాలను, యావత్ ప్రపంచాన్ని అభివృద్ధి దిశలో నడిపే ముఖ్యమైన అంశం. సర్వకాల సర్వావస్థలలో మనిషిని ఉన్నతంగా నిలబెట్టేది చదువు ఒకటే! పేదరికం, వెనుకబాటుతనం తొలగిపోయి సుస్థిర అభివృద్ధికి, సంపూర్ణ వికాసానికి చదువు బాట వేస్తుందని విద్యా తత్తవేత్తలు, సామాజిక తత్వవేత్తలు చెప్తున్నారు. విద్యా రంగంలో ప్రగతి సాధించిన దేశాలే నేడు ఆర్థిక అభివృద్ధిలో ముందున్నాయి. ఫిన్లాండ్, నార్వే, సిట్జర్లాండ్, దక్షిణ కొరియా దేశాలు ప్రణాళిక బద్ధంగా విద్యారంగ అభివృద్ధికి చర్యలు తీసుకోవడం వలన అద్భుతంగా మానవ వనరుల అభివృద్ధి జరిగింది. పదిమంది ఉపాధ్యాయుల కంటే ఒక ఆచార్యుడు, నూరు గురు ఆచార్యుల కంటే ఒక తండ్రి, వేయి మంది తండ్రుల కంటే ఒక తల్లి గౌరవంలో ఎక్కువ వారని మనువు పేర్కొన్నాడు. బోధన గురించి అవగాహన లేనివాళ్ళు తరగతి గదిలో ఎవరైనా పాఠాలు చెప్పొచ్చనీ వ్యాఖ్యానిస్తుంటారు. బోధన నిజానికి చాలా సంక్లిష్టమైన ప్రక్రియ. 'శస్త్ర చికిత్స చేసే వైద్యుడు తన మొత్తం పని కాలంలో వృత్తిపరమైన నిర్ణయాలను ఏ సంఖ్యలో తీసుకుంటాడో అంతకంటే ఎక్కువ సంఖ్యలో - ఉపాధ్యాయుడు తరగతి గదిలో బోధించేటప్పుడు నిర్ణయాలు 'తీసుకోవలసి ఉంటుంది అని ఓ ప్రముఖ విద్యావేత్త చేసిన ఈ వ్యాఖ్యలు గుర్తు చేసుకోవాలి. " దేశ భవిష్యత్తు తరగతి గదిలోనే రూపుదిద్దుకుంటుంది" అని రకరకాల అంశాలు అధ్యాపకుల బోధనను ప్రభావితం చేస్తాయి. అందులో ముఖ్యంగా మౌలిక వసతులు, జీతభత్యాలు బోధనను, అభ్యసనను ప్రభావితం చేసే అంశాలు అని విద్యావేత్త డాక్టర్ డి.ఎస్.కొఠారి అంటారు. తెలంగాణలోని 12 యూనివర్సిటీల్లో రెగ్యులర్, కాంటాక్ట్ అధ్యాపకులుగా పనిచేస్తున్నటువంటి వారితో సమానంగా పార్ట్ టైం అధ్యాపకులు పనిచేస్తున్న విషయం గత పాలకులతో పాటు ప్రస్తుతం అధికారంలో ఉన్నటువంటి పాలకులు కూడా తెలిసిన విషయమే. ప్రస్తుతం యూనివర్సిటీలో పనిచేస్తున్న అధ్యాపకులు మూడు రకాలు అందులో 1. రెగ్యులర్ అధ్యాపకులు , 2. కాంట్రాక్ట్ అధ్యాపకులు, 3. పార్ట్ టైం అధ్యాపకులు. రెగ్యులర్ అధ్యాపకులకు ఎటువంటి అర్హతలు ఉంటాయో, అటువంటి అర్హతలు కాంట్రాక్టు అధ్యాపకునికి ఉన్నాయి. కాంట్రాక్టు అధ్యాపకునికి ఉన్నటువంటి అర్హతలు, పార్ట్ టైం అధ్యాపకులకు ఉన్నాయి. వీరు కూడా యూజీసీ గైడ్ లైన్స్ కు అనుగుణంగా రెగ్యులర్, కాంట్రాక్ట్ అధ్యాపకుల లాగా పీహెచ్ డీ, నెట్, సెట్ అర్హత కలిగి డిపార్టమెంటల్ కమిటీల ద్వారా డెమో, ఇంటర్వ్యూ రోస్టర్ ద్వారా అపాయింట్ అవుతారు. వాళ్లతో సమానంగా పాఠాలు చెప్తున్నప్పటికీ వీరి వెతనలలో మాత్రం చాల తేడాలు ఉన్నాయి. ఒకటే యూనివర్సిటీ ఒకే క్లాసు రూమ్, ఒకే సబ్జెక్టు, కానీ వారు తీసుకునే జీతాలు మాత్రం వేర్వేరుగా ఉంటాయి. ప్రస్తుతం రెగ్యులర్ అధ్యాపకులు దాదాపు నెలకు రెండు నుండి మూడు లక్షలు, కాంట్రాక్టు అధ్యాపకుడలు నెలకు దాదాపు 50 నుండి 80 వేలు వరకు వేతనం తీసుకోగా, పార్ట్ టైం అధ్యాపకులు మాత్రం సంవత్సరం పని చేస్తే వారు తీసుకొనే వేతనం ఎక్కువల ఎక్కువ రెండు నుండి మూడు లక్షలు మాత్రమే. వీరి ఏడాది వేతనం రెగ్యులర్ అధ్యాపకుని ఒక నెల వేతనంతో సమానం. అలాగే కాంట్రాక్టు అధ్యాపకుని మూడు నుండి నలుగు నెలల వేతనంతో సమానం. పార్ట్ టైం అధ్యాపకులు సంవత్సరం పని చెసి ఆరు నెలలు మాత్రమే అనగా! సెమిస్టరుకు 90 రోజులు అల రెండు సెమిస్టర్లు అంటే 180 రోజులు మాత్రమే జీతం తీసుకుంటారు. వీరికి ఆదివారాలు కానీ, పండగ సెలవులు గాని, ఎండకాలం గాని, అందులో ముఖ్యంగా 15 ఆగస్టు గాని, 26 జనవరి గానీ, ఎటువంటి ప్రభుత్వ సెలవులు వీళ్ళకు వర్తించవు.

ఈ విషయంలో పార్ట్ టైం అధ్యాపకులు గత ప్రభుత్వానికి, మాది ఫుల్ టైం పని, కానీ జీతాలు మాత్రం సగం.ఈ సగం జీతాలతో రూమ్ రెంట్స్ కట్టలేక, పిల్లలకు ఫీజులు చెల్లించలేక, కుటుంబ అవసరాలు తీర్చలేక, తల్లి దండ్రులకు కనీసం తిండి పెట్టలేక, సమాజం లో యూనివర్సిటీ పార్ట్ టైం అధ్యాపకులు అంటే ఇంత పేదాగా ఉంటారా! అని చులుకనగా చూస్తున్నారని ఎన్నిసార్లు విలపించుకున్నా, కానీ వారు పట్టించుకున్న దాఖలాలు లేవని వాపోతున్నారు. ఇంటర్, డిగ్రీ కాలేజీ లలో పని చేస్తున్న అధ్యాపకులను పరిమ్నెంట్ చేసి , యూనివర్సిటీ లలో పని చేస్తున్న పార్ట్ టైం అధ్యాపకుల ను మాత్రం పరిమ్నెంట్ చేయక పోగ, కనీసం కాంట్రాక్టు చేసి నెల నెల వేతనం ఇవ్వడనికి కూడా అనుమతి ఇవ్వకుండా పార్ట్ టైం అధ్యాపకులకు తీరని అన్యాయం చేశారు అని విచారం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రజా పాలనలో ఆయన పార్ట్ టైం అధ్యాపకులు జీవితాలు మారి జీతాలు వస్తాయని, కాంగ్రెస్ మేనిఫెస్టో లో యూనివర్సిటీ లో పని చేస్తున్న పార్ట్ టైం అధ్యాపకులకు న్యాయం చేస్తారు అని , నెలకు 50 వేలు ఇస్తాం అనే హామీని చూసి ఆశతో, గత బి.ఆర్.ఎస్. ప్రభుత్వం ఎన్ని ఆశలు చూపిన, భేదిరించిన భయపడకుండా, ప్రజా ప్రభుత్వాన్ని గెలిపించామని,మంచి రోజులు వస్తాయని ఎదురుచూస్తున్న క్రమంలో మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్టు ఈ మధ్యనే ప్రభుత్వం విడుదల చేసిన జీ.వో 21 పార్ట్ టైం జీవితాలను నాశనం చేసే విధంగా ఉంది అని, ప్రభుత్వానికి గత పది రోజులుగా, పార్ట్ టైం అధ్యాపకులు విజ్ఞప్తులు, నిరసనలు, ధర్నాలు, బందులు,చేస్తూ నిరసనలు తెలుపుతునే ఉన్నారు. సమైఖ్య రాష్టంలో గత ప్రభుత్వంలో ఉన్న నాయకులకు మరియు ప్రజా పాలనలో ఉన్న నాయకులకు అవమానం జరిగితే, స్వరాష్టంలో గౌరంతో పాటు పదవులు వచ్చినాయి. స్వరాష్టం కోసం సర్వం త్యాగం చేసి, సమైఖ్య రాష్టంలో వచ్చిన అవకాశాలను కాదని, అక్రమ కేసుల పాలై , జైల్స్ కి వెళ్లి రాష్టం సాధించుకొని, స్వరాష్టంలోనే మాకు ఉద్యోగం రాకపోతే , ఉద్యోగ భద్రత లేక పోతే, మేము ఏ రాష్టం వెళ్ళాలి అని ప్రశినిస్తున్నారు.


ఇలా నిరసన తెలుపుతున్నప్పటికీని కూడా ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోషనీయం. ఎందుకంటే ప్రభుత్వం గత అనుభవాల నుండి పాఠం నేర్చుకోవాలి. 2010లో కూడా హైదరాబాదు విషయంలో అప్పుడు ఉన్నటువంటి కాంగ్రెస్ పార్టీ హైదరాబాద్ ఫ్రీ జోన్ గా ఉండాలి అనే విషయంలో ఆనాడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం త్వరగా స్పందించక పోవడం ద్వారా అప్పుడు ప్రతిపక్షంలో ఉన్నటువంటి బి.ఆర్.ఎస్. పార్టీ స్పందించి చివరికి రాష్ట సాధనలో కూడా ముందు ఉండి, ప్రత్యేక రాష్టం మీరు ఇచ్చిన తరువాత పెరూమాత్రం తన ఖాతాలో వేసుకొని చివరికి ప్రభుత్వాన్ని కూడా ఏర్పాటు చేశారు. వారికి అప్పుడు సపోర్ట్ చేసింది తెలంగాణలో ఉన్నటువంటి 12 యూనివర్సిటీలో పని చేస్తున్నటువంటి పార్ట్ టైం అధ్యాపకులు అని చెప్పచ్చు. ఎందుకంటే ఉద్యమ కాలంలో టిఆర్ఎస్ పార్టీ ఎప్పుడు రాజీనామా చేసిన ఆ పార్టీ ప్రచారం చేయకపోయినా ప్రచారం చేసింది అధ్యాపకులు అనే విషయాన్ని చెప్పక తప్పదు. ఎందుకంటే విశ్వవిద్యాలయాలు అనేవి సెంటర్ పాయింట్ లు మరియు సామాజిక కేంద్రాలు. యూనివర్సిటీల్లో చదువుకునేటువంటి విద్యార్థులు తెలంగాణలో ఉన్నటువంటి ఉమ్మడి పది జిల్లాల నుండి విద్యార్థులు ఉంటారు. వారికి పాఠాలు బోధించేది ఎక్కువమంది పార్ట్ టైం అధపకులే, తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలు విద్యార్థులకు చెప్పుతూ మరియు సమకాలిన రాజకీయాలు, విద్యార్థులకు బోధించేది కూడా అధ్యాపకులే. భవిష్యత్తులో తెలంగాణలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా, ఎన్నికల యొక్క ప్రాముఖ్యత గురించి పార్టీ గురించి ప్రభుత్వం గురించి పథకాల గురించి సమకాలిన అంశాల గురించి క్లాస్ లో చెప్పేది, ఏ ప్రభుత్వం మంచిది ఏది కాదు ఏ పార్టీ అధికారం లోకి వస్తే మంచిదో చెప్పేది కూడా అధ్యాపకులే. వీరి సమస్య ను పరిష్కరించ మని ఎన్ని సార్లు యూనివర్సిటీ అధికారులకు ప్రభుత్వానికి మోర పెట్టుకున్న స్పందించక పోతే, ఈ నెల 17న సచ్చివాలయ ముట్టడి కార్యక్రమానికి పిలుపు నిచ్చి, ముట్టడికి వస్తే దాదాపు పోలిసుల లెక్కల ప్రకారం 800 మందిని అక్రమంగా పోలీసులు అరెస్ట్ చేసి వివిధ పోలీస్ స్టేషన్లులు తిప్పుతూ కనీసం మంచి నీళ్ళు కూడా ఇవ్వకుండా పశువులులను కుక్కినట్టు వ్యానులలో కుక్కి తిప్పుతుంటే ఒక అధ్యాపకుడు శ్వాస ఆడక గుండె నొప్పి వస్తే, హాస్పిటల్ కు పంపించారు.

తక్షణమే యూనివర్సిటీల్లో రెగ్యులర్, కాంట్రాక్ట్ లెక్చరర్లతో సమానంగా పనిచేస్తున్న పార్ట్ టైం అధ్యకులకు యూజీసీ పీ స్కేల్ అమలు చేయాలి. ఎందుకంటే వారు కూడా యూజీసీ గైడ్ లైన్స్ కు అనుగుణంగా రెగ్యులర్, కాంట్రాక్ట్ అధ్యాపకులలగే పీహెచ్ డీ, నెట్, సెట్ అర్హత కలిగి డిపార్టమెంటల్ కమిటీ (డీసీ) ల ద్వారా డెమో, ఇంటర్వ్యూ ద్వారా అపాయింట్ అయినారు. వాళ్లతో సమానం గా పాఠాలు చెప్తున్నప్పటికీ యూనివర్సిటీల్లో పార్ట్ టైం అధ్యాపకుల పై వివక్ష ఎందుకు ? సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని గతంలోనే సుప్రీం కోర్టు తీర్పునిచ్చింది. కానీ ప్రభుత్వాలు ఈ విషయాన్నిఎందుకు పట్టించుకోడంలేదు? అని ప్రశ్నిస్తున్నారు. ఇప్పుడు రాష్టంలోని యూనివర్సిటీల్లో పనిచేస్తున్న రెగ్యులర్ అధ్యాపకులు, కాంట్రాక్ట్ అధ్యాపకులు ఒకప్పుడు వీరి లగే పార్ట్ టైం అధ్యాపకులుగా రిక్రూట్ అయినవాళ్లే. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం వాళ్లకు అవకాశమివ్వడం వల్లే ఈ రోజు వాళ్లంతా రెగ్యులర్, కాంట్రాక్ట్ అధ్యపకులు గా పనిచేస్తున్నారు అని, పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం వీరిని పట్టించుకోకపోవడం వల్లనే ఈ రోజు పార్ట్ టైం అధ్యాపకులు సాలి సాలని జీతంతో బతుకులు గడపవలసి వస్తుంది అని పనికి తగిన జీతం ఇవ్వకుండ 10, 15 ఏళ్లుగా శ్రమ దోపిడీ చేస్తున్నారు అని వీరికి ప్రతిపక్ష పార్టీలు, ప్రజాసంఘాలు , మేధావులు, విద్యార్థి సంఘాల మద్దతు రోజు రోజు కు పెరుగుతుంది.కావున ఈ దేశ భావి భారత పౌరులను తీర్చిదిద్దె అధ్యాపకులు అర్థ ఆకలితో ఎలా విదార్తులను మంచి పౌరులుగా తాయారు చేస్తారో ప్రభుత్వం ఆలోచించి, ఈ ప్రజా పాలనలో ఐన వీరికి కూడా యూజీసీ నిబంధనల ప్రకారం యూజీసీ పే స్కేల్ ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించి, ఈ సమస్య కు పరిష్కారం ప్రజా పాలన చూపాలని ఆశిద్దాం.!



డాక్టర్‌తాళ్ళపెల్లి సంజీవ్
అసిస్టెంట్ ప్రొఫెసర్, కాకతీయ యూనివర్సిటీ వరంగల్
సెల్.న. 9701843998.

# లెనిన్ ఖనన ప్రక్రియను నిలిపివేయాలి



ప్రప్రథమ సోషలిస్ట్ రాజ్య నిర్మాత, రష్యా మాజీ అధ్యక్షుడు వి.ఐ.లెనిన్ అంత్యక్రియ లకు రష్యన్ ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రసార మాధ్యమాలు వెల్లడిస్తున్నాయి. ఈ రకంగా 'లెనిన్ చనిపోయిన 101 ఏళ్లకు అంత్యక్రియలు నిర్వహించాలి' అని రష్యన్ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు వ్యక్తమవుతూనే ఉన్నాయి. లెనిన్ భౌతిక కాయాన్ని ప్రజల సందర్శనార్థం రెడ్ స్క్వేర్ మ్యూజియంలో 1930 నుండి ప్రజల సందర్శనార్థం గత 95 ఏళ్లు పైగానే పటిష్టంగా భద్రపరుస్తూనే ఉన్నారు. కాని ఇప్పుడు 'సామాన్యుల మాదిరిగా లెనిన్ భౌతికకాయానికి 2025 సెప్టెంబర్ 3 నాడు ఆయన స్వస్థలం ఉల్యాన్వోస్కోలో ఉన్నత స్థాయి ప్రభుత్వ అధికారులు హాజరయ్యే కార్యక్రమంలో అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించాలి' అని రష్యా అంతర్గత శాఖా నిర్ణయించడం గమనార్హం. ఈ తరుణంలో లెనిన్ మృతదేహాన్ని ఈ క్రమంలో నిత్యం వేలాది మంది సందర్శించే లెనిన్ మ్యూజియం శాశ్వతంగా మూతపడబోనుండడం విచారకరం. 1924 జనవరి 21 నాడు వ్లాదిమిర్ లెనిన్ 53 సంవత్సరాల వయసులో మరణించాడు. ఆయన మరణించిన రెండు రోజుల తర్వాత సోవియట్ దళాలు లెనిన్ మృతదేహాన్ని గోర్కిలోని ఆయన ఇంటి నుండి రైలులో మాస్కోకు తీసుకెళ్లి అక్కడ హౌస్ ఆఫ్ ది యూనియన్స్ యొక్క గ్రాండ్ హాలులో ఒక శవపేటికలో ఉంచి మూడు రోజుల పాటు ప్రజల సందర్శనార్థం ఉంచి జనవరి 27 నాడు మృతదేహాన్ని రెడ్ స్క్వేర్కి తరలించారు. ఆయన మృతదేహాన్ని సంతాపానికి వచ్చేవారు సందర్శించడానికి అనువైన నిర్మాణాన్ని నిర్మించే పనిని ఆర్కిటెక్ట్ అలెక్సీ షుసెవ్ అప్పగించారు. మాస్కో లోని క్రెమ్లిన్ గోడకు దగ్గరగా ఉన్న రెడ్ స్క్వేర్లో నిర్మించిన చెక్క సమాధి లోపల జనవరి 27 నాడు లెనిన్‌ని శవపేటికలో ఉంచారు.

మాస్కోలోని రెడ్ స్క్వేర్ అంచున క్రెమ్లిన్ గోడల పక్కన సోవియట్ యూనియన్ వ్యవస్థాపక పితామహుడు వ్లాదిమిర్ లెనిన్ మృతదేహాన్ని సంరక్షించిన రాతి సమాధి ఉంది. చరిత్ర అంతటా ఇతర ప్రపంచ నాయకులను ఎంబామ్ చేసి తరువాత ఖననం చేసినప్పటికీ లెనిన్ మరణించిన ఒక శతాబ్దం తర్వాత కూడా ప్రత్యేక పర్యవేక్షణ చర్యల మూలంగా ఆయన భౌతిక కాయం చెక్కుచెదర కుండా అలానే ఉండడం ప్రత్యేకతని సంతరించుకుంది. లెనిన్ మృతదేహాన్ని పూర్తిగా ఆచరణాత్మక కారణాల వల్లే ఎంబామ్ చేశారు అని స్పష్టంగా చెప్పవచ్చు. సోవియట్ యూనియన్ యొక్క ఆదర్శాలు లెనిన్ సమాధి ద్వారా ప్రతిబింబిస్తూనే ఉన్నాయి. సోవియట్ ప్రజలు కమ్యూనిస్ట్ శ్రమ ఫలాలను అందరూ ఆస్వాదించగల ప్రకాశవంతమైన భవిష్యత్తు కోసం ఎదురుచూడాలని ఆయన సమాధి చెప్పకనే చెబుతుండటం గమనార్హం. 'నేడు మాస్కో నడిబొడ్డున లెనిన్ సమాధి కమ్యూనిస్ట్ శక్తికి ఒక ముఖ్యమైన చిహ్నంగా మారింది' అని చెప్పవచ్చు.

ఆర్కిటెక్ట్ అలెక్సీ షుసేవ్ రూపొందించిన పాలరాయి, పోర్ఫిరీ, గ్రానైట్ మరియు లాబ్రడోరైట్లతో కూడిన కొత్త శాశ్వత రాతి సమాధి నిర్మాణం పదహారు నెలలు కొన సాగి చివరకు 1930 అక్టోబర్లో పూర్తయినప్పటి నుండి లెనిన్ మృతదేహాన్ని దాదాపు నిరంతరం ప్రజల సందర్శనార్థం ఉంచారు. 1941 అక్టోబర్ నెలలో రెండవ ప్రపంచ యుద్ధంలో రష్యాలో గ్రేట్ పేట్రియాటిక్ యుద్ధంగా పిలువబడే సమయంలో మాస్కో ను స్వాధీనం చేసుకునే అవకాశం కనిపించినప్పుడు లెనిన్ మృతదేహాన్ని సైబీరియా లోని త్యుమెన్కు తరలించి యుద్ధ విరమణ తర్వాత ఆయన భౌతికకాయాన్ని తిరిగి యథాస్థానానికి తీసుకురావడాన్ని ప్రత్యేకంగా గమనించవచ్చు.

1991 లో సోవియట్ యూనియన్ పతనం చెందే వరకు లెనిన్ మృతదేహం నిరంతర సంరక్షణ పనులకు సోవియట్ ప్రభుత్వం నిధులు సమకూర్చింది. 19 91 తర్వాత ప్రభుత్వం ఆర్థిక సహాయా న్ని నిలిపివేయగా ఆ తర్వాత సమాధికి ప్రైవేట్ విరాళాల ద్వారా నిధులు సమకూర్చారు. 2012 నుండి సమాధి పునాది పునర్నిర్మాణానికి నోచుకుని 2013 నాడు తిరిగి తెరవబడింది. 2016లో రష్యన్ ప్రభుత్వం తన మునుపటి నిర్ణయాన్ని మార్చుకుని లెనిన్ మృతదేహాన్ని సంరక్షించడానికి 13 మిలియన్ రూబిళ్లు ఖర్చు చేస్తామని ప్రకటించి ఆ దిశగానే ముందుకు సాగింది.

1991లో సోవియట్ యూనియన్ పతనం తర్వాత లెనిన్ భౌతికకాయాన్ని క్రెమ్లిన్ వాల్ నెక్రోపోలిస్కు తరలించాలనే ఆలోచన బహిరంగంగా తీవ్ర చర్చనీయాంశమైంది. 'లెనిన్ సమాధిని కూల్చివేసి సెయింట్ పీటర్స్బర్గ్లోని వోల్కోవ్ స్మశాన వాటికలో ఆయన తల్లి మరియా అలెగ్జాండ్రోవ్నా ఉలియానోవా పక్కన లెనిన్ భౌతికకాయాన్ని ఉంచాలి' అని రష్యన్ ఆర్థోడాక్స్ చర్చి మద్దతుతో అప్పటి రష్యా అధ్యక్షుడు బోరిస్ యెల్ట్సిన్ ప్రణాళిక రచించారు. అయితే ఆనాడు యెల్ట్సిన్ వారసుడు వ్లాదిమిర్ పుతిన్ అభ్యంతరం వ్యక్తం చేయడం గమనార్హం.

ఆర్థిక భారం దృష్ట్యా లెనిన్ అంత్యక్రియలు నిర్వహించాలి అని ప్రభుత్వం భావిస్తుంది అని రియా నోవెస్టి ఏజెన్సీ వెల్లడించడం గమనార్హం. 'లెనిన్ మృతదేహాన్ని సంరక్షించడానికి చాలా ఎక్కువ ఖర్చు కావడంతో ఆర్థిక కారణాల వల్ల ఈ నిర్ణయం తీసుకోబడింది. లెనిన్ చనిపోయి 100 ఏళ్ళు దాటి 101 ఏళ్ళు కావస్తుంది. ఆయన భౌతికకాయాన్ని భద్రపరచడం కోసం ప్రతి నెల ఖర్చులు పెరుగుతూనే ఉన్నాయి. ఇలా 100 సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు ఉన్న మృతదేహాన్ని సంరక్షించడానికి అవసరమైన నెలవారీ అవసరాలను మేము ఇకపై తీర్చలేము. ఇది ఆర్థికంగా భారమవుతుంది' అని రష్యా ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి పేర్కొనడం ఏమాత్రం సహేతుకం కాదు.

రష్యన్ అంతర్గత వ్యవహారాల మంత్రిత్వ శాఖ తీసుకున్న ఈ నిర్ణయాన్ని ఆయా భావాజాలాలతో సంబంధం లేకుండా కమ్యూనిస్టులు మరియు కమ్యూనిస్టు యేతరులు లెనిన్ అంత్యక్రియలు నిర్వహించడంపై తీవ్రంగా విమర్శలు గుప్పిస్తున్నారు. అందువల్ల ప్రభుత్వ నిర్ణయం ఏమాత్రం ఆమోదయోగ్యం కానేకాదు. ఒక రకంగా ప్రభుత్వ నిర్ణయం 101 ఏళ్ళ చరిత్ర ఉన్న లెనిన్ భౌతికకాయానికి ఘోర అవమానాన్ని మిగుల్చ గలదు అని చెప్పవచ్చు.

ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల రష్యన్ ఫెడరేషన్ కమ్యూనిస్ట్ పార్టీ ప్రెస్ ఆఫీస్ తీవ్ర అసంతృప్తిని వెల్లడించి అధ్యక్షుడు పుతిన్ను వ్యక్తిగతంగా జోక్యం చేసుకుని దానిని రద్దు చేయాలని పిలుపునివ్వడాన్ని ప్రత్యేకంగా గమనించవచ్చు. అందువల్ల ఇకనైననూ రష్యన్ ప్రభుత్వం లెనిన్ ఖనన ప్రక్రియను నిలిపివేయాల్సిన అవసరం తప్పకుండా ఉంది. ఈ దిశగా అంతర్జాతీయంగానూ కమ్యూనిస్ట్ శక్తులు రష్యన్ ప్రభుత్వంపై వత్తిడి తీసుకురావాల్సిన అవసరం తప్పకుండా ఉంది. అంతిమంగా 'లెనిన్ వ్యక్తిత్వ ఆరాధనను సజీవంగా ఉంచడానికి, సోవియట్ చట్టబద్ధతను నిలబెట్టడానికి మరియు అసాధారణంగా విలాసవంతమైన అంత్యక్రియల అవసరాన్ని నివారించడానికి బలీయమైన కమ్యూనిస్ట్ రాజ్యాన్ని స్థాపించిన లెనిన్ ఆశయాలకు నేడు లెనిన్ భౌతికకాయం ప్రతిరూపంగా నిలుస్తుంది' అని ఘంటాపథంగా చెప్పవచ్చు.

**(ఏప్రిల్ 22 లెనిన్ 155వ జయంతి)**



జె.జె.సి.పి. బాబూరావు
రీసెర్చ్ స్కాలర్
సెల్: 94933 19690.

## కరములు జోడించిరి

పల్లవి : తెలంగాణ జనం మోసపోయిందిరా
తెలంగాణ తల్లి రూపు మారిందిరా
.. తె..

చరణం 1
అమర వీరుల ఆత్మ ఘోశిస్తు ఉన్నది
రాష్ట్రమంతా దీన జన వధన మైనది
తెల్లని వన్నీ పాలు అనుకున్నది
నింగి నేలకు నమస్కరిస్తున్నది

చరణం 2
దూరపు కొండలు నునుపని తెలియ లేకుండిరి
గారడి మాటలకు జనం తలవంచిరి
గ్యారెంటీలకు భ్రమసి సంకలెగరేసిరి
నేతలు ఓట్లు లాగి శఠగోపంతో దీవించిరి

చరణం 3
ప్రాజెక్టులు కృంగెనని మంగళం పాడిరి
పంట పొలాలను కసితో ఎండబెట్టిరి
కక్షల వివక్షలతో తులతూగుతూ మురిసిరి
గత పాలనలో ఖజానా ఖాళీ అని గోల పెట్టిరి

చరణం 4
ఉద్యోగాలు అంటు కొత్త ఆశలు పెంచిరి
విధ్యార్థులను ఎన్నికల ప్రచారానికి తింపిరి
గెలిచి నోటిఫికేషన్ లతో ఊదర గొట్టిరి
అనుకూలరకే నౌకర్లు వడ్డించిరి

చరణం 5
మూసీ ప్రక్షాళన అంటూ వనాలు నరికి
కాలుష్యం నింపిరి
ప్రభుత్వ భూములామ్మటానికి నడుం బిగించరి
హెచ్‌యూసి యువకులను చెరసాలలో పెట్టిరి
లాఠీలతో రక్షక భటుల ఉసిగొల్పిరి

చరణం 6
నిజం తెలిసన ప్రజలు మేల్కాంచిరి
బిఆర్‌యస్‌కు జై అంటూ తొడ చరిచిరి
25యెండ్ల పంగడకి హసన్‌పర్తి సద్దులు కట్టిరి
కేసీఆర్‌కు వందనమని కరములు జోడించరి

రచన.. నమిలకొండ నాగేశ్వర్ రావు
8688553470 మేడ్చల్

## పారదర్శకంగా సంక్షేమ పథకాల అమలు

### ఏప్రిల్ నెలాఖరు వరకు ఎల్ఆర్ఎస్

**తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంత కుమారి**





**వికారాబాద్ జిల్లా బ్యూరో, ఏప్రిల్ 22 (జనం సాక్షి):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను పారదర్శకంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు సూచించారు. మంగళవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయం నుండి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతకుమారి, ఉన్నతాధికారులతో కలిసి రెవెన్యూ , గృహ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి భూభారతి, ఇందిరమ్మ ఇల్లు, ఎల్ఆర్ఎస్ పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, గృహ శాఖ అధికారులకు పలు సూచనలు చేశారు.అనంతరం అధికారుల ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ... ప్రభుత్వ నిర్దేశాలకు అనుగుణంగా ముందుగా అతి పేద వారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సిఫార్సు జాబితాలను పరిగణలోకి తీసుకొని ఎమ్మెల్యేల ఆమోదంతో లబ్ధిదారుల ఎంపిక ఉండాలని అధికారులకు సూచించారు. భూముల రిజిస్ట్రేషన్, క్రమబద్ధీకరణ, రికార్డుల్లో మార్పులు చేర్పులు వంటి తదితర సేవలపై అధికారులు దృష్టి సారించి, భూ భారతి నూతన ఆర్ ఓ ఆర్ చట్టంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆయన అధికారులకు సూచించారు. ఏప్రిల్ నెలాఖరు వరకు ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణకు అవకాశం ఉన్నందున ఎల్ఆర్ఎస్ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ తెలిపారు. కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్, సుధీర్, ఆర్డిఓ వాసు చంద్ర, హౌసింగ్ ఇఇ కృష్ణయ్య, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీగా కల్లూరు

**జీవో విడుదల**




**కల్లూరు ఏప్రిల్ 22(జనం సాక్షి) :** కల్లూరు మేజర్ గ్రామపంచాయతీ ని మున్సిపాలిటీగా చేస్తూ మంగళవారం రాష్ట్ర గవర్నర్ ఆమోదంతో గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సత్తుపల్లి శాసన సభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ ఇచ్చిన హామీ మేరకు కల్లూరు మున్సిపాలిటీ చేసినందుకు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత అసెంబ్లీ సమావేశాల్లో కల్లూరు మున్సిపాలిటీ చేయాలని ప్రతిపాదన పంపించటం జరిగింది. కల్లూరు పంచాయతీలో కల్లూరు జీడిపిపల్లి ఖాన్ ఖాన్ పేట శ్రీరాంపురం ఉండగా ప్రస్తుతం మున్సిపాలిటీగా చేయటంతో కప్పల బంధం పుల్లయ్య బంజర, తూర్పు లోకవరం ,పడమర లోకావరం, కిష్టయ్య బంజర, హనుమతండ, వాచ్య నాయక్ తండ, గ్రామపంచాయతీలను కూడా మున్సిపాలిటీలో కలుపుతూ స్థానిక గ్రామపంచాయతీ నుండి తీర్మానం పంపించడం జరిగింది తీర్మానం ప్రకారం అసెంబ్లీలో ప్రతిపాదించడంతో ప్రభుత్వం తీర్మానం చేసి రాష్ట్ర గవర్నర్ పంపించడం జరిగింది .రాష్ట్ర గవర్నర్ ఆమోదంతో కల్లూరు మున్సిపాలిటీగా మారింది . ఈ నేపద్యంలో జిల్లా మంత్రులకి స్థానిక శాసనసభ్యులకు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలుపుతున్నారు.

# భూభారతి అమలుతో అధికారాల వికేంద్రీకరణ

**సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**

**సూర్యాపేట ప్రతినిధి/ పెన్‌పహాడ్(జనంసాక్షి) :** భూ భారతి చట్టం -2025ను అమలుపర్చటం ద్వారా అధికారాల వికేంద్రికరణ జరుగుతాయని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. మంగళవారం సూర్యాపేట పట్టణం సుమంగళి పంక్షన్ హాల్, పెన్‌పహాడ్ పంక్షన్ హాల్‌లో భూ భారతి చట్టం 2025పై అవగాహన సదస్సులో జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబుతో కలిసి పాల్గొని మాట్లాడారు.తెలంగాణ ప్రభుత్వం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి రోజున భూ భారతి చట్టం అమలులోనికి తీసుకొని రావటం జరిగిందని అన్నారు.రాష్ట్ర స్థాయిలో, జిల్లా స్థాయిలో రెవిన్యూ సిబ్బందికి అవగాహన కల్పించటం జరిగిందని తెలిపారు.ఇప్పుడు మండల స్థాయిలో భూ సమస్యలను ఎలా పరిష్కరించుకోవాలో తెలుసుకునేందుకే ప్రజలకి చట్టంపై అవగాహన కల్పిస్తున్నామని, 23 మండలాలలో సదస్సులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ధరణిలో చాలా సమస్యలు పరిష్కరించ లేనివి ఉన్నాయని, ప్రతి సమస్య కలెక్టర్ ద్వారా గాని, కోర్టు ద్వారాగానీ పరిష్కరించే విధంగా ఉండేదని అన్నారు. ప్రతి ఒక్కరు గ్రామం నుండి సూర్యాపేటక వచ్చి సమస్యపై దరఖాస్తు ఇవ్వాలంటే ప్రజలకి చాలా ఇబ్బందిగా ఉండేదని, కానీ భూ భారతి చట్టం ద్వారా అధికారం వికేంద్రికరణ జరుగుతుందని, సమస్యని బట్టి తహసీల్దార్, ఆర్డిఓ, కలెక్టర్ స్థాయిలో పరిష్కరించవచ్చని అన్నారు. త్వరలో గ్రామ స్థాయిలో భూ సమస్యలు పరిష్కరించేందుకు గ్రామ పరిపాలన అధికారి నియమించబోతున్నారని, దీనితో గ్రామ స్థాయిలో ప్రభుత్వ భూములకి రక్షణ ఏర్పడుతుందని అన్నారు.భూ భారతి చట్టం-2025 ఏప్రియల్ 14న ప్రారంభించి నాలుగు మండలాలలో పైలెట్ ప్రాజెక్ట్ కింద అమలు జరుగుతుందని, తర్వాత ప్రతి జిల్లాలో ఒక్క మండలంలో అమలు చేస్తారని చెప్పారు. ఆ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా ప్రతి గ్రామంలో భూ భారతి చట్టం అమలు జరుగుతుందని తెలిపారు. భూ భారతి చట్టంపై పిపిటి ద్వారా ప్రజలకి జిల్లా కలెక్టర్ వివరించారు. జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు మాట్లాడుతూ గత నాలుగున్నర సంవత్సరా లుగా ధరణిలో చాలా సమస్యలు ఉన్నాయని, ప్రజలు కలెక్టర్ కార్యాలయ చుట్టూ తిరిగారని, అప్పుడు అధికారులు ఏమి చెయలేకపోయారని ధరణి వైఫల్యాలు సరిదిద్ది పారదర్శకంగా ముఖ్యమంత్రి చేతుల మీదుగా భూ భారతి చట్టం ఏప్రియల్ 14న ప్రారంభించడం జరిగిందని తెలిపారు.సాదాబైనామా ధరఖాస్తులు ధరణిలో పరిస్కారం కాలేదని, భూ భారతిలో సాదాబైనామ ధరఖాస్తులు పరిశీలించి క్రమబద్ధికరిస్తామని అన్నారు. గతంలో గ్రామ స్థాయిలో విఆర్ఓ, విఆర్ఏలు ఉండేవారని, ధరణి అమలు తర్వాత గ్రామాలలో అధికారులు లేరని అన్నారు. భూ భారతిలో పలు సమస్యలు మండల స్థాయిలో పరిష్కారం అవుతాయని తెలిపారు.ఈ చట్టంలో రైతుల భూమి రికార్డులలో భద్రంగా ఉంటుందని,ప్రజలు కోర్ట్ లు చుట్టూ తిరగకుండా అప్పీల్ వ్యవస్థ రూపొదించారని తెలిపారు.రెవిన్యూ అధికారులు ప్రజలకి సహకరిస్తు వారి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలని తెలిపారు.రాష్ట్ర వ్యవసాయ కమిషన్ మెంబర్ చెవిటి వెంకన్న యాదవ్ మాట్లాడుతూ భూ భారతి చట్టం రైతన్నల చుట్టం అని, ధరణితో అధికారులు, రైతులు చాలా ఇబ్బందులు పడ్డారని అన్నారు. ధరణిలోని వైఫల్యాలను ఏలా త్వరగా పరిష్కరించాలో నిపుణులు, మేధావులతో కమిటీ ఏర్పాటు చేసి, ప్రజల నుండి సలహాలు సూచనలు తీసుకొని మెరుగైన చట్టం రూపొందించారని పేర్కొన్నారు.ఇక భూసమస్యలన్ని పరిష్కారమవుతాయని తెలిపారు.సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి మాట్లాడుతూ భూ భారతి చట్టం ద్వారా పేదల భూములకి పటిష్టమైన భద్రత దొరుకుతుందని, ప్రజా ప్రభుత్వం మొదటి నుండి రైతుల సంక్షేమం కోసం ఎంతగానో కృషి చేస్తుందని కొనియాడారు.ఈ సమావేశంలో ఆర్డిఓ వేణుమాధవ రావు,తహసీల్దార్లు శ్యామ్ సుందర్ రెడ్డి, లాల్ నాయక్, ఎంపిడిఓలు బాలకృష్ణారెడ్డి, వెంకటేశ్వర్లు, పిఎసిఎస్ చైర్మన్లు, మాజీ ప్రజా ప్రతినిధులు,రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పెన్‌పహాడ్,అనాజిపురం ఐకెపి కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



## ఇంటర్ ఫలితాల్లో బీసీ గురుకుల విద్యార్థుల విజయకేతనం

**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఈ ఏడాది 2024-25 ఇంటర్ ఫలితాల్లో మహాత్మా జ్యోతి బా పూలే బీసీ గురుకుల విద్యార్థులు ఉత్తమ ర్యాంకులతో పాటు రాష్ట్ర సగటు ఉత్తీర్ణత శాతం కంటే అధిక ఉత్తీర్ణత సాధించి విజయభేరి మోగించారు. పది లోపు ర్యాంక్ లు 108 మంది సాధించగా, 7649 మంది విద్యార్థులు ఏ గ్రేడ్ సాధించి సీనియర్ ఇంటర్ ఫలితాల్లో తమ సత్తా చాటారు. సీనియర్ ఇంటర్ పరీక్షలకు హాజరైన విద్యార్థులు 12,612 కాగా వీరిలో 10489 మంది ఉత్తీర్ణత సాధించారు. ఏ గ్రేడ్ (75 శాతం మార్కులు) సాధించిన విద్యార్థులు 7649 బి గ్రేడ్ (60శాతం మార్కులు) 2347. ఉత్తీర్ణత శాతం 83.17 జూనియర్ ఇంటర్ పరీక్షలకు హాజరైన విద్యార్థులు 12,813, ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు 10,014. పది లోపు ర్యాంకులు సాధించిన 346 మంది విద్యార్థులు. ఏ గ్రేడ్ సాధించిన విద్యార్థులు 6798, బి గ్రేడ్ 2429. ఉత్తీర్ణత శాతం 78.15. సీనియర్ ఇంటర్ లో వంద శాతం ఉత్తీర్ణత 11 కాలేజీలు సాధించగా, జూనియర్ ఇంటర్ లో వంద శాతం ఉత్తీర్ణత మూడు కాలేజీలు సాధించాయి. రెండవ సంవత్సరం ఎంపిసిలో రాష్ట్ర స్థాయిలో పదిలోపు ర్యాంకులు 90మంది విద్యార్థులు సాధించగా, మూడో ర్యాంక్ కె. మమత(994), ఎం ప్రసన్న(994), నాల్గోవ ర్యాంక్ ఎల్. విద్యాశ్రీ(993), డి.కీర్తన(993), ఇ. కీర్తన(993), ఐదో ర్యాంక్ ( 992 మార్కులు) ఏడుగురు విద్యార్థులు, ఆరో ర్యాంక్( 991 మార్కులు) 11 మంది విద్యార్థులు, ఏడో ర్యాంక్( 990 మార్కులు) 9మంది విద్యార్థులు సాధించారు.

## పూలేని రాష్ట్రానికి పరిచయం చేసిన ముదిగొండ ఈశ్వరయ్య




**హైదరాబాద్ (జనంసాక్షి) :** ముదిగొండ ఈశ్వరయ్య 5 వర్ధంతి సభలో జోతిబా పూలే స్మృతి సమితి అధ్యక్షులు వై. సత్యనారాయణ మాట్లాడుతూ "ముదిగొండ ఈశ్వరయ్య గారు ఆంధ్ర పూలేలా పనిచేశారని అన్నారు. తెలుగువారి అభివృద్ధికి ఆయన అంకితభావంతో సేవలు అందించారని వ్యక్తిత్వ వికాస తరగతులు నిర్వహించడమే కాకుండా, సివిల్ సర్వీసుల కోచింగ్‌కి కూడా ఆయన ముందుకొచ్చారు అన్నారు. బీసీ కమిషన్ మాజీ చైర్మన్ బిఎస్ రాములు మాట్లాడుతూ "గ్రూప్-1 అధికారులు, ఇతర ఉన్నతాధికారులను ఈశ్వరయ్య గౌరవించిన విధానం అందరికీ ఆదర్శంగా నిలిచింది. బుర్ర వెంకటేశం మెదక్ కలెక్టర్‌గా వున్నపుడు ఈశ్వరయ్య గ్రూపు పరీక్షలు పాసైనవారిని సంయుక్తంగా సత్కరించారని గుర్తుచేసారు. బహుజనవేత్త నారగోని మాట్లాడుతూ "మహాత్మా పూలేను తెలుగు రాష్ట్రాల్లో ప్రజలకు పరిచయం చేసిన తొలి వ్యక్తి ముదిగొండ ఈశ్వరయ్య. ఆయన కృషి వల్లే మహాత్మా పూలే జీవితం మీద చర్చ మొదలైంది" అని అన్నారు. "ఈశ్వరయ్యతో కలిసి నేను మహాత్మా పూలే విగ్రహాలను ప్రారంభించాను. స్కూల్స్‌కి వెళ్లి ఆయన ఆవిష్కరించిన పూలే సిద్ధాంతాన్ని విద్యార్థులకు వివరించాం. ఆయన విద్యపై నమ్మకంతో పనిచేశారు" అన్నారు పర్వయ్య. జోతిబా టీవీ వ్యవస్థాపకుడు, సంబంధాల నిపుణుడు సతీష్ ముదిగొండ మాట్లాడుతూ "మహాత్మా పూలే పేరును ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఈశ్వరయ్య పాత్ర కీలకం. నారాగొని గారికి పూలే పేరు ప్రచారంలో ఆయన చేసిన సహకారం మరపరానిది. పూలే సిద్ధాంతాన్ని జీవితం పాఠంగా మార్చిన వ్యక్తి ఈశ్వరయ్య!" అన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్తరపల్లి కృష్ణ, రమణాండు, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. తిలక్ రోజులోని బీసీ అధ్యయన కేంద్రంలో జరిగిన ఈశ్వరయ్య 5వ వర్ధంతి సభలో ఆయన చేసిన సేవలకు శ్రద్ధాంజలి అర్పించారు.

## న్యాయవాద వృత్తిని పరిరక్షించే విధంగా చట్టంలో సవరణలు చేయాలి

**ఐలు జిల్లా కమిటీ డిమాండ్**




**చౌటుప్పల్ ఏప్రిల్ 22(జనం సాక్షి) :** న్యాయవాద వృత్తిని పరిరక్షించే విధంగా చట్టంలో సవరణలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చౌటుప్పల్ కోర్టు బారోసోసియేషన్ ఆవరణలో న్యాయవాదుల సవరణ చట్టం ముసాయిదా బిల్లు - 2025 ప్రతులను న్యాయవాదులతో కలిసి వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐలు జిల్లా ఉపాధ్యక్షులు తడక మోహన్ మాట్లాడుతూ ముసాయిదా బిల్లులోని అంశాలను బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాలో గాని, రాష్ట్రాల బార్ కౌన్సిల్లో గాని, దేశంలోని వివిధ జిల్లాల బార్ అసోసియేషన్లో గాని ఏమాత్రం చర్చించకుండా బిల్లులోని పలు అంశాలను మరుగున దాచి ఉంచి ఏకపక్షంగా బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా యొక్క స్వతంత్ర ప్రతిపత్తిని తగ్గించే విధంగా నిర్ణయం తీసున్న కేంద్ర ప్రభుత్వం యొక్క నిరంకుశ వైఖరిని న్యాయవాదులందరూ ముక్తకంఠంతో ఖండించాలని పిలుపునిచ్చారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా పాలకమండలిలో, న్యాయవాద వృత్తిలో సంబంధం లేని రాజకీయ నాయకులను ముగ్గురిని సభ్యులుగా నియమించే ప్రక్రియను వెంటనే ఉపసంహరించుకోవాలని వారు అన్నారు. విదేశీ న్యాయవాదులను, సంస్థలను మన దేశంలోని న్యాయవ్యవస్థలో జోక్యం చేసుకునే విధంగా అవకాశం కల్పించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు. న్యాయవాదులపై ఏమైనా క్రిమినల్ కేసులు విచారణలో ఉంటే వారిని న్యాయవాద వృత్తి నుండి తొలగించడాన్ని మరియు బార్ కౌన్సిల్ ఎన్నికలకు అనర్హులుగా ప్రకటించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఐలు జిల్లా ఉపాధ్యక్షులు తడక మోహన్ తెలియజేశారు. న్యాయవాదులపై ఇటీవల జరుగుతున్న హింసాత్మక దాడులను ఖండిస్తున్నామని, న్యాయవాదులకు పరిరక్షణ చట్టాన్ని రూపొందించాలని వారు ప్రభుత్వానికి సూచించారు. న్యాయవాద వృత్తి పరిరక్షించే విధంగా చట్టంలో సవరణలు చేసే వరకు, న్యాయవాదుల హక్కుల కోసం ఐక్యంగా పోరాటాలకు సిద్ధం కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బారసోసియేషన్ అధ్యక్షులు బాల్య వెంకటచలం,ప్రధాన కార్యదర్శి పడమటి మైపాల్ రెడ్డి, ఉపాధ్యక్షులు రాపోలు వేణు సహాయ కార్యదర్శి అల్లి స్వాతి, కోశాధికారి జల్లా రమేష్, కార్యవర్గ సభ్యులు జ్యోతి ఎండి ఖయ్యాం పాష, మాజీ బార అసోసియేషన్ అధ్యక్షులు ఉడుగు శ్రీనివాస్ గౌడ్, న్యాయవాదులు ఎస్సార్ బిక్షపతి, కాను వెంకటయ్య,పిట్టల బిక్షమయ్య, రాఘవేంద్ర శ్రీకాంత్ పాల్గొన్నారు

## కాళేశ్వరంలో కరెంట్ కష్టాలు



**కాళేశ్వరం, ఏప్రిల్ 22 (జనంసాక్షి) :** భూపాలపల్లి జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కాళేశ్వరంలో కరెంట్ కష్టాలు గ్రామస్తులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. వచ్చే మే మాసంలో సరస్వతీ పుష్కరాలు జరగనున్న నేపద్యంలో విద్యుత్ శాఖ అధికారులు నూతన కరెంట్ స్థంబాలు ఏర్పాటు చేస్తుం డడంతో గత వారం రోజులుగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుంది. వేసవికాలం ఎండతీవ్రత రోజురోజుకు పెరుగుతుండడంతో ఇటు కరెంట్ సరఫరా లేకపోవడంతో చిన్న పిల్లలు,వృద్ధులు, రోగులు, స్థానికులు ఉక్కపోతతో అల్లాడి పోతున్నారు. మంగళవారం మజీద్ పల్లిలో విద్యుత్ శాఖ అధికారులు కరెంట్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని కాలనీవాసులకు ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడంతో సుమారు 9 గం.పాటు కరెంట్ సరఫరా నిలిచిపోయింది. దీంతో కాలనీ వాసులు విద్యుత్ శాఖ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం సమాచారం ఇవ్వకుండా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడడంతో సోషల్ మీడియా లో అసహనం వ్యక్తం చేశారు. ఈ విషయమై జనం సాక్షి ప్రతినిధి స్థానిక లైన్ ఇన్స్పెక్టర్ ను ఫోన్లో సంప్రదించగా పుష్కరాల పనుల వల్ల కరెంటు తీసివేయడం జరుగుతుందని, ఈ విషయమై సమాచారం ఇస్తే గ్రామస్తులంతా గ్రామమంతా కరెంటు ఉండదేమోనని ప్రశ్నిస్తున్నారని అందుకే సమాచారం ఇవ్వలేదని తెలిపారు.

## ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోండి


**పిఎసి చైర్మన్ అరికెపూడి పిలుపు**



**శేరిలింగంపల్లి, ఏప్రిల్ 22 (జనంసాక్షి) :** రాష్ట్రంలో నిజమైన ప్రజాస్వామ్య ప్రభుత్వం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నేతృత్వంలో కొనసాగుతుందని, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్న ప్రస్తుత పాలనలో ఓట్లేసి గెలిపించిన ప్రతి ఒక్కరూ ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను అందిపుచ్చుకోవాలని రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ పిలుపునిచ్చారు. ఈ మేరకు కొండాపూర్ డివిజన్ పరిధి శ్రీ రామ్ నగర్ కాలనీ ఏ-బ్లాక్ కు చెందిన తెలుగు పార్టీ లక్ష్మికి సిఎంఆర్ఎఫ్ నిధుల ద్వారా మంజూరైన లక్ష 75 వేల రూపాయల మంజూరి పత్రాలను మంగళవారం చైర్మన్ అరికెపూడి గాంధీ తన చేతుల మీదుగా అందజేశారు. ఈ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసమే పని చేస్తుందని, ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను తప్పకుండా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ప్రజల మేనిఫెస్టో ఉద్దేశించి అరికపూడి గుర్తు చేస్తూ ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతి హామీని తప్పకుండా నెరవేర్చుతామని, ఇందులో భాగంగానే ప్రాధాన్యత ఆక్రమంలో ఒక్కొక్క సంక్షేమ పథకాన్ని తూచా తప్పకుండా అమలు చేస్తున్నామన్నారు. అభాగ్యులైన నిరుపేదల వైద్య సమస్యలను తాము ప్రతిపాదించిన వెంటనే ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి అవసరమైన నిధులను మంజూరు చేయడం హర్షించదగ్గ విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బలరాం యాదవ్ కావూరి అనిల్, అష్రాఫ్ తదితరులు పాల్గొన్నారు.

## లోకల్ బాడీ ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం

**రిటర్నింగ్ అధికారి అనురాగ్ జయంతి**



**హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 22 (జనంసాక్షి) :** హైదరాబాద్ లోకల్ బాడీ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని రిటర్నింగ్ అధికారి అనురాగ్ జయంతి తెలిపారు. మంగళవారం హైదరాబాద్ లోకల్ బాడీ ఎన్నికల ఏర్పాట్లపై రిటర్నింగ్ అధికారి అనురాగ్ జయంతి ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొత్తం 112 మంది ఓటర్లు ఉన్నారని, రేపు 23న ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని, రెండు పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన సిబ్బందితో పాటు మరికొంత మంది సిబ్బందిని రిజర్వ్ లో పెట్టామని చెప్పారు. ఒక్కో పోలింగ్ కేంద్రంలో నలుగురు చొప్పున సిబ్బంది ఉంటారని, పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. సుమారు 200 నుండి 250 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాట్లు చేశామన్నారు. దాదాపు 500 మంది అధికారులు, సిబ్బంది ఎలక్షన్ డ్యూటీ లో పాల్గొంటున్నట్లు తెలిపారు. పోలింగ్, కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ ఇచ్చామని, పోలింగ్ కేంద్రాల్లో అన్ని మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛగా జరిగేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని వివరించారు. ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ రోజు ఎన్నికల విధులలో ఉన్న ఉద్యోగులకు మినహా జీహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో పనిచేసే మిగతా ఉద్యోగులకు 23న సెలవు దినంగా ప్రకటించినట్లు తెలిపారు. అట్టి ఉద్యోగులందరూ జూన్ నెల రెండో శనివారం 14-06-2025 కార్యాయ విధులకు హాజరు కావాల్సి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల అడిషనల్ కమిషనర్ అలివేలు మంగతాయారు, హైదరాబాద్ డిప్యూటీ కలెక్టర్ రవి, తదితరులు పాల్గొన్నారు.



## చీలిపోయిన వారు కలిసేదెప్పుడూ..?

**బీసీ కమిషన్ మాజీ చైర్మన్ బిఎస్ రాములు ఆవేదన**

**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనే ఏకైక నినాదంతో కలిసిన ప్రజలు రాష్ట్రం వచ్చాక వెనకటి లెక్క తిరిగి పోయారు. ఎవరి కుంపటి వారిదైంది. బీసీ ఉద్యమం ముందుకు వేస్తే ఇట్లనైనా అందరు కలుస్తారు పోతుంటే అవి పది సంఘాల ఉద్యమాలుగా చీలిపోయాయి. మహిళాలోకం కలిసి ఉద్యమిస్తారనుకుంటే అవీ అంతే. రచయితలు కళాకారులు జర్నలిస్టులు మేధావులు విద్యావంతులు కలిసి అందరిని ఒక్కటి చేస్తారనుకుంటే వీరే ముందుగా విడిపోయి ఇతరులకు మార్గం వేసినట్టుంది. పరస్పరం కలిసి పని చేసి బలం బలగం పెంచుకునే బదులు పరస్పరం కలహించుకుంటూ విమర్శించుకుంటున్నారు. అల్ప లక్ష్యాలు, కెరీరిజం, అసూయ, ఓర్వలేనితనం, అహం, సెల్ఫీల వలె సెల్ఫిష్‌నెస్ పెరుగుతున్నది. పరమత విద్వేషం, ప్రాంతీయ విద్వేషం, వర్ణ వివక్ష, కులవివక్ష, అచేతనలో స్థిరపడి మనిషిని మానవతను విధ్వంసం చేస్తున్నది. మతసామరస్యం తిరిగి నెలకొంటే తప్ప ఈ చీలికలు కలవవు. మోహన్ భగవత్ గారూ! కులాల మధ్య ఘర్షణ వివక్ష మత ద్వేషం అన్నిటికీ ఒకటే కుదురు. సమస్త ద్వేషాలను పరిష్కరించే బౌద్ధంను రామజన్మ భూమి వలె ఒక 50 ఏళ్లు ప్రచారం చేయాలని పిలుపు ఇవ్వండి. "మనుధర్మం వర్ణ కుల వివక్ష లేని"హిందుత్వం బౌద్ధం మధ్య సఖ్యతతో నిజమైన విశ్వగురు స్థానం లభిస్తుంది అని బీసీ కమిషన్ మాజీ చైర్మన్ బిఎస్ రాములు పేర్కొన్నారు.

## పేద ముస్లింల ప్రయోజనాల కోసమే వక్ఫ్ సంస్కరణలు

**మల్కాజ్గిరి ఎంపి ఈటల రాజేందర్ స్పష్టీకరణ**



**బోడుప్పల్-జనంసాక్షి :** పేద ముస్లిం ప్రజల ప్రయోజనాలకోసమే బీజేపీ ప్రభుత్వం వక సంస్కరణలకు శ్రీకారం చుట్టిందని మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు, మాజీ మంత్రి ఈటెల రాజేందర్ స్పష్టం చేశారు. ఈమేరకు బోడుప్పల్లో వక్ఫ్ బోర్డు సవరణ చట్టం పై అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపి ఈటెల రాజేందర్ మాట్లాడుతూ..వక్ఫ్ చట్టం సవరణ ఎవరికి వ్యతిరేకం కాదని, దీని వల్ల దేశంలో ఎన్నో పేద ముస్లిం కుటుంబాల ప్రజలు లబ్ధిపొందే అవకాశం ఉంటుందన్నారు. వక్ఫ్ బోర్డు చట్ట సవరణ ముస్లింలకు వ్యతిరేకం కాదని, సెలెక్ట్ కమిటిలో అన్ని రాజకీయపార్టీల ప్రతినిధులు సవరణ వల్ల ఉత్పన్నమైయ్యే పరిణామాలను చర్చించే నిర్ణయం తీసుకున్నారని పేర్కొన్నారు. అందులో కాంగ్రెస్ పార్టీ ఎంపిలు కూడా వక్ఫ్ సవరణ అంతర్గతంగా మద్దతు తెలిపారన్నారు. తెలంగాణ ప్రభుత్వం వక సంస్కరణలను వెంటనే అమలు చేయాలని ఎంపి రాజేందర్ సూచించారు. అయితే ఈ బిల్లుగురించి కొన్ని పార్టీలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని. దీనిపై బీజేపి పార్టీ శ్రే ణులు ప్రజలకు అవగాహన కల్పించాల్సి ఉందన్నారు. ఈ సదస్సుకు మేడ్చల్ జిల్లా బీజేపీ అధ్యక్షులు బుద్ధి శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు బుద్ధి శ్రీనివాస్, మాజీ జిల్లా అధ్యక్షులు విక్రమ్ రెడ్డి. ఏనుగు సుదర్శన్రెడ్డి, జిల్లా కన్వీనర్ కూరపాటి విజయ్కుమార్, కో కన్వీనర్ గోనె శ్రీనివాస్, శోభరెడ్డి, యువ మోర్చ రాష్ట్ర నాయకులు సామల పవన్ రెడ్డి, నాగారం మాజీ చైర్మన్ చంద్రారెడ్డి. బిక్కునాయక్,అచ్చినర్సింహా, ఈస్ట్ అధ్యక్షులు ఏర్పుల మహేష్, వెస్ట్ అధ్యక్షులు తలారి రవియాదవ్, సీనియర్ నాయకులు రాసాల నర్సింగరావుయాదవ్, ఏనుగుల లక్ష్మయ్య,జనిగె వెంకటేష్ యాదవ్, తుప్పత్ ఆనంద్, మహిళా నాయకురాల్లు సంధ్య రెడ్డి, పద్మా రెడ్డి. రాధికా- సంధ్యలతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు, వివిధ కాలనీ అధ్యక్షులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
23 ఏప్రిల్ 2025

# అమీన్‌పూర్‌లో నవోదయ స్కూల్

- యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కోసం స్థల పరిశీలన
- ఐదు ఎకరాల్లో మినీ స్టేడియం పనులు
- అమీన్పూర్ 993 సర్వే నంబర్‌లో విద్యాసంస్థల ఏర్పాటు
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



**సంగారెడ్డి అమీన్‌పూర్, ఏప్రిల్ 22 (జనం సాక్షి) :** నియోజకవర్గంలోని పేద, మధ్యతరగతి విద్యార్థులకు అత్యాధునిక వసతులతో కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలన్న లక్ష్యంతో నవోదయ విద్యాలయం మరియు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి.. ప్రభుత్వానికి నివేదిస్తున్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. అమీన్పూర్ మున్సిపల్ పరిధిలోని బీరంగూడ గోశాల సమీపంలో గల ప్రభుత్వ సర్వే నంబర్ 993లో విద్యాసంస్థల ఏర్పాటు కోసం స్థానిక అధికారులు, తాజా మాజీ ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే నవోదయ విద్యాలయాన్ని అమీన్పూర్ లో ఏర్పాటు చేసేందుకు కోసం ప్రభుత్వ స్థలాల వివరాలను పంపాలని ఇప్పటికే సంబంధించిన అధికారులు ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. దీంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కోసం సైతం స్థల పరిశీలన చేసినట్లు తెలిపారు. నవోదయ విద్యాలయం కోసం 20 ఎకరాలు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కోసం 20 ఎకరాలు, మినీ స్టేడియం కోసం 5 ఎకరాలు కేటాయించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపనున్నట్లు తెలిపారు. విద్యాసంస్థలు ఏర్పాటు అయితే.. నియోజకవర్గంలోని పేద మధ్యతరగతి ప్రజలకు కార్పొరేట్ విద్య ఉచితంగా అందుబాటులోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మినీ స్టేడియం పనులను సైతం అతి త్వరలో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహసిల్దార్ వెంకటస్వామి, మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, ఆర్ఐ రఘునాథ్ రెడ్డి, గోపాల్, ఉపేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## క్యాన్సర్ బాధితురాలికి జైపాల్ యాదవ్ ఆర్థిక చేయూత



- బాధిత కుటుంబాలకు పదివేల ఆర్థిక సాయం

**కల్వకుర్తి, ఏప్రిల్ 22 (జనం సాక్షి) :** కల్వకుర్తి మండలం తర్మికల్ గ్రామానికి చెందిన ధనమ్మ క్యాన్సర్‌తో బాధపడుతుంది. ఈ విషయం బి ఆర్ఎస్ నాయకుల ద్వారా తెలుసుకున్న మాజీ శాసనసభ్యులు జైపాల్ యాదవ్ కుటుంబ సభ్యులను పరామర్శించి తన వ్యక్తిగతంగా 5000 రూపాయలు ఆర్థిక సాయం అందించారు అదేవిధంగా ధైర్యంగా ఉండాలని ఈ సందర్భంగా తెలియజేశారు. అనంతరం అదే గ్రామానికి చెందిన వార్కలి సాయిబాబా ఇటీవల మరణించారు. వారి కుటుంబాన్ని పరామర్శించి 5వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు రామకృష్ణ శ్రీనివాస్, రుక్మదిన్, తాళ్ళ సురేష్ గౌడ్ ,చంద్రయ్య ,కృష్ణ పరశురాములు, దేవయ్య,నరసింహ, విష్ణు, భీమయ్య గౌడ్ వెంకటయ్య, శేఖర్ గౌడ్, మాణిక్యం, రవి, రత్నం తదితరులు పాల్గొన్నారు.

## తప్పుడు విమర్శలు చేసి చరిత్ర హీనులు కావొద్దు



**సంగారెడ్డి, ఏప్రిల్ 22 (జనంసాక్షి) :** తప్పుడు విమర్శలు చేసి చరిత్ర హీనులు కావద్దు అని తెలంగాణ రాష్ట్ర ఉద్యోగ జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి సున్నితంగా హెచ్చరించారు. జిపిఓల విధులు, బాధ్యతలు, భూ భారతి చట్టం అవగాహన కార్యక్రమానికి చైర్మన్ లచ్చిరెడ్డి గ్రామ పాలన అధికారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గరికె ఉపేంద్రరావు, ప్రధాన కార్యదర్శి వి.లక్ష్మీ నరసింహులు, టిజిటిఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ పాక ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ అవగాహన సదస్సుకు సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఎన్. సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ... భూ భారతి చట్టం ద్వారానే భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని అన్నారు. చట్టాలను అధ్యయనం చేసి భూ భారతి చట్టాన్ని తెలంగాణ ప్రభుత్వం రూపొందించిందని సూచించారు. జిపిఓల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గరికె ఉపేంద్ర రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.లక్ష్మీ నరసింహులు... మాట్లాడుతూ జిపిఓ లను కొందరు తప్పుదారి పట్టించేలా ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టులు పెడుతున్నారని మా దృష్టికి వచ్చిందని ఇది సరికాదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, శివరాం, మల్లేష్, శ్యామ్, అరుణ్, రామచంద్రయ్య, యాదగిరి, శేఖర్, బోళ్ల శ్రీను, ఆర్ వేణు, సీహెచ్ హరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## భూ భారతితో 30 రోజుల్లో భూ సమస్యల పరిష్కారం

- వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి



**రేవల్లి, ఏప్రిల్ 22 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతి చట్టంతో భూ సంభంధిత సమస్యలు 30 రోజుల్లో పరిష్కారం అవుతాయాని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. ప్రతి రైతు భూమికి భూదార్ కార్డులను ఇవ్వనున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్డులో భూమి కి సంభందించిన అన్ని వివరాలు నిక్షిప్తమై ఉంటాయన్నారు. గోపాల్ పేట, రేవల్లి, ఏదుల మండలాలలో భూ భారతి చట్టంపై నిర్వహించిన అవగాహనా కార్యక్రమానికి అయన హాజరై మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో భూ సమస్యలను పరిష్కరించకపోగా 18 లక్షల ఎకరాలకు సంబంధించిన భూ దస్త్రాలను మాయం చేసి కాజేశారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నేడు అలాంటి ఇబ్బంది ఏమీ లేదని ఎమ్మెల్యే పేర్కొన్నారు. వీఆర్వో వ్యవస్థ గ్రామాలలో భూ ఆక్రమణలకు పాల్పడేందుకు ఇబ్బందులు అవుతాయని గ్రహించిన గత పాలకులు విఆర్ఓ వ్యవస్థను రద్దు చేయడం జరిగిందన్నారు. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం మళ్ళీ వీఆర్వో వ్యవస్థను పునరుద్ధరించబోతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నిరుపేదలు సైతం ఎమ్మెల్యే, ఎంపీ, ముఖ్యమంత్రి మంత్రులు తినే భోజనాన్ని తినాలన్న ఉద్దేశంతో ప్రతి ఇంటికి సన్నబియ్యం పంపిణీ చేయాలన్న ఉద్దేశంతో నేడు సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం చేపట్టిందన్నారు. గ్రామస్థాయిలోని నిరుపేద విద్యార్థులకు సైతం ఉన్నత విద్యను అందించేందుకు ప్రతి మండల కేంద్రంలో ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషన్ హబ్బులను నిర్మిస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అన్నదాతలు పండించిన వరి పంటను చివరి గింజ వరకు కొనుగోలు చేసేందుకు ప్రతి గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని, దళారుల మాటలు నమ్మకుండా కొనుగోలు కేంద్రాలలోనే వారి ధాన్యాన్ని విక్రయించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, జాయింట్ కలెక్టర్ యాదయ్య, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, ఆయా మండలాల తాసిల్దారులు, గోపాల్పేట ఉమ్మడి మండలం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి సత్యసిల్లారెడ్డి రేవల్లి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పర్వతాలు, శివన్న సురేష్ గౌడ్, సురేందర్, సుఖేందర్ రెడ్డి, జానకి రాముడు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నూతన భూభారతి చట్టంతో గట్ల పంచాయతీకి చెక్

- భూభారతితో సమస్యల పరిష్కార మార్గాలు సులభం
- భూ భారతి చట్టం అవగాహన సదస్సులలో కలెక్టర్ క్రాంతి వల్లూరు



**సంగారెడ్డి ప్రతినిధి, ఏప్రిల్ 22 (జనం సాక్షి) :** రైతులకు భూమి గుండెకాయ లాంటిదని నూతన భూభారతి చట్టం ద్వారా రైతుల భూ సమస్యలు తొలగిపోతాయని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరి పేర్కొన్నారు. మంగళవారం కాంగ్టి, కల్హేర్ మండలలలో భూభారతి చట్టం అవగాహన సదస్సులలో నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, అదనపు కలెక్టర్ మాధురి లతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ భూభారతి చట్టంతో రైతులకు గట్ల వద్ద పంచాయతీ లు లేని జిల్లా గా తీర్చి దిద్దాలని సంబంధిత అధికారులకు సూచించారు. రైతులకు చేకూరే ప్రయోజనాల గురించి కలెక్టర్ ఒక్కో అంశం వారీగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. భూ సమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా ప్రభుత్వం రూపొందించిన భూ భారతి (ఆర్ ఓ ఆర్) చట్టం - 2025 జనవరిలో గెజిట్ రూపంలో వచ్చిందని, సమగ్ర అంశాలను పొందుపరుస్తూ ప్రభుత్వం ఏప్రిల్ 14న ఈ చట్టాన్ని ప్రవేశపెట్టిందని కలెక్టర్ వివరించారు. భూ సమస్యలు కలిగిన రైతులు ఏడాది కాలం లోపు భూభారతి పోర్టల్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. భూ భారతి చట్టం ప్రకారం భూ సంబంధిత సమస్యలను నిర్దిష్ట గడువులోపు పరిష్కరించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, ఆర్డీవో అశోక చక్రవర్తి, రెవెన్యూ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, రైతులు, రైతు సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రాజీవ్ యువవికాసం దరఖాస్తుల పరిశీలన పకడ్బందీగా చేయాలి

- జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్



**నారాయణపేట జిల్లా బ్యూరో, ఏప్రిల్ 22 (జనం సాక్షి) :** రాజీవ్ యువవికాసం పథకానికి సంబంధించిన దరఖాస్తుల పరిశీలనను పకడ్బందీగా నిర్వహించి అర్హులను ఎంపిక చేయాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు.మంగళ వారం కలెక్టరేట్ లోని వీసీ హాల్ లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వర్ తో కలిసి ఆదేశించారు.ఎంపీడీవోలు,బ్యాంకర్లతో కలెక్టర్ రాజీవ్ యువ వికాసం పథకం అమలు, అర్హుల ఎంపికపై సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండల స్థాయిలో దరఖాస్తులను ఎంపీడీవోలు,బ్యాంకు అధికారులు పరస్పర సమన్వయంతో పరిశీలించాలన్నారు. మొదటి ప్రాధాన్యతగా మహిళలు, వికలాంగులను, లబ్ధిదారులుగా ఎంపిక చేయాలని సూచించారు. లబ్ధిదారులకు రుణం మంజూరు చేసే ముందు ప్రత్యేకంగా బ్యాంకు ఖాతాలు తెరిపించాలన్నారు. ఒకే గ్రామంలో ఎక్కువమంది ఒకే రకమైన యూనిట్లు పెట్టే పరిస్థితి లేకుండా చూడాలన్నారు. దీనివల్ల వ్యాపారంలో పోటీ పెరిగి నష్టాలు వస్తాయన్నారు. సరైన లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలన్నారు.వయస్సు, కులం, ఆదాయం, ఇతర ధ్రువపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి అర్హులను ఎంపిక చేయాలని ఆమె సూచించారు. ఎంపికైన యూనిట్లకు సంబంధించిన గ్రౌండింగ్ పూర్తయిందో లేదో క్షేత్రస్థాయిలో పరిశీలించాలని, ఏవైనా సందేహాలుంటే వెంటనే పై అధికారులను సంప్రదించాలని సూచించారు.ఈ నెల 25 వరకు అర్హుల జాబితాను సిద్ధం చేసి ఉంచాలన్నారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈవో భాగ్యలక్ష్మి, డీఆర్డీవో మొగులప్ప, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అబ్దుల్ ఖలీల్, మైనార్టీ సంక్షేమ అధికారి ఎం.ఏ. రషీద్, ఇండస్ట్రీస్ జీఎం భరత్ రెడ్డి, లీడ్ బ్యాంకు మేనేజర్ విజయ్ కుమార్, అన్ని మండలాల ఎంపీడీవోలు, బ్యాంకర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

- చీఫ్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ లక్ష్మీపతి



**నారాయణపేట జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 22 (జనం సాక్షి) :** ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలనీ చీఫ్ డిఫెన్స్ కౌన్సిల్ లక్ష్మీపతి గౌడ్ అన్నారు. మంగళవారం జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి విన్ద్యా నాయక్ ఆదేశాల మేరకు చీఫ్ డిఫెన్స్ కౌన్సిల్ కే. లక్ష్మీపతి గౌడ్ అధ్యక్షతన ఔసులోనీపల్లి, పెద్దజత్రం గ్రామలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె. సురేష్ హాజరు కావడం జరిగినది. ఈ సందర్భంగా చీఫ్ డిఫెన్స్ కౌన్సిల్ కే. లక్ష్మీపతి గౌడ్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం మన పౌరులకు న్యాయ సేవాధికారి సంస్థ ద్వారా రెండు ఉచిత న్యాయ సేవలు అందించడం జరుగుతుందని అవి ఏమనగా ఉచితంగా న్యాయవాదిని నియమించుకునే ఏర్పాటు ఎటువంటి క్రిమినల్ కేసైనా ఎటువంటి ఫీజు 6 చెల్లించకుండా ఉచితంగా న్యాయవాదిని నియమించుకుని అట్టి కేసును వాదించుకునే అవకాశం ప్రస్తుతం మనకు అందుబాటులో ఉందని తెలియజేశారు దానితోపాటు అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శ్రీమతి నాగేశ్వరి మాట్లాడుతూ 15100 ఈ నంబరు జాతీయ న్యాయ సేవాధికార సంస్థ యొక్క టోల్ ఫ్రీ నెంబర్ దీనికి ఎప్పుడైనా గానీ ఫోన్ చేసి ఉచితంగా న్యాయ సహాయము గాని న్యాయ సలహాలు గానీ పొందవచ్చని తెలియజేశారు దానితోపాటు వికలాంగులకు ఉపాధి అవకాశాలకు కావలసిన సమాచారం కోసం కూడా జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించవచ్చని ఈ సందర్భంగా ఈ సేవలు వినియోగించుకోగలరని తెలియజేశారు ఈ సమావేశంలో ముఖ్యఅయ తిథిగా పాల్గొన్న కే. సురేష్ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మాట్లాడుతూ ప్రజలకు ఉన్న ప్రాథమిక హక్కులు ప్రాథమిక విధులు వాటి యొక్క ఆచరణ విధానాల గురించి తెలియజేసి వాటిని ఏరకంగా మనము వాడుకోవచ్చని విషయాల గురించి తెలియజేశారు ఈ సమావేశంలో జిల్లా వినియోగదారుల సంఘం ఉపాధ్యక్షులు బాలరాజ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తాము కొనే ప్రతి ఒక్క వస్తువుకు రసీదు తీసుకోవాలని ఒకవేళ తీసుకున్న వస్తువు సరిగ్గా పని చేయకపోతే వినియోగదారుల సంఘంలో కేసు వేసి నష్టపరిహారం పొందవచ్చని తెలియజేశారు ఇట్టి కార్యక్రమంలో చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ తిరుపతయ్య, శ్రవణ్ కుమార్ పాల్గొని బాల్య వివాహాల వల్ల కలిగే నష్టం గురించి వివరించారు.ఇట్టి కార్యక్రమం లో హాజమ్మ నారాయణ పాల్గొన్నారు.

## నీటి సమస్యను తీర్చిన అధికారులు

- ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన తండా ప్రజలు



**చిలప్‌చేడ్, ఏప్రిల్ 22 (జనంసాక్షి) :** మండలంలోని బంజారా నగర్ తాండ లో నీటి సమస్య ఉండడంతో సోమవారం నాడు నర్సాపూర్ శాసన సభ్యురాలు వాకిటి సునీత లక్ష్మారెడ్డి చిట్కూల్ గ్రామంలో కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తుండగా బంజారా నగర్ తాండ వాసులు మాకు నీటి సమస్య ఉన్నదని ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి దృష్టికి తీసుకుపోగా వెంటనే స్పందించి మిషన్ భగీరథ డిఈ ప్రవీణ్‌కు తండాలో నీటి సమస్య విషయాన్ని ఫోన్లో తెలుపగా వారు స్పందించి వెంటనే మంగళవారం నాడు ఏఈ అన్వేష్ రెడ్డి ఎంపీడీవో ఆనంద్ ఎంపీఓ వెళ్లి నీటి సమస్యను తెలుసుకొని మిషన్ భగీరథ వాటర్ ను బంజారా నగర్ తండా ట్యాంకు కు వాటర్ సప్లై చేయడం జరిగింది. తాండ ప్రజలు మేము తాగునీటి సమస్య ఉన్నదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోగా వారు వెంటనే స్పందించి మాకు త్వరగా త్రాగు నీటి ఇబందులను తీర్చినందుకు ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డికి అధికారులకు మా తాండ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని అన్నారు ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ డి ఈ ప్రవీణ్,ఏఈ అన్వేష్ రెడ్డి,ఎంపీడీవో ఆనంద్, మిషన్ భగీరథ ఇన్చార్జి సురేష్, ఎంపీఓ తిరుపతి, ఏపీవో శ్యామ్, కార్యదర్శి మోహన్, తాండ ప్రజలు ఉన్నారు.

## తప్పుడు హామీలతో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

- వరంగల్ సభకు భారీగా తరలిరావాలి
- ఎమ్మెల్సీ యాదవ రెడ్డి



**తూప్రాన్, ఏప్రిల్ 22 (జనం సాక్షి) :** తెలంగాణ ఉద్యమ నాయకుడు కెసిఆర్ పోరాడి సాధించిన తెలంగాణను 10 ఏళ్ల నుంచి అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లగా తప్పుడు హామీలతో ప్రజలకు మాయ మాటలు చెప్పి ప్రజల్లో మభ్యపెట్టి మోసం చేస్తున్న వారికి బుద్ధి చెప్పాలని గజ్వేల్ నియోజకవర్గం ఎమ్మెల్సీ యాదవ రెడ్డి గజల్ నియోజకవర్గ ఇన్చార్జి ప్రతాపరెడ్డి లు కోరారు మాజీ ఎంపీపీ. బి ఆర్ ఎస్ నాయకులు పురం నవనీత రవి ఆధ్వర్యంలో మనోహరాబాద్ మండల కేంద్రంలో జరిగిన టిఆర్ఎస్ పార్టీ శ్రేణుల సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. ఈనెల 27న పార్టీ 25 సంవత్సరాల రజితోత్సవ సభ ను విజయవంతం చేయాలని,మాజీ ఎఫ్డిసి చైర్మన్ గజ్వేల్ నియోజకవర్గం బిఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు వంటేరు ప్రతాప్ రెడ్డి కోరారు..సుఖ సంతోషాలతో ఉన్న తెలంగాణ ప్రజలను కరువులో మునిగేలా చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం కు రోజులు దగ్గర పడ్డాయాని అన్నారు.పదేళ్ల బిఆర్ఎస్ ప్రభుత్వం లో రాష్ట్ర ప్రజల విలువ పెరిగితే ప్రస్తుత పరిస్థితులు పూర్తి భిన్నంగా ఉన్నాయని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో జరిగిన అభివృద్ధి ఏడాదిన్నర సమయంలో కనుమరుగు అయిందని ఇది ప్రజలందరూ గమనిస్తున్నారని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. అనంతరం ఎమ్మెల్సీ యాదవ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో బీఆర్ఎస్ పార్టీ తరఫున కేసీఆర్ చేసిన సంక్షేమ పథకాలు ప్రజలు ఆకర్షించాయని నేడు కాంగ్రెస్ పార్టీకి భవిష్యత్తు లేకుండా పోతుందని తెలిపారు. వచ్చే స్థానిక సంస్థల్లో పార్టీ కోసం లేదా ప్రజల కోసం నిలబడే నాయకున్ని అధిష్టానం నిర్ణయిస్తుందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.. వరంగల్ లో జరిగే సభకు ఎండలు తీవ్రంగా ఉన్నందున అనారోగ్యంతో బాధపడుతున్న వారిని మహిళలను తీసుకురావద్దని సూచించారు. వరంగల్ సభకు నియోజకవర్గం నుండి 20 వేల మందిని తరలించడానికి బస్సు సౌకర్యం ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

### బీఆర్ఎస్ పార్టీలో చేరిన పలు పార్టీల కార్యకర్తలు

మనోహరాబాద్ మండల వ్యాప్తంగా వివిధ పార్టీలకు చెందిన పలువురు యువకులు 100 మంది సీనియర్ నాయకులు ఫోటోలు వెంకట్ గౌడ్ ఆధ్వర్యంలో యాదవ రెడ్డి ప్రతాపరెడ్డిలు పురం రవి లు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు శేఖర్ గౌడ్ పొట్టోల్ల వెంకట్ గౌడ్ ఉదయ్ రంజన్ గౌడ్ నరేష్ బిక్షపతి మనోహరాబాద్ మండలం నాయకుల ఆయా గ్రామాల సర్పంచులు ఉప సర్పంచ్లు పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వార్డు ఆఫీసర్లకు జిపిఓగా అవకాశం ఇవ్వాలి

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 22 (జనంసాక్షి)**

జిపిఓగా ఆప్షన్స్ పెట్టుకున్న పూర్వ వీఆర్ఏలకు ప్రస్తుతం మున్సిపల్ కార్యాలయలలో సర్దుబాటు కాబడిన వార్డ్ ఆఫీసర్లకు జిపిఓగా అవకాశం ఇవ్వాలని కోరుతూ రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వార్డు ఆఫీసర్ల రాష్ట్ర నాయకులు మల్లారం అర్జున్ మాట్లాడుతూ పూర్వ వీఆర్ఏలు 2023 సంవత్సరంలో జీవో నెంబర్ 81 మరియు 85 ద్వారా ప్రమోషన్ల పేరిట ఇతర విభాగాల్లో గత ప్రభుత్వం సర్దుబాటు చేసిందన్నారు. ప్రస్తుతం వార్డ్ ఆఫీసర్లుగా రాష్ట్రంలో అన్ని మునిసిపల్ కార్యాలయాల్లో 1266 మంది విధులు నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న రైతుల హక్కులను కాపాడడం కొరకు గ్రామీణ స్థాయిలో రెవెన్యూ వ్యవస్థను ఏర్పాటు కోసం గ్రామీణ పరిపాలన అధికారి పేరిట జిపిఓ ను ప్రారంభించడం, ఈ వ్యవస్థను తీసుకురావడం చారిత్రాత్మక విషయమన్నారు. ప్రభుత్వం జిపిఓల పేరిట



వీఆర్ఏలకు ఇచ్చిన అవకాశాన్ని మేము గౌరవంగా భావించి, ఆప్షన్స్ ను ఇప్పటికే ఇచ్చామని, గతంలో పూర్వ విఆర్ఏలకు మునిసిపల్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న వార్డు ఆఫీసర్లకు సొంత జిల్లాలో పోస్టింగ్లు ఇవ్వకపోవడంతో ఇతర జిల్లా నుండి వస్తు ఉద్యోగాలు చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగ నిర్వహణలో బాధ్యతగా తమ కుటుంబాలకు దూరంగా ఉండడంతో ఆర్థిక భారం పెరిగి, మానసిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇందులో మహిళా ఉద్యోగుల పరిస్థితి మరి ఆందోళనకరంగా ఉందన్నారు. ప్రభుత్వం జిపిఓగా ఇచ్చిన అవకాశాన్ని ఇప్పటికే అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆప్షన్స్ ఇచ్చామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ఉన్న కొద్దిమంది వీఆర్వోలతో మాకు ఎలాంటి సంబంధం లేదన్నారు. తక్షణం మమ్మల్ని జిపిఓగా నియమించినట్టయితే గ్రామీణ స్థాయిలో రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వానికి విధేయులుగా ఉంటూ ప్రభుత్వానికి మంచి పేరును తీసుకువస్తూ మా శక్తి వంచన లేకుండా పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. మమ్మల్ని మా సొంత జిల్లాలో జిపిఓ లాగా నియమించాలని రాష్ట్ర ప్రభుత్వానికి తెలియ చేసేందుకే కలెక్టర్ కార్యంలో వినతిపత్రం అందజేశామన్నారు. ఆయన వెంట వార్డ్ ఆఫీసర్ల సంఘం నాయకులు రహీం, రాకేష్, దేవేంద్ర, ఆంజనేయులు, మంజుల, అంజమ్మ, పరశురాం, సుధీర్ పాల్గొన్నారు.

# సింగరేణిలో కార్పొరేట్ విద్య విధానం ఏర్పాటు ఏఐటీయూసీ కృషి ఫలితమే

**ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్**

**భూపాలపల్లి, ఏప్రిల్ 22 (జనం సాక్షి) :**




సింగరేణి లో కార్మికుల పిల్లలకు కార్పొరేట్ సెంట్రల్ సిలబస్ విద్య విధానం అమలు ఏఐటీయూసీ గుర్తింపు సంఘం కృషి ఫలితమేనని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొరివి రాజ్ కుమార్ అన్నారు. మంగళవారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఏఐటీయూసీ కొమురయ్య భవన్లో బ్రాంచ్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్ పాల్గొని మాట్లాడారు. గుర్తింపు సంఘం కార్మికుల పిల్లల ఉన్నత చదువుల అమలు కోసం స్ట్రక్చర్ మీటింగ్లో చైర్మన్, డైరెక్టర్ ప తో చర్చించడం జరిగిందని, సింగరేణి పాఠశాలల్లో కార్మికుల పిల్లలు చదవడం లేదని, లక్షలు పెట్టి కార్పొరేట్ స్థాయి విద్యను అభ్యసిస్తున్నారని, కార్మికుల ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు సింగరేణి యాజమాన్యం తోగుర్తింపు సంఘంగా యాజమాన్యంతో చర్చించి సింగరేణి కార్మిక పిల్లలకు సెంట్రల్ సెలబస్ ఏర్పాటు చేయడం జరిగిందని, సిబిఎస్ఈ సిలబస్ కార్మికుల పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మొదటగా ఆర్జి 1, 2, 3లో ఈ సిలబస్ ఒకటి నుండి 8 తరగతుల వరకు యాజమాన్యం అవకాశం కల్పించిందని ఆ తరువాత 9, 10 తరగతి లకు సెంట్రల్ విద్య ప్రారంభమవుతుందని తెలిపారు. శ్రీరాంపూర్, భూపాలపల్లి, మణుగూరు కొత్తగూడెం, సీబీఎస్ఈ సిలబస్ కోసం కొత్త స్కూళ్లను ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్ని ఏరియాలలో కార్మికుల పిల్లల చదువుల కోసం సెంట్రల్ సిలబస్ పాఠశాలలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కార్మికుల పిల్లల మెరిట్ స్కాలర్షిప్ అమలు జరుగుతుందని అన్నారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ మాతంగి రామచందర్, అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ గురిజేపల్లి సుధాకర్ రెడ్డి, కాంట్రాక్ట్ కార్మికుల ఇన్చార్జ్ నూకల చంద్రమౌళి, ఏఐటీయూసీ నాయకులు సప్ప కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# భూ భారతి కొత్త చట్టంతో భూ సమస్యలు శాశ్వత పరిష్కారం

**రుద్రంగి ఏప్రిల్ 22 (జనం సాక్షి)**

: రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి రైతు వేదికలో భూ భారతి కొత్త ఆర్ఓఆర్ చట్టం పై ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తో కలిసి ప్రభుత్వ విప్ వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...భూ భారతి కొత్త ఆర్ఓఆర్ చట్టంతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని అన్నారు. భూ సమస్యలున్న రైతులు నేరుగా అధికారుల వద్దకు వచ్చి తమ సమస్యను పరిష్కరించుకోవాలని, అధికారులు ఎప్పుడూ అందుబాటులో ఉంటారన్నారు. ప్రభుత్వ భూమి పట్టా కలిగి ఉన్న రైతుల వద్దనుండి గుంట స్థలం కూడా తీసుకోమన్నారు. ధరణి చట్టం రావడం తో రైతులు, ప్రజలు ఇబ్బంది పడ్డారని గుర్తు చేశారు. గత పదేండ్లు అసైన్డ్ కమిటీ లేకపోవడంతో ఇంకా చాలా కష్టాలు పడ్డారని వివరించారు. ధరణి ఇబ్బందులు దూరం చేయాలనే ఉద్దేశంతో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇతర మంత్రులు, నిపుణులు, అధికారులు భూ భారతి చట్టాన్ని రూపొందించారని తెలిపారు. భూముల విషయంలో రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ ఇబ్బంది పడవద్దని సీఎం



రేవంత్ రెడ్డి ఆశయమని స్పష్టం చేశారు. అతి తక్కువ కాలంలోనే భూ భారతి చట్టాన్ని అమలు చేసేందుకు రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు మండలాల్లో పైలెట్ ప్రాజెక్ట్ కింద అమలు చేస్తున్నారని తెలిపారు. వీటిలో ఏమైనా ఇబ్బందులు, సమస్యలు ఎదురైతే వాటిని పూర్తి స్థాయిలో పరిష్కరించి త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయనున్నామని వెల్లడించారు. రైతును రాజును చేయాలనేది ప్రభుత్వ ఉద్దేశమని, ఇందులో భాగంగానే రుణ మాఫీ చేసిందని తెలిపారు. దాదాపు రూ. 20 వేల కోట్ల రుణ మాఫీ చేసిందని వెల్లడించారు. సన్న రకం ధాన్యం పండించే రైతులకు క్వింటాల్కు అదనంగా రూ ఐదు వందలు ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు. అనంతరం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ.... జిల్లాలోని అర్హులైన వారందరీ భూ సమస్యలు భూ భారతి చట్టంలో భాగంగా పరిష్కరిస్తామని, హక్కులు పంపిణీ చేస్తామని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. భూ భారతి చట్టంపై రైతులు, ప్రజలకు ప్రెజెంటేషన్ ద్వారా క్లుప్తంగా వివరించారు. అలాగే ధరణి, భూ భారతి కి మధ్య వ్యత్యాసాలు, దరఖాస్తు దారులకు ఇబ్బందులు లేకుండా భూ భారతిలో పొందు పరచిన అంశాలపై అవగాహన కల్పించారు. భూ సమస్యలకు భూ భారతి ద్వారా శాశ్వత పరిష్కారం దొరుకుతుందని తెలిపారు. మనుషులకు ఆధార్ నెంబర్ మాదిరిగా భూములకు భూధార్ నెంబర్ ఇస్తారని వెల్లడించారు. సదస్సు అనంతరం స్థానిక రైతులు, ప్రజల సమస్యలు విని, దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రుద్రంగి వ్యవసాయ కమిటీ చైర్మన్ చేలుకల తిరుపతి, రైతులు, అధికారులు పాల్గొన్నారు.

# వడ్ల రవాణాలో జాప్యం వద్దని రైతుల ధర్నా

**గంభీరావుపేట, ఏప్రిల్ 22 (జనంసాక్షి)**

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలోని నాయకమ్మ వడ్ల కొనుగోలు సెంటర్లో వారం రోజుల నుండి, వడ్లు కాంటాయి, బస్తాలు అక్కడే ఉండడం వల్ల రైతులు ఇబ్బంది పడుతున్నారంటూ ధర్నాకు దిగారు. సిద్దిపేట కామారెడ్డి ప్రధాన రహదారి అయినటువంటి రోడ్డుపైన వడ్ల బస్తాలు వేసుకొని రైతులు ఆందోళన చేపట్టారు. ఆరుగాలం పండించిన పంట కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చిన వారం రోజులు గడుస్తున్న, బస్తాలు మాత్రం అక్కడే ఉన్నాయని, దానికి మీరే బాధ్యులు అని అధికారులు చెప్పారని, ఒకవేళ వర్షం వస్తే పరిస్థితి ఎలా ఉంటుందని ఎవరు నష్టపోతారని ప్రశ్నించారు. ఇక్కడి నుండి త్వరగా రైస్ మిల్లర్లకు



పంపాలని కోరారు. స్థానిక ఎస్సై ప్రేమానందం చేరుకొని అధికారులతో మాట్లాడి రైతులకు ఇబ్బంది కలగకుండా చూస్తానని చెప్పడంతో ధర్నా విరమింప చేశారు. ఇందులో రైతులు గంట శీను రమేష్, రాజు, చిలక స్వామి, శంకరయ్య, చిలక అంజయ్య, జిల్లాల రాజయ్య తదితర రైతులు పాల్గొన్నారు.

# మత్తు పదార్థాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలి

**బోధన్, ఏప్రిల్ 22 ( జనంసాక్షి )**

: నిజామాబాద్ జిల్లాలో యువకులు మత్తు పదార్థాల వినియోగం జరుపుతున్నారనే ఆరోపణలు జోరుగా వినిపిస్తున్న దృష్ట్యా ఎక్సైజ్ అధికారులు మత్తు పదార్థాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. మంగళవారం నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలో నూతన ఎక్సైజ్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో కలిసి ప్రారంభించారు. అనంతరం నిజామాబాద్ కామారెడ్డి ఎక్సైజ్ అధికారులతో ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మత్తు పదార్థాల విషయంలో ఎక్సైజ్ అధికారులు





ఎలాంటి రాజీ పడకుండా దాడులు నిర్వహించాలని ఇందుకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతాలలో అక్రమ మద్యాన్ని అరికట్టడంతో పాటు యువకులు మత్తుకు బానిస కాకుండా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండటంతో పాటు తమ భవిష్యత్తును బంగారు బాట వేయాలంటే మత్తు పదార్థాలకు శాశ్వతంగా దూరంగా ఉండాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో బోధన్ ఎక్సైజ్ సీఐ భాస్కర్ రావు, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహిర్ బిన్ హాందాన్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, డిసిసి అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి, టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్,
కాంగ్రెస్ నాయకులు నాగేశ్వరరావు, నరేందర్ రెడ్డి, అల్లే రమేష్, మోబిన్, బిల్ల రామ్మోహన్, మహిపాల్ రెడ్డి, ఉమ్మడి జిల్లాల ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన సుడా చైర్మన్

**కరీంనగర్ బ్యూరో, ఏప్రిల్ 22 (జనంసాక్షి) :**

44వ డివిజన్ శర్మనగర్, సాహేత్ నగర్ లో 20 లక్షలతో మురుగు కాల్వ , సిసి రోడ్డు నిర్మాణానికి సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. సుడా నిధులతో నిర్మించే ఈ పనులను నెల రోజుల్లోనే పూర్తి చేస్తామని నరేందర్ రెడ్డి తెలిపారు. వర్షాకాలం ప్రారంభం అయ్యే నాటికి సుడా పరిధిలో ఉన్న అన్ని ప్రధాన పనులన్నిటినీ పూర్తి చేసి



ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక మాజీ కార్పొరేటర్ మెండి శ్రీలత చంద్ర శేఖర్, మిరాజ్, మాసుం ఖాన్, డి ఈ రాజేంద్ర ప్రసాద్, ఏఈ సతీష్, ముల్కల కవిత బషీర్ భారీ జ్యోతిరెడ్డి కీర్తి కుమార్ తదితరులు పాల్గొన్నారు.




# నాయిని కన్నయ్య మృతి కారకులను శిక్షించాలి

**తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో నిరసన**

**చెన్నూర్, ఏప్రిల్ 22 (జనంసాక్షి)**

: తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో నాయిని కన్నయ్య మృతికి కారణమైన వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి శిక్షించాలని భీమారం మండల కేంద్రంలో నిరసన చేయడం జరిగింది. తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘ జిల్లా కార్యదర్శి ఎర్నా పున్నం మాట్లాడుతూ వేమనపల్లి మండలంలోని మంగేనపల్లి గ్రామంలో ఆదివాసి నాయిని కన్నయ్య అదే గ్రామానికి చెందిన అగ్రవర్ణ కులానికి చెందిన వారింట్లో పాలేరుగా పనిచేస్తున్న సమయంలో వారి పొలానికి మందు కొట్టడానికి ఉపయోగించే మందు డబ్బా పనిచేయకుండా చేశావని నువ్వే మంచిగా చేయించాలని కన్నయ్యపై ఒత్తిడి చేసి చెడుగా అతనిపై దుర్భాషలాడడం కులం పేరుతో ఇష్టం వచ్చినట్లు బూతులు తిడుతూ బెదిరింపులకు గురిచేయగా వేధింపులు తట్టుకోలేక నాయిని కన్నయ్య ఎనగంటి చిన్న అన్న ఇంట్లో మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతనికి ఉన్న ఒకటే ఎకరం భూమి కూడా ఎనగంటి చిల్లర రెడ్డి కొడుకు ఎనగంటి హరీష్ రెడ్డి అక్రమంగా పట్టా చేసుకున్నాడు. ఇద్దరు అగ్రవర్ణ కులాలకు చెందిన వారి వల్ల విరక్తి చెంది ఆదివాసి అయిన పేద రైతు కన్నయ్య మృతికి కారణమైన వీరిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి శిక్షించాలని తన భూమిని తనకు చట్టపరమైన చర్యలు లావాను పట్టని వారికి చేయించి ఇచ్చిన ఎమ్మార్వో పై చర్యలు తీసుకోవాలని కనకయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు. దీనిపై ఐటిడిఏ అధికారులు స్థానిక ఎమ్మెల్యే జిల్లా కలెక్టర్ కుటుంబాన్ని సందర్శించాలని లేకుంటే కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం జిల్లా నాయకులు సీడం సమ్మక్క జిల్లా కార్యదర్శి సామల ఉమారాణి ,నాయక పోడు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తైనేని రవి, లక్ష్మణ్, రవి ,సరిత ,పిడుగు సమ్మక్క ,పోశం, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

# జనంసాక్షి' ఎఫెక్ట్.. వైద్యుడికి మెమో జారీ

**నిర్లక్ష్యంపై విచారణ చేపట్టిన జిల్లా ఉప వైద్యాధికారి**

**మంగపేట ఏప్రిల్ 21(జనంసాక్షి) :**

మండలంలోని బ్రాహ్మణపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహించవలసిన వైద్యుడు సమయాపాలన పాటించకుండా ఇష్టానుసారంగా విధులకు హాజరుకాకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే వార్తకు స్పందించిన జిల్లా



వైద్యాధికారి డాక్టర్ గోపాల్ రావు వెంటనే నిర్లక్ష్యంగా వ్యవహరించిన వైద్యుడికి మెమో జారీ చేసినట్లు తెలిపారు. అనంతరం ఈ విషయంపై పూర్తి విచారణను చేపట్టాలని జిల్లా ఉపవైద్యాధికారిని ఆదేశించినట్లు సమాచారం. ఈ విషయంపై విచారణ ఎటువంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి. ఇప్పుకైన ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చిన రోగులు స్టాఫ్ నర్స్, వైద్య సిబ్బందితో మాత్రమే వైద్య సేవలుజరుగుతాయో లేక వైద్యుడు సమక్షంలో వైద్య సేవలు కొనసాగుతాయో ఇకమీదట చూడాలని స్థానికులు చర్చించుకుంటున్నారు.

## ఇంటర్ ఫలితాలలో షాహిన్ కళాశాల ప్రభంజనం



**కరీంనగర్ బ్యూరో, ఏప్రిల్ 22 (జనంసాక్షి)**

మంగళవారం రోజు వెలువడిన ఇంటర్మీడియట్ ఫలితాలలో స్థానిక షాహిన్ జూనియర్ కళాశాల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులు ఎంపీసీ విభాగంలో 470 మార్కులకి గాను 468 మార్కులతో సనామాహీన్ బైపిసి విభాగంలో 440 మార్కులకి గాను 437 మార్కులతో ఇక్రా ఫాతిమా లు
రాష్ట్ర స్థాయి ర్యాంకులను కై వసం చేసుకొని షాహిన్ జూనియర్ కళాశాల విజయ పతాకాన్ని రెపరెపలాడించారు. విద్యార్థులను కళాశాల మేనేజింగ్ డైరెక్టర్స్ సయ్యద్ ఏజాజ్ అహ్మద్ , షోయేబ్ అహ్మద్ ఖాన్, అధ్యాపకులు అభినందనలు తెలియజేశారు.

# కాంగ్రెస్‌ను గెలిపిస్తే రైతన్నల బతుకులు ఆగం

**మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి కాంగ్రెస్**

**మాజీ హెూంమంత్రి మహమూద్ అలీ...**

**ఎల్కతుర్తి(భీమదేవరపల్లి)ఏప్రిల్ :22(జనం సాక్షి)**




ఎల్కతుర్తి మండల కేంద్రంలోని చింతలపల్లి వద్ద ఈనెల 27న జరగబోయే భారీ బహిరంగ సభ పనులను పరిశీలించిన. అనంతరం మంగళవారం మీడియా సమావేశంలో మాజీ హెూం మంత్రి మహమ్మద్ అలీ మాట్లాడుతూ...మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఉన్న పదకాలకు పంగనామం పెట్టి కొత్త హామీలకు ఎగనామం పెట్టి ప్రజా పాలన పేరుతో మభ్యపెడుతూ రాష్ట్రాన్ని ఆగం చేస్తుందన్నారుఅని అన్నారు. అనంతరం మాజీ మంత్రివర్యులు తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ...సభ కోసం అన్ని రకాల వసతులు ఏర్పాటు చేస్తున్నాం గ్రేటర్ హైదరాబాద్ నుండి 50 వేల మంది ప్రజలతో సభ ప్రాంగణానికి ఈనెల 27న సాయంత్రం మూడు గంటలకు చేరుకుంటామన్నారు. కేసీఆర్ ఒక్కరుగా ఉద్యమ నాయకుడిగా ముందుండి సబ్బండ వర్గాల ప్రజలతో మమేకమై ఉద్యమాన్ని భుజాన ఎత్తుకొని తెలంగాణ రాష్ట్రం కోసం ప్రాణాలు సైతం లెక్క చేయకుండా తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారన్నారు. అనేకమంది తెలంగాణ కోసం అమరులయ్యారు అని అన్నారు, కేసీఆర్ 10 సంవత్సరాలలో తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపి దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దారని అన్నారు. అనంతరం ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడుతూ...కాంగ్రెస్ ను గెలిపిస్తే అభివృద్ధి ఆగిపోయింది. రైతుబంధు రైతు బీమా కల్యాణ లక్ష్మి లాంటి పథకాలు మరుగున పడిపోయాయి ఏది సంపూర్ణంగా అమలు చేయలేకపోతున్నారని ధ్వజమెత్తారు. మళ్లీ రాబోయేది బిఆర్ఎస్ పార్టీ అని అన్నారు. అనంతరం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ....కాంగ్రెస్ ప్రభుత్వం పైన వ్యతిరేకంగా ఉన్న ప్రజలు సభకు భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేసేందుకు సిద్ధంగ ఉన్నారు. కాంగ్రెస్ హామీలు ఇచ్చుడు వరకే కానీ నిలబెట్టుకోవడంలో విఫలమైందని అన్నారు. సభా పనులు వేగంగా జరుగుతున్నాయి సభ కోసం వచ్చే కార్యకర్తలకు అన్ని రకాల సదుపాయాలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ పోస్టర్ ఆవిష్కరణ చేశార. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు పిట్టల మహేందర్, సింగిల్ విండో చైర్మన్ శ్రీపతి రవీందర్ గౌడ్, వైస్ చైర్మన్ మునిగడప శేషగిరి, మండల సీనియర్ నాయకులు తంగేడ మహేందర్, ఎల్తూరి స్వామి, తంగేడ నగేష్, పోరెడ్డి రవీందర్ రెడ్డి, కడారి రాజు, గోల్లే మహేందర్, గుండేటి సతీష్, నేత కొమ్మిడి మహిపాల్ రెడ్డి, గోడిశాల వినయ్ గౌడ్, జూపాక జడ్సన్, సాతూరి శంకర్, మదార్, గోడిశాల విక్రమ్ గౌడ్ పెండ్యాల సుదర్శన్, దుగ్యాని సమ్మయ్య, సాతూరి చంద్రమౌళి, వేముల శ్రీనివాస్, కోరే రాజ్ కుమార్, దేవేందర్, రావు, బాబురావు, డుకిరే రాజేశ్వర్ రావు, శివాజీ, సతీష్, హింగే రాజేశ్వరరావు హింగే భాస్కర్, అంబాల రాజు, కుమార్, శ్రీకాంత్ యాదవ్, చిట్టి గౌడ్, ఉట్కూరి కార్తీక్, భగవాన్ గౌడ్, నవీన్, రావ్, వంగ సతీష్, కిరణ్ గౌడ్, కొంగ ప్రవీణ్, డెంగు రమేష్, బొంకురి కార్తీక్, నవీన్, సందెల నరేష్, అనిల్, మురళి తదితరులు పాల్గొన్నారు.

# భూ భారతితో ప్రతి రైతుకు న్యాయం

● జిల్లా కలెక్టర్ హనుమంతరావు

**చౌటుప్పల్, ఏప్రిల్ 22 (జనం సాక్షి) :** భూభారతి చట్టం ద్వారా సాగులో ఉన్న ప్రతి రైతుకు న్యాయం జరుగుతుందని జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో మంగళవారం భూభారతి చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హనుమంతరావు, తెలంగాణ శాసనమండలి సభ్యులు నెల్లికంటి సత్యంలు హాజరై మాట్లాడారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని రకాల భూ సమస్యలు భూభారతి ద్వారా పరిష్కారం అవుతాయని అన్నారు. మండలాల వారీగా అవగాహన సదస్సులు నిర్వహించి రైతులకు అవగాహన కల్పించాలన్నారు. మే ఒకటి నుంచి నియోజకవర్గానికి ఒక గ్రామానికి వచ్చి సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు తీసుకుంటామని, ఒక్క రూపాయి ఖర్చు లేకుండా సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. రాష్ట్రంలో నాలుగు మండలాల్లో ప్రయోగాత్మకంగా పైలెట్ ప్రాజెక్టు కింద చేస్తున్నారని చట్టంలో మార్పులు ఏమైనా ఉంటే కచ్చితంగా చేస్తామని చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. సామాన్య రైతుకు కూడా చట్టం అర్థమయ్యే విధంగా ఉండాలనే ఉద్దేశ్యంతో భూభారతి ప్రవేశపెట్టారన్నారు. గతంలో ధరణిలో ఎక్కడ కూడా అప్పిలు వ్యవస్థ లేదన్నారు. ప్రతి సమస్యకు రెండిరచల అప్పీలు వ్యవస్థ ఉందని, తహసిల్దార్ దగ్గర తప్పు జరిగితే ఆర్డీవో ఆఫీస్ చేసుకోవచ్చు, ఆర్డిఓ దగ్గర తప్పు జరిగితే జిల్లా కలెక్టర్‌కు అప్పిలు చేసుకునే విధంగా భూభారతిని రూపొందించారన్నారు. రైతుల



సమస్యలను పరిష్కరించే విధంగా భూభారతి చట్టం పనిచేయాలని శాసనమండలి సభ్యులు నెల్లికంటి సత్యం సూచించారు. తెలంగాణ సాయుధ పోరాటం నుండి భూమికోసం తెలంగాణలో ఎన్నో ఉద్యమాలు నిర్వహించారని కానీ నేటికీ భూ సమస్యలు తీరలేదని అన్నారు. ధరణి చట్టంలో అనుభవదారుకాలం తీసివేయడంతో గతంలో అమ్ముకున్నా రైతుల పేరుపై తిరిగి భూమి రావడంతో వారు ఇతరులకు అమ్ముకొని గ్రామాలలో భూ సమస్యలను సృష్టించారని అన్నారు. భూభారతి చట్టంలో తిరిగి అనుభవదారు కాలాన్ని ప్రవేశపెట్టడం శుభపరిణామం అన్నారు. గతంలో ధరణిలో ఒక సర్వే నెంబర్‌లోని కొంత భూమిలో సమస్యలు ఉంటే ఆ సర్వే నెంబర్‌లోని పూర్తి విస్తీర్ణాన్ని బ్లాక్ చేయడం జరిగిందని, దీంతో సామాన్య రైతులు తమ అవసరాలకు భూమిని అమ్ముకోకుండా ఉండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చిందని అన్నారు. ఇలాంటి సమస్యలు భూభారతిలో పునరావృత్తం కాకుండా అధికారులు పనిచేయాలని సూచించారు. భూభారతి చట్టం అమలులో అధికారుల పాత్ర ముఖ్యమైనదని అందుకు అనుగుణంగా అధికారులు అంతా పనిచేయాలని సూచించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ధరణిని తీసివేస్తామని చెప్పి ఇచ్చిన హామీ ప్రకారం భూభారతి చట్టాన్ని తీసుకువచ్చారని అన్నారు. చౌటుప్పల్, సంస్థాన్ నారాయణపురం ప్రాంతంలోని గిరిజనుల పోడు భూముల సమస్యలను కూడా భూభారతి చట్టంతో పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అప్పీల్ వ్యవస్థ లేకుండా ధరణి నిరంకుశ చట్టంగా మార్చారని భూభారతిలో అప్పీల్ వ్యవస్థ రావడం రైతులు సంతోషించదగ్గ విషయం అన్నారు. రాష్ట్రంలో సర్వేయర్ల కొరత తీవ్రంగా ఉందని వెంటనే సర్వేయర్లను నియమించి రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ వీరారెడ్డి, ఆర్డిఓ శేఖర్ రెడ్డి ,చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, ఎమ్మార్వో హరికృష్ణ, సింగిల్ విండో చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పబ్బు రాజు, వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, మాజీ జెడ్పిటిసి చిలుకూరి ప్రభాకర్ రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ వెన్ రెడ్డి రాజు, మున్సిపల్ కమిషనర్ కోమటిరెడ్డి నరసింహారెడ్డి, ఆర్ఐ బాణాల రామ్ రెడ్డి, వ్యవసాయ అధికారి ముత్యాల నాగరాజు, సిపిఐ నాయకులు పల్లె శేఖర్ రెడ్డి, పగిళ్ల మోహన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు బోయ దేవేందర్, సుర్వి నరసింహ, మాజీ కౌన్సిలర్లు ప్రజాప్రతినిధులు ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పాడి పశువుల యూనిట్ల గ్రౌండింగ్‌కు చర్యలు

● సదరం క్యాంపుల నిర్వహణ చేపట్టాలి
● వితంతు పెన్షన్లపై చర్యలు వెంటనే చేపట్టాలి
● జిల్లా కలెక్టర్ ముజ్మిల్లా ఖాన్

**ఖమ్మం, ఏప్రిల్ 22 (జనంసాక్షి) :** పాడి పశువుల యూనిట్ల గ్రౌండింగ్‌కు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో ఇందిర మహిళా డెయిరీ, సదరం క్యాంపుల నిర్వహణ, వితంతు పెన్షనులపై జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ తో కలిసి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరా మహిళా డైరీ స్థాపన, పాడి పశువుల యూనిట్లకు లబ్ధిదారుల ఎంపిక పూర్తి అయినందున, పాడి పశువుల యూనిట్ల గ్రౌండింగ్ కు అధికారులు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పాల దిగుబడి ఎక్కువగా ఇచ్చే గేదెలను ఎంపికచేయాలన్నారు. యూనిట్లను అధికారులు తనిఖీలు చేస్తూండాలన్నారు. వెటర్నరీ డాక్టర్ సేవలు ఇందిరమ్మ డెయిరీ కి అందించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. పశుగ్రాసంకు చర్యలు చేపట్టాలన్నారు. యూనిట్లు ఒక్కటి డైవర్ట్ కాకుండా పటిష్ఠ తీసుకోవాలన్నారు. మండల కేంద్రాలలో



బి.ఎం.యూ.ల ఏర్పాటుకు సంబంధించి ప్రక్రియ పూర్తి చేయాలని అన్నారు. కంటెయినర్ స్థలంలో కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులు చేపట్టాలన్నారు. దివ్యాంగుల ధ్రువీకరణ నిమిత్తం చేపట్టే సదరం క్యాంపులు రెగ్యులర్‌గా చేపట్టాలన్నారు. సదరం క్యాంపుల వద్ద సౌకర్యాల కల్పన చేయాలని కలెక్టర్ తెలిపారు. వితంతు పెన్షన్ల విషయమై దరఖాస్తు అందగానే చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో జెడ్పి సిఇఓ దీక్షా రైనా, డిఆర్డీవో సన్యాసయ్య, ట్రైబల్ వెల్ఫేర్ ఉప సంచాలకులు ఎన్. విజయలక్ష్మి, జిల్లా బీసీ సంక్షేమ అధికారిణి జి. జ్యోతి, కల్లూరు ఆర్డీవో రాజేందర్, ఎల్డిఎం శ్రీనివాస రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారిణి ఆశాలత, ఇంచార్జ్ ఎస్సి కార్పొరేషన్ ఇడి నవీన్ బాబు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సన్నబియ్యం పేదలకు వరం

● ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి , ఎమ్మెల్యే వేముల వీరేశం

**రామన్నపేట, ఏప్రిల్ 22 (జనంసాక్షి) :** కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం చేపట్టిన సన్న బియ్యం పంపిణీ పేదలకు వరమని భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని నిరుపేద కుటుంబానికి చెందిన కళ్లెం భిక్షమమ్మ కుటుంబ సభ్యులతో కలిసి సన్నబియ్యం తో వండిన భోజనాన్ని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే వేముల వీరేశం, కలెక్టర్ హనుమంత్ రావు, ఇతర అధికారులు తిని సంతృప్తి చెందారు. భోజనం అందించిన బిక్షమమ్మ కుటుంబ సభ్యులను ఎంపీ, ఎమ్మెల్యే శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ పేదవాళ్లు కూడా సంపన్నులతో సమానంగా సన్న బియ్యం తినే విధంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిందని, తెల్ల రేషన్ కార్డు కలిగిన లబ్ధిదారులు ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సన్న బియ్యం తో నేడు పేదవాళ్ల ముఖంలో ఆనందం చూస్తున్నామని అన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ



కుటుంబానికి మోడల్ హౌస్ ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాస పథకాన్ని మంజూరు చేస్తామని ఎమ్మెల్యే వేముల వీరేశం తెలిపారు. ఈ కుటుంబానికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. తమ ఇంటికి వచ్చి అన్నం తిని మా పరిస్థితి ని చూసి ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసం మంజూరు చేస్తా అని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే కు ప్రతేక్య ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిరిగిరెడ్డి మల్లారెడ్డి పట్టణ అధ్యక్షులు జమీరుద్దీన్, పున్న జగన్మోహన్, జినుకల ప్రభాకర్, గోదాసు శిరీష పృధ్విరాజ్, వనం చంద్రశేఖర్, ఎండీ రేహాన్, నాసర్, రామిని రమేశ్, అక్రం, కోట సుధాకర్, గురుకు శివ, లవణం సాయి పాల్గొన్నారు.

## భూ భారతితో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

● ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
● ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో సహాయక కేంద్రాలు
● జిల్లా కలెక్టర్

**ఖమ్మం, ఏప్రిల్ 22 (జనంసాక్షి) :** ప్రభుత్వం అమలు చేయనున్న భూ భారతి – కొత్త ఆర్ఓఆర్ చట్టంతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. మంగళవారం రఘునాధపాలెం గ్రామ రైతువేదికలో రఘునాధపాలెం మండలానికి సంబంధించి భూ భారతి –కొత్త ఆర్ఓఆర్ చట్టంపై ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలకు భూ భారతి చట్టంతో పరిష్కారం అవుతాయన్నారు. భూమి ఎక్కడ, కొలతలు అధునాతన జిపిఎస్ ప్రక్రియ తో మరొకసారి సర్వే చేపట్టి, కొలతలు, హద్దులు శాశ్వతంగా నిర్ణయించడం, ఆ తర్వాత యాజమాన్యం నిర్ధారించడం చేపట్టడం జరుగుతుందన్నారు. కొనుగోలు రిజిస్ట్రేషన్ ద్వారా అయితే, తహసీల్దార్ కార్యాలయంలోనే ప్రక్రియ పూర్తవుతుందని, రిజిస్ట్రేషన్ కానప్పుడు విచారణ చేపట్టడం జరుగుతుందని తెలిపారు. సాదా బైనామా దరఖాస్తులకు విచారణ చేసి, సంబంధిత అందరికి నోటీసులు జారీచేసే, ఆ తదుపరి నిర్ణయం తీసుకుంటారని అన్నారు. వారసత్వం ద్వారా భూమి ఉంటే, కుటుంబ సభ్యులందరు ఒప్పుకుంటే ప్రక్రియ పూర్తి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఖమ్మం ఆర్డీవో జి.



నర్సింహారావు, భూ భారతి – కొత్త ఆర్ఓఆర్ చట్టం గురించి, చట్టంలోని కీలక అంశాలు, రికార్డుల సవరణలు, రిజిస్ట్రేషన్ ప్రక్రియ, సాదా బైనామ క్రమబద్ధీకరణ, మ్యుటేషన్, భూదార్ కార్డు, గ్రామ రెవెన్యూ రికార్డు/ఖాతాలు, సమర్థ అధికారి, అప్పీల్ వ్యవస్థ, సేవల వివరణ పై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. రైతుల సందేహాలను అధికారులు నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో రఘునాధపాలెం మండల తహసీల్దార్ విల్సన్, ఎంపిడివో అశోక్ కుమార్, మండల వ్యవసాయ అధికారి ఉమామహేశ్వర రెడ్డి, అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## అనాథలుగా మారిన గిరిజన పిల్లలు



**మల్దకల్, ఏప్రిల్ 22 (జనంసాక్షి) :** జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం పెద్దతాండ గ్రామానికి చెందిన మూడవత్ గోపాల్ నాయక్ గత సంవత్సరం కిందట అనారోగ్య కారణాల వల్ల మృతి చెందగా అదేవిధంగా గోపాల్ నాయక్ భార్య సాలెమ్మ ఈనెల 21న హైదరాబాదులో అనారోగ్య కారణాల వల్ల చనిపోయింది. తల్లిదండ్రులు మృతి చెందడంతో ఇద్దరు మగపిల్లలు ముగ్గురు ఆడపిల్లలు అనాథలుగా మారారు.దేవా నాయ క్,సాయిరాంనాయక్, స్వప్న,జ్యోతి,పండు ఉన్నారు. తల్లిదండ్రులు చనిపోవడంతో పిల్లలు అనాథలయ్యారు. కావున ప్రభుత్వము అనాథ పిల్లలకు 20 లక్షల రూపాయలు ఆర్థిక సాయం ఇచ్చి ఆదుకోవాలని సేవాలాల్ సేన తెలంగాణ రాష్ట్ర ఇన్చార్జి మూడవత్ కృష్ణ నాయక్ ప్రభుత్వానికి డిమాండ్ చేస్తున్నారు.

# ప్రజలకు భరోసా భూ భారతి చట్టం

● జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ

**గద్వాల నడిగడ్డ, ఏప్రిల్ 22 (జనం సాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ భారతి ఆర్.ఓ.ఆర్ చట్టం,భూ వివాదాలను సత్వరంగా పరిష్కరించడంలో కీలకపాత్ర పోషిస్తుందని జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీ నారాయణ తెలిపారు.మంగళవారం ఇటిక్యాల మండలంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు ఏర్పాటు చేసిన భూ భారతి చట్టం–2025 పై అవగాహన సదస్సు కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ పాల్గొని, భూభారతి చట్టంపై, అందులోని అంశాలపై వివరిస్తూ రైతులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఇటిక్యాల తహసిల్దార్ వీర భద్రప్ప ,మార్కెట్ యార్డ్ చైర్మన్ దొడప్ప,మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ కుమార్, ఎంపీడీవో అజార్ మొహినుద్దీన్,రైతులు తదితరులు పాల్గొన్నారు.



## ఎన్నో ఏండ్ల భూ సమస్యలకు పరిష్కారం



● కలెక్టర్ హనుమంతరావు

**భువనగిరి కలెక్టరేట్, ఏప్రిల్ 22 (జనం సాక్షి) :** ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని భూ సమస్యలకు భూ భారతి చట్టంతో పరిష్కారం లభించనున్నదని కలెక్టర్ హనుమంతరావు ప్రకటించారు. మంగళవారం చౌటుప్పల్ మండల కేంద్రంలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో భూభారతి అవగాహన సదస్సు లో పాల్గొని మాట్లాడారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వీరారెడ్డి, చౌటుప్పల్ ఆర్డీవో శేఖర్ రెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ పాల్గొని భూభారతి సదస్సులో మాట్లాడుతూ ఇకపై భూ సమస్యలు ఉండవని అందుకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం భూభారతి ప్రవేశపెట్టి ఆరోఓఆర్ చట్టంతో సమస్యలకు చెక్ పెట్టనున్నది అన్నారు. ధరణిలో పరిష్కారం కానీ సమస్యలన్నీ భూభారతిలో అప్పిలు వ్యవస్థ ఉన్నందున పరిష్కారం అవుతాయన్నారు. భూ రక్షణ కొరకు ఇకపై సర్వే నెంబర్ తో పాటుగా హద్దులతో మ్యాప్ ను రూపొందించి పాస్ బుక్ లో ఉంచుతామన్నారు. కబ్జాలు, ఆక్రమణలు జరగవని, భూమికి మరింత భద్రత లభించనున్నదని తెలియజేశారు. కలెక్టర్ వెంట చౌటుప్పల్ ఆర్డీవో శేఖర్ రెడ్డి రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్‌లో చలివేంద్రం ఏర్పాటు



**ఖమ్మం, ఏప్రిల్ 22 (జనంసాక్షి) :** అంతర్జాతీయ సహకార సంవత్సరం పురస్కరించుకుని కలెక్టరేట్ ప్రవేశ ద్వారం వద్ద ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, వి.వెంకటాయపాలెం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంను జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా సహకార అధికారి జి. గంగాధర్, వివి పాలెం పిఏసీఎస్ బాధ్యులు తదితరులు ఉన్నారు.

## పెండింగ్ సాదాబైనామా దరఖాస్తులకు భూ భారతితో పరిష్కారం

● జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**మంథని, ఏప్రిల్ 22 (జనంసాక్షి) :** నూతన ఆర్వోఆర్ చట్టం భూ భారతి తో పెండింగ్ సాధా బైనామా దరఖాస్తులు పరిష్కారం అవుతాయని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. మంగళవారం కమాన్ పూర్ మండలంలోని నాగారం రైతు వేదిక వద్ద నిర్వహించిన భూ భారతి చట్టం అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, అదనపు కలెక్టర్ డి.వేణు తో కలిసి పాల్గొన్నారు. భూ భారతి చట్టం లోని వివిధ అంశాలను కలెక్టర్ రైతులకు, ప్రజలకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ.. పెండింగ్ లో ఉన్న సాధా బైనామా పరిష్కారం కోసం భూ భారతి చట్టంలో ప్రభుత్వం అవకాశం కల్పించిందని అన్నారు. పిఓటి, ఎల్.టి.ఆర్, సీలింగ్ చట్టాల ఉల్లంఘనలు లేని దరఖాస్తులను క్రమబద్ధీకరణ చేసే నాటి స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు , 100 రూపాయల అపరాధ రుసుం వసూలు చేసి సర్టిఫికెట్ జారీ చేస్తారని, హక్కుల రికార్డులు వివరాలను నమోదు చేసి పాసు బుక్ జారీ చేస్తారని అన్నారు. రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రతి గ్రామంలో గ్రామ పరిపాలన అధికారులను నియమించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. మనిషికి ఆధార్ కార్డు లాగా భూమికి భూదార్ సంఖ్య కేటాయింపు ప్రణాళిక చేస్తుందని, దీని ద్వారా భూ ఆక్రమణలకు చెక్ పెట్టవచ్చని అన్నారు. భూ భారతి చట్టం పై అవగాహన కల్పించేలా కర పత్రాలను పంపిణీ చేశామని, ప్రజలు వీటిని గమనించాలని ఏమైనా సందేహాలు ఉంటే తీర్చడానికి అధికారులు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారని అన్నారు. భూ సమస్యలపై అధికారులు అందించిన ఆర్డర్ల పై భూ భారతి చట్టం ప్రకారం అప్పీల్ చేసుకునే అవకాశం ఉందని, రెవెన్యూ డివిజన్ అధికారి నిర్ణయం పై కలెక్టర్ వద్ద, కలెక్టర్ నిర్ణయం పై భూమి ట్రిబ్యునల్ వద్ద అపీల్ చేసుకోవచ్చని, గతంలో ధరణి వ్యవస్థ ఉన్నప్పుడు ఏదైనా అభ్యంతరాలు ఉంటే సివిల్ కోర్టుకు మాత్రమే వెళ్లాల్సి ఉండేదని, నేడు ఆ అవసరం లేకుండా అప్పీల్ వ్యవస్థకు అవకాశం కల్పించిందని అన్నారు. అప్పీల్ వ్యవస్థ అందించిన తీర్పు తర్వాత కూడా సంతృప్తి చెందకపోతే సివిల్



కోర్టు వెళ్ళవచ్చని, దరఖాస్తుదారులకు అవసరమైన ఉచిత న్యాయ సలహాను ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. ప్రతి గ్రామంలో రెవెన్యూ రికార్డుల తయారు చేసి, ప్రతి సంవత్సరం గ్రామాలలో రికార్డు డిస్ ప్లే చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజన్ అధికారి సురేష్, కమాన్ పూర్ సింగిల్ విండో చైర్మన్ ఇనగంటి భాస్కర్ రావు, తహసిల్దార్ వాసంతి, ఎంపీడీవో లలిత, రైతులు, వివిధ వర్గాల ప్రజలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# కొత్త వీవో 5జీ ఫోన్

## •బిగ్ బ్యాటరీ, కర్వ్ డిస్‌ప్లేతో..

ప్రముఖ మొబైల్ తయారీ సంస్థ వివో కొత్త 5జీ స్మార్ట్‌ఫోన్‌ను లాంచ్ చేసింది. టి సిరీస్‌లో వివో టి4 5జీ పేరిట దీన్ని కంపెనీ లాంచ్ చేసింది. బిగ్ బ్యాటరీ, 90ఫాస్ట్ ఛార్జింగ్, కర్వ్ డిస్‌ప్లేతో ఈ ఫోన్ వస్తోంది. ఫోన్ ధర, ఫీచర్లతో పాటు అమ్మకాల వివరాలు ఇప్పుడు చూద్దాం.. వివో టి4 5జీ 6.77 అంగుళాల ఫుల్ హెచ్‌డీం అమోలెడ్ క్వాడ్ కర్వ్‌డ్ డిస్‌ప్లేతో వస్తోంది. 120%ఎఓ% రిఫ్రెష్ రేటు, 5000 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్‌తో తీసుకొచ్చారు. స్నాప్‌డ్రాగన్ 7ఎస్ జనరేషన్ 3 ప్రాసెసర్‌ను అమర్చారు. ఆండ్రాయిడ్ 15తో కూడిన ఫన్‌టచ్ ఓఎస్ 15 ఉన్నాయి.వెనుక వైపు 50 ఎంపీ కెమెరా, 2 ఎంపీ సెకండరీ కెమెరా ఉన్నాయి. ముందువైపు 8 ఎంపీ కెమెరా ఇచ్చారు. ఇక బ్యాటరీ విషయానికొస్తే ఇందులో 7,300 % బ్యాటరీ ఉంది. 90%ఔ% ఫాస్ట్ ఛార్జింగ్‌కు సపోర్ట్ చేస్తుంది. ఇన్ డిస్‌ప్లే ఫింగర్ ప్రింట్ సెన్సర్, ఐపీ65 రేటింగ్‌తో వస్తోంది.ఈ ఫోన్ మొత్తం మూడు వేరియంట్లలో లభిస్తుంది. 8జీబీం128జీబీ వేరియంట్ ధర రూ.21,999, 8జీబీం256జీబీ వేరియంట్ ధర రూ.23,999బీ 12జీబీం 256జీబీ వేరియంట్ ధర రూ.25,999గా కంపెనీ నిర్ణయించింది. ఎమరాల్డ్ బ్లేజ్, ఫాంటమ్ గ్రే రంగుల్లో లభిస్తుంది.

## ఎయిర్‌టెల్ చేతికి అదానీ డేటా నెట్‌వర్క్స్ స్పెక్ట్రమ్!

ఢిల్లీ: ప్రముఖ టెలికాం నెట్‌వర్క్ భారతీ ఎయిర్‌టెల్, తన అనుబంధ సంస్థ భారతీ హెక్సాకామ్ కలిసి అదానీ గ్రూప్‌తో ఒప్పందం చేసుకుంది. అదానీ డేటా నెట్‌వర్క్స్‌కు చెందిన బ్యాండ్‌లోని 400 మెగాహెర్జ్ స్పెక్ట్రమ్‌ను వినియోగించుకునేందుకు డీల్ కుదుర్చుకుంది. తద్వారా ఎయిర్‌టెల్ తన 5జీ సామర్థ్యాలను, నెట్‌వర్క్ కెపాసిటీని పెంచుకోనుంది. నియంత్రణ సంస్థల ఆమోదానికి లోబడి ఈ లావాదేవీ పూర్తి కానుంది. ఈ డీల్‌కు సంబంధించిన ఆర్థిక వివరాలు తెలియరాలేదు.2022లో నిర్వహించిన స్పెక్ట్రమ్ వేలంలో అదానీ డేటా నెట్‌వర్క్స్ స్పెక్ట్రమ్‌ను రూ.212 కోట్లకు దక్కించుకుంది. మొత్తం ఆరు సర్కిళ్ల పరిధిలో ఉన్న ఈ స్పెక్ట్రాన్ని డీల్‌లో భాగంగా ఎయిర్‌టెల్ వినియోగించుకోనుంది. గుజరాత్ ముంబయి ఆంధ్రప్రదేశ్ రాజస్థాన్ కర్ణాటక తమిళనాడు లోని స్పెక్ట్రమ్‌ను ఎయిర్‌టెల్ వాడుకోనుంది. అదనపు స్పెక్ట్రమ్ వల్ల అధిక వేగంతో కూడిన డేటాను వినియోగదారులకు అందించడంతో పాటు, నెట్‌వర్క్ సామర్థ్యాన్ని మరింత పెంచుకుని నాణ్యమైన సేవలను యూజర్లకు అందించడంలో ఎయిర్‌టెల్‌కు ఇది దోహదపడుతుంది.

# లాభాల బాటలో స్థిరంగా..



## ఆరో రోజూ సూచీలు పైపైకి... 24,150 ఎగువన నిఫ్టీ

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా ఆరో రోజూ లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలు ఉన్నప్పటికీ..మన సూచీలు రాణించాయి. ముఖ్యంగా ఎఫ్ఎంసీజీ, బ్యాంకింగ్ షేర్ల అండతో మన సూచీలు లాభాల్లో ముగిశాయి. గడిచిన ఆరు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ దాదాపు 6వేల పాయింట్ల మేర పెరిగింది. 80 వేల మార్కుకు చేరువవు తోంది.సెన్సెక్స్ ఉదయం 79,728.39 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 79,408.50) లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో 79,824.30 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 187 పాయింట్ల లాభంతో 79,595.59 వద్ద ముగిసింది. నిఫ్టీ 41.70 పాయింట్ల లాభంతో 24,167.25 పాయింట్ల వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 85.19గా ఉంది.సెన్సెక్స్ 30 సూచీలో ఐటీసీ, హిందుస్థాన్ యూనిలీవర్, మహీంద్రా అండ్ మహీంద్రా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎటర్నెల్ (జొమాటో) షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. ఇండస్ ఇండ్ బ్యాంక్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, భారతీ ఎయిర్‌టెల్, ఇన్ఫోసిస్, బజాజ్ ఫిన్‌సర్వ్ షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 67 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్స 3,477 డాలర్ల వద్ద కొనసాగుతోంది.




## గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 4.05 | ₹ 4.07 |

## బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| ₹ 92,900 (22 క్యారెట్లు) | ₹ 1,01,350 (24 క్యారెట్లు) |
|---|---|

## వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 1,11,000

# రుణానికి దారులెన్నో..

### ఆస్తులపైనా వ్యక్తిగత బ్యాంక్‌లోన్ సాకర్యం



జనంసాక్షి:జీవితం అనూహ్యమైంది. కొన్నిసార్లు అవసరాలు, ఖర్చులు మన అంచనాలకు మించి అవుతుంటాయి. అటువంటి సందర్భాల్లో రుణం తీసుకోక తప్పదు. ప్రస్తుతం రుణాలకు సంబంధించి మార్కెట్లో అనేక ఎంపికలు అందుబాటులో ఉన్నాయి. బ్యాంకులు ఇప్పుడు వినియోగదారుల విభిన్న అవసరాలు, ప్రాధాన్యతలు గుర్తించి వివిధ రకాల రుణాలను అందిస్తున్నాయి. రుణం కోసం ఆలోచించేటప్పుడు సెక్యూరిటీల(ఆస్తుల)పై రుణం తీసుకోవాలా లేదా వ్యక్తిగత రుణం తీసుకోవాలా అనేది మీకు ఆ సమయంలో ఉండే పరిస్థితులను బట్టి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. మీ అవసరాలకు ఏ క్రెడిట్ సౌకర్యం సరిపోతుందో నిర్ణయించడంలో వాటి వ్యత్యాసాలను అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం. మీకు తగిన రుణాన్ని ఎంపిక చేసుకోవడానికి ఈ రెండు రుణాలపై కొన్ని ముఖ్యమైన విషయాలను తప్పక తెలుసుకోవాలి. అవేంటో ఇక్కడ చూద్దాం. మీ ఆర్థికపరమైన ఆస్తులను తాకట్టు పెట్టడం ద్వారా రుణం తీసుకోవచ్చు. ఉదాహరణకు, స్టాక్స్, బాండ్లు, మ్యూచువల్ ఫండ్లు, బీమా పాలసీలు లేదా ఇతర ఆస్తులను హామీగా ఉంచి రుణం తీసుకోవచ్చు. మీరు వాటిని విక్రయించకుండా/రద్దు చేయకుండా తాత్కలికంగా ఏదైనా ఆర్థిక సంస్థ/బ్యాంకులో తాకట్టు పెట్టి రుణం తీసుకోవచ్చు. అయితే, మీరు ఆ రుణాన్ని పూర్తిగా చెల్లించే వరకు బ్యాంకు ఈ సెక్యూరిటీలను తన వద్ద భద్రపరుస్తుందని మీరు గుర్తుంచుకోవాలి. మీరు హామీగా ఉంచిన ఆస్తి విలువపై 50% నుంచి 90% మధ్య రుణాన్ని పొందే అవకాశం ఉంటుంది. రుణ మొత్తం అనేది బ్యాంకును బట్టి కూడా ఆధారపడి ఉంటుంది. ఈ రుణాలపై కొన్ని ప్రముఖ బ్యాంకులు 8 శాతం నుంచి 14 శాతం వరకు వడ్డీ వసూలుజేస్తున్నాయి.వ్యక్తిగత రుణాల వడ్డీ రేట్లతో పోలిస్తే బ్యాంకులు ఈ రుణాలపై తక్కువ వడ్డీ రేట్లను విధిస్తాయి. అంతేకాకుండా, వివిధ సెక్యూరిటీలకు..అంటే మ్యూచువల్ ఫండ్లు, షేర్లపై లాభ/నష్టాలు యథాతదంగా అమలవుతూనే ఉంటాయి. మన సెక్యూరిటీలు తాకట్టులో ఉన్నప్పటికీ, స్టాక్స్‌పై డివిడెండ్లు వచ్చినప్పుడు అవి మన బ్యాంకు ఖాతాకు క్రెడిట్ అవుతుంటాయి. అంటే, వివిధ సెక్యూరిటీలు తాకట్టుగా ఉన్నప్పటికీ, మార్కెట్లకనుగుణంగా హెచ్చుతగ్గులకు గురవుతుంటాయి. మీకు నగదు అవసరం పడినప్పుడు బలమైన పోర్ట్‌ఫోలియో ఉండి కూడా, దాన్ని రద్దు చేయకూడదనుకుంటే సెక్యూరిటీలపై రుణం మంచి ఎంపిక కావచ్చు. ఈ రుణంతో, మీ పెట్టుబడులను అలాగే కొనసాగిస్తూ రుణాన్ని పొందవచ్చు. ఈ రుణానికి అర్హత పొందడానికి మీ క్రెడిట్ స్కోరు అంత ముఖ్యమైన అంశం కాదు. రుణాన్ని ముందస్తుగా చెల్లించినప్పుడు బ్యాంకులు ఎటువంటి జరిమాన, ఛార్జీలు వసూలు చేయవు. చెల్లించే కాలవ్యవధి చాలా సరళంగా ఉంటుంది.సెక్యూరిటీలపై రుణం మొత్తం..తాకట్టు పెట్టిన ఆస్తుల విలువను బట్టి ఆధారపడి ఉంటుంది. ఒకవేళ మార్కెట్లో హెచ్చు, తగ్గులు ఉన్నప్పుడు వీటిని విక్రయించాలనుకుంటే వీలుపడదు. ఎందుకంటే రుణం తీరేవరకు సెక్యూరిటీ పత్రాలు బ్యాంకుల వద్ద లాక్ అయి ఉంటాయి. ఈ సెక్యూరిటీలపై మార్కెట్లకు అనుగుణంగా లాభాలొస్తే పర్వాలేదు. నష్టాలు వచ్చినప్పుడు వాటిని రుణగ్రహీత ఏం చేయలేని పరిస్థితి. ఇలాంటి పరిస్థితుల్లో రుణగ్రహీత ఆర్థికంగా నష్టపోవచ్చు. రుణ మొత్తం సెక్యూరిటీ విలువపై ఆధారపడి ఉన్నందున, డాక్యుమెంటేషన్ ప్రక్రియ ఎక్కువగానే ఉంటుంది. వివిధ పత్రాలు తనిఖీ చేయాల్సి ఉంటుంది కాబట్టి, రుణ ప్రక్రియకు కాస్త ఎక్కువ సమయం పడుతుంది.ఈ రుణంపై ఎటువంటి పూచీకత్తును అందించాల్సిన అవసరం లేదు. కానీ, మెరుగైన క్రెడిట్ స్కోరు తప్పనిసరి. పూచీకత్తుకు బదులుగా, బ్యాంకులు దరఖాస్తుదారుడి రుణ అర్హతను అంచనా వేస్తాయి. ఇది దరఖాస్తుదారుడి క్రెడిట్ చరిత్ర, ఆదాయం, తిరిగి చెల్లించే సామర్థ్యం ఆధారంగా జరుగుతుంది. మీరు వివిధ వ్యక్తిగత ఆర్థిక అవసరాల కోసం వ్యక్తిగత రుణాన్ని ఖర్చు పెట్టవచ్చు. ఉదాహరణకు, మీరు అత్యవసర వైద్య అత్యవసర పరిస్థితిలో ఉన్నప్పుడు, మీ ఇంటిని పునరుద్ధరించాలనుకున్నా, విద్యకు ఖర్చుపెట్టాలనుకున్నా, ఏవైనా వినియోగ వస్తువుల కొనుగోలు, వివాహం కోసం, ఇప్పటికే ఉన్న రుణాన్ని ఏకీకృతం చేయడం, ప్రయాణాలు, వివిధ వేడుకల ఖర్చులకు వ్యక్తిగత రుణం మీకు ఉపయోగపడుతుంది. రుణ మొత్తం రూ.20 వేల నుంచి సుమారు రూ.40 లక్షల వరకు కూడా పొందే అవకాశం ఉంది. రుణాన్ని చెల్లించే కాలవ్యవధి 12 నెలల నుంచి 60 నెలల వరకు ఉంటుంది. ఈ రుణాలపై కొన్ని ప్రముఖ బ్యాంకులు 10 శాతం నుంచి 18 శాతం వరకు వడ్డీ వసూలుజేస్తున్నాయి.వ్యక్తిగత రుణాలు పొందడానికి ఎటువంటి పూచీకత్తును అందించాల్సిన అవసరం లేదు. మీ ఉద్యోగ చరిత్ర, ఆదాయ స్థాయి, వృత్తి, క్రెడిట్ చరిత్ర, తిరిగి చెల్లించే సామర్థ్యం, వయసు ఆధారంగా వ్యక్తిగత రుణాలు మంజూరవుతాయి. మీకు మంచి క్రెడిట్ స్కోరు ఉంటే, వివిధ ఆర్థిక సంస్థలు అందించే తక్కువ వడ్డీ రేటుతో వ్యక్తిగత రుణానికి అర్హత పొందొచ్చు. క్రెడిట్ స్కోరు మెరుగ్గా ఉన్నవారికి అనేక బ్యాంకులు, ఆర్థిక సంస్థలు ప్రీ-అప్రూవ్డ్ రుణాలను కూడా మంజూరు చేస్తున్నాయి.

# పోప్‌గా ఎన్నికైన వ్యక్తి పేరు ఎందుకు మారుతుంది..?



కేథలిక్‌ల అత్యున్నత మతగురువైన పోప్‌గా ఎన్నికైన వ్యక్తి తన పేరును కొనసాగించరు. ఆయన తన పేరును బైబిల్‌లో వర్ణించిన పేర్ల నుంచి ఒకటి ఎంచుకొని స్వీకరిస్తారు.ప్రస్తుతం కన్నుమూసిన పోప్ అసలు పేరు జోర్జ్ మారియో బెర్గోగ్లియో. ఆయన సెయింట్ ఫ్రాన్సిస్ ఆఫ్ అస్సిసి నుంచి స్ఫూర్తి పొంది.. ఫ్రాన్సిస్ పేరును స్వీకరించారు. ఆ పేరు వినయం, పేదలపై కరుణకు చిహ్నంగా భావిస్తారు.కొత్తపోప్ పేరు మార్చుకోవడం దాదాపు 1,000 ఏళ్లకు పైగా వస్తున్న ఓ ఆచారం. ఆ పదవిలోకి రాగానే చర్చికి సేవచేయడంలో కొత్తదశకు చేరినట్లుగా భావిస్తారు. పోప్‌లు తాము ఎంతో ఇష్టపడిన, అనుకరించాల్సిన వారి పేర్లను ఎంచుకొంటారు. ఈ పదవిలోకి వచ్చాక వారు ప్రైవేటు వ్యక్తులు ఏమాత్రం కారు. ప్రపంచ క్యాథలిక్కు చర్చికి నాయకుడిగా చూస్తారు. పాత వ్యక్తిగత, జాతీయత గుర్తింపుల నుంచి దూరం కావడానికే ఈ కొత్త పేరు పెట్టుకొంటారు.క్రీ.శ. 533 నుంచి 535 వరకు ఈ పదవిలో ఉన్న పోప్ జాన్-2 తొలిసారి పేరు మార్చుకొన్నారు. వాస్తవానికి ఆయన పేరు మెర్క్యురియస్. అది ఓ రోమన్ దేవుడి పేరు. దీంతో ఆయన క్రిస్టియన్ మతగురువు జాన్ పేరును స్వీకరించారు. నాటి నుంచి సంప్రదాయంగా ఇది కొనసాగింది. ఇక 16వ శతాబ్దం నుంచి అందరు పోప్‌లు పేరు మార్చుకొన్నారు.20వ శతాబ్దం ప్రారంభం నుంచి పోప్ పదవిలో ఉన్న వ్యక్తికి ప్రపంచ వ్యాప్తంగా పలుకుబడి లభిస్తోంది. దాదాపు 140 కోట్ల మంది క్యాథలిక్కులకు మతగురువుగానే కాకుండా.. స్వతంత్ర వాటికన్ దేశానికి అధిపతిగా వివిధ దేశాలతో సంబంధాలు నెరుపుతున్నారు. వాటికన్ నగరానికి 180 దేశాలతో దౌత్యసంబంధాలు ఉన్నాయి. ప్రపంచ పర్యటనలు, ప్రసంగాలే కాకుండా తెరవెనుక దౌత్యాల్లో కూడా పోప్ పాత్ర ఉంటోంది. ఎప్పుటి నుంచో శత్రువులైన అమెరికా-క్యూబా మధ్య సంబంధాలు నెలకొల్పడంలో పోప్ ఫ్రాన్సిస్ కీలక పాత్ర పోషించారు. ఇటీవల కాలంలో పర్యావరణ మార్పులు, వలసలు, యుద్ధాల ముగింపులపై వారు దృష్టిపెట్టారు.

# 'మీ నాన్నను చంపినట్లే నిన్నూ..'

### సిద్ధిఖీ తనయుడికి 'డి' కంపెనీ బెదిరింపులు

ముంబై: మహారాష్ట్ర దివంగత నేత బాబా సిద్ధిఖీ తనయుడు, ఎన్సీపీ నేత జీషాన్‌ను గుర్తు తెలియని వ్యక్తులు బెదిరించారు.సిద్ధిఖీని చంపినట్లే చంపేస్తామంటూ మెయిల్ చేశారు. రూ.10 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.కిందటి ఏడాది అక్టోబరు 12న బాబా సిద్ధిఖీ ముంబయిలోని తన కుమారుడి కార్యాలయంలో ఉండగా.. కొందరు దుండగులు ఆయనపై కాల్పులకు పాల్పడిన విషయం తెలిసిందే. వెంటనే ఆయన్ను ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ ఘటనకు తామే కారణమని లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ ఇప్పటికే ప్రకటించింది.అయితే.. బెదిరింపు మెయిల్‌పై తన కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారని జీషాన్ ఏఎన్ఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు. ఇదిలా ఉంటే.. బాబా సిద్ధిఖీ హత్య కేసులో ప్రధాన నిందితుడు అక్షదీప్ గిల్‌ను పంజాబ్‌లో పోలీసులు అరెస్ట్ చేశారు. అయితే ఈ వ్యవహారం వెనుక మాస్టర్ మైండ్ అన్మోల్ బిష్ణోయ్ అని పోలీసులు తేల్చారు.

## జాతీయం అంతర్జాతీయం

# పరుగు ఆపని పసిడి...

### •దూసుకెళ్తున్న బంగారం ధర..
### •రూ.లక్ష దాటేసి ఇంకా పైపైకి!

ఢిల్లీ: దేశీయంగా లక్ష రూపాయల మార్క్ దాటి ఆల్‌టైమ్ గరిష్ఠాలకు చేరిన బంగారం ధర.. మరింత పైకి చేరింది. సోమవారం సాయంత్రం తొలిసారి లక్ష రూపాయలు దాటిన 10 గ్రాముల మేలిమి పసిడి ధర.. తాజాగా మరో రూ.2 వేలు పెరిగింది. మధ్యాహ్నం ఒంటి గంట సమయానికి రూ.1,02,000కు చేరింది. అంతర్జాతీయంగా చూస్తే ఔన్సు బంగారం ధర (31.10 గ్రాములు) 3,467 డాలర్లు పలుకుతోంది. అటు మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజీలోనూ 10 గ్రాముల పసిడి ధర లక్ష రూపాయలకు చేరువైంది. వరుసగా నాలుగో ట్రేడింగ్ సెషన్‌లోనూ దీని ధర పెరిగింది. జూన్ నెల డెలివరీ కాంట్రాక్ట్ ధర మంగళవారం ఇంట్రాడేలో రూ.1,899 పెరిగి రూ.99,178కి చేరింది. ఆపై రూ.98,880కు తగ్గింది. ఆగస్టు కాంట్రాక్ట్ ధర రూ.99,800 వద్ద కొనసాగుతుండగా.. అక్టోబర్ కాంట్రాక్ట్ గోల్డ్ మాత్రం ఏకంగా రూ.2వేలు పెరిగి లక్ష రూపాయల మార్కు దాటేసింది. సాధారణంగా అక్షయ తృతీయకు ఎంతోకొంత బంగారం కొనుగోలు చేయ డం ఆనవాయితీగా వస్తోంది. కానీ, బంగారం ధరలు రికార్డుస్థాయిలో ఉం డడంతో కొనుగోలుదారులు వెనకడుగు వేస్తున్నారు. అటు బంగారం వర్తకుల్లోనూ ఇదేతరహా అభిప్రాయం వ్యక్తమవుతోంది. కొనుగోళ్లు తగ్గే అవకాశం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. అక్షయ తృతీయ రోజు నాటికి (ఏప్రిల్ 30న) బంగారం కాస్త అయినా తగ్గుతుందేమోనని చూస్తు న్నారు. ఒకవేళ ఇదేస్థాయిలో ధరలు కొనసాగితే ఆ మేర అమ్మకాలపై కొంతమేర ప్రభావం పడే అవకాశం ఉందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. టారిఫ్‌ల విషయంలో అమెరికా ఇతర దేశాలతో వాణిజ్య ఒప్పందాల దిశగా ప్రయత్నాలు చేస్తోంది. మరోవైపు చైనాతో మాత్రం వివాదం కొనసాగిస్తోంది. అయితే, వడ్డీ రేట్ల కోత విషయంలో ఫెడ్ చీఫ్ జెరోమ్ పోవెల్, ట్రంప్ మధ్య వివాదం నెలకొంది. దీంతో అమెరికా ఆర్థిక వ్యవస్థ గురించి, ఆ దేశ రుణాల గురించి మదుపర్లలో ఆందోళన నెలకొంది. మరోవైపు చైనా సహా ప్రపం చవ్యాప్తంగా ఉన్న కేంద్ర బ్యాంకులు బంగారాన్ని పెద్ద మొత్తంలో కొనుగోలు చేస్తుండడంతో పసిడి ధర పెరుగుతోందని అనలిస్టులు పేర్కొంటున్నారు.



# నాపై హత్యాయత్నం చేసింది పిన్ని అనురాధ..?

### బిడదిలో హత్యాయత్నం కేసు.. వాంగ్మూలం తీసుకున్న పోలీసులు

**దొడ్డబళ్లాపురం:** రామనగర తాలూకా బిడదిలో మాజీ మాఫియా డాన్ దివంగత ముత్తప్పరై చిన్న కుమారుడు రిక్కీ రై పై 18న అర్ధరాత్రి కాల్పులు జరిపి హత్యాయత్నం చేసిన కేసులో పోలీసులు అతని వాంగ్మూలాన్ని నమోదు చేసుకున్నారు.అలాగే రిక్కీ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులు, పనివాళ్లు, సెక్యూరిటీని విచారించారు. సంఘటన జరిగిన చుట్టుపక్కల పరిసరాల్లో శోధిస్తున్నారు. మణిపాల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రిక్కీ రై కోలుకుంటున్నాడు.నా మీద హత్యాయత్నం చేసింది తన పిన్ని అనురాధ, రియల్ ఎస్టేట్ వ్యాపారి నితేశ్ శెట్టి, రాకేశ్ మల్లి, వైద్యనాథన్ అనేవారని రిక్కీ రై చెప్పినట్లు తెలిసింది. దీంతో పోలీసులు వారికి విచారణకు హాజరు కావాలని నోటీసులు ఇవ్వనున్నారు. అయితే రిక్కీ పిన్ని అనురాధ కాల్పులు జరగడానికి ఐదు రోజుల ముందు విదేశాలకు వెళ్లిపోయినట్టు సమాచారం.

# జైపూర్‌లో వాన్స్ ఫ్యామిలీ



**న్యూఢిల్లీ:**భారత్‌లో పర్యటిస్తున్న అమెరికా ఉపాధ్యక్షుడు జేడీవాన్స్ కుటుంబ సమేతంగా మంగళవారం జైపూర్‌లోని అంబర్ కోటను సందర్శించారు. వాన్స్ కుటుంబ సభ్యులకు యూనెస్కో వరల్డ్ హెరిటేజ్ సైట్ వద్ద రాజస్థానీ సంప్రదాయంలో ఘన స్వాగతం లభించింది. హాతీ గావ్‌లో ప్రత్యేక శిక్షణ పొందిన చందా, పుష్ప అనే ఏనుగులు వాన్స్ కుటుంబానికి స్వాగతం పలికగా.. పలువురు నృత్యాలతో అలరించారు.అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, సతీమణి ఉషా వాన్స్, పిల్లలు ఇవాన్, వివేక్, మిరాబుల్ సమేతంగా నాలుగు రోజుల భారత పర్యటనకు వచ్చిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం పింక్ సిటీ జైపూర్ పర్యటనలో ఉన్న వాన్స్ కుటుంబం.. అంబర్ కోటతో పాటు హవా మహల్, జంతర్ మంతర్‌ను సైతం సందర్శించనుంది. ఆరావళి పర్వత శ్రేణుల్లో ఎర్ర ఇసుక రాయి, పాలరాతితో ఉన్న అంబర్ పోర్ట్‌ను ఇంజినీరింగ్ అద్భుతంగా అభివర్ణిస్తుంటారు. రాజా మాన్ సింగ్ 16వ శతాబ్దంలో దీనిని నిర్మించారు. ఇక.. ఈ పర్యటనలో ఆ రాష్ట్ర గవర్నర్ హరిబావు కిషన్‌రావ్, ముఖ్యమంత్రి భజన్ లాల్ శర్మ ఇచ్చే ఆతిథ్యం వాన్స్ కుటుంబం స్వీకరించనుంది. రాజస్థాన్ ఇంటర్నేషన్ సెంటర్‌లోదౌత్యవేత్తలు, మేధావులను ఉద్దేశించి అమెరికా-భారత్ సంబంధాలపై జేడీ వాన్స్ ప్రసంగించనున్నారు. అమెరికా ఉపాధ్యక్షుడి పర్యటన నేపథ్యంలో జైపూర్ అలర్ట్ అయ్యింది. ప్రముఖులు బస చేసే రామ్‌బాగ్ ప్యాలెస్‌లో వాన్స్ కుటుంబం దిగగా.. అక్కడ కట్టదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు.సోమవారం ఉదయం భారత్‌కు చేరుకున్న వాన్స్ కుటుంబం.. న్యూఢిల్లీలో బస చేసింది. సాయంత్రం ప్రధాని నరేంద్ర మోదీతో రక్షణ, ఇంధన, సాంకేతిక రంగాలపై జేడీ వాన్స్ చర్చించారు. అనంతరం వాన్స్ కుటుంబానికి ప్రధాని మోదీ ప్రత్యేక ఆతిథ్యం ఇచ్చారు. ఈ సందర్భంగా వాన్స్ పిల్లలతో మోదీ సరదాగా గడిపారు. బుధవారం వాన్స్ కుటుంబం ఆగ్రాను సందర్శించనుంది. గురువారం ఉదయం తమ పర్యటన ముగించుకుని అమెరికా బయల్దేరనున్నారు.

# ఎయిర్‌ఫోర్స్ వింగ్ కమాండర్‌పై దాడి కేసులో ట్విస్ట్



బెంగళూరు: ఎయిర్‌ఫోర్స్ వింగ్ కమాండర్‌పై దాడి కేసులో ట్విస్ట్ చోటు చేసుకుంది. బెంగళూరులో తమపై కొందరు దాడి చేశారని వింగ్ కమాండర్ శీలాదిత్యా బోస్, ఆయన భార్య, స్క్వాడ్రన్ లీడర్ మధుమిత ఆరోపించిన సంగతి తెలిసిందే.అయితే.. తొలుత బోస్ దాడికి దిగినట్లుగా కన్పిస్తున్న సీసీటీవీ దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. ఈ విషయాన్ని ఓ పోలీసు అధికారి ధ్రువీకరించారు కూడా.భారత వైమానిక దళానికి చెందిన వింగ్ కమాండర్ బోస్ సంచలన ఆరోపణలకు దిగారు. కారులో వెళ్తున్న తమను కొందరు వ్యక్తులు బైక్‌పై వచ్చి అడ్డగించి దాడి చేశారని ఆరోపించారు. ఆయన భార్య, స్క్వాడ్రన్ లీడర్ మధుమిత కూడా.. పోలీసులకు ఈ విషయం చెప్పినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని వాపోతూ ఓ వీడియో విడుదల చేశారు. ఆ వీడియోలో బోస్ ముఖం, మెడ నిండా రక్తం కనిపించింది. పక్కనే ఆయన భార్య కారు నడుపుతూ కనిపించింది.ఈ వ్యవహారం 'కన్నడిగ వర్సెస్ నాన్ కన్నడిగ'గా మారింది. అయితే వీడియో ఆధారంగా విచారణ జరిపిన ఈస్ట్ జోన్ డీసీపీ దేవ్‌రాజ్ షాకింగ్ విషయం తెలియజేశారు. తొలుత బోస్ వాళ్లపై దాడికి దిగారని తెలియజేశారు. అంతేకాదు.. ఈ ఘటనకు సంబంధించిన నిందితుడు కూడా బోస్‌పై ఫిర్యాదు చేశారని అన్నారు. అయితే పరస్పర దాడికి కారణాలు పూర్తి స్థాయి దర్యాప్తు తర్వాతే తెలియజేస్తామన్నారు.బోస్, మధుమిత వీడియోలో.. "కారులో వెళ్తున్న మమ్మల్ని మా వెనకే బైక్‌పై వచ్చిన వ్యక్తులు అడ్డగించారు. మమ్మల్ని తిట్టడం మొదలుపెట్టారు. మా కారుపై ఉన్న డీఆర్‌డీఓ స్టిక్కర్‌ను చూశారు. నా భార్యను తిట్టడంతో తట్టుకోలేకపోయాను. దాంతో నేను కారు నుంచి బయటకు రావడంతో.. ఒక వ్యక్తి కీతో నా ముఖంపై కొట్టాడు. దాంతో నా ముఖమంతా రక్తం కారింది. మిమ్మల్ని రక్షించే వ్యక్తులతో మీరు ఇలాగేనా వ్యవహరించేదని" నేను గట్టిగా మాట్లాడాను. కానీ ఆశ్చర్యంగా ఇంకా చాలా మంది వ్యక్తులు వచ్చి, మమ్మల్ని దూషించడం మొదలుపెట్టారు. ఒక వ్యక్తి రాయి తీసుకొని, కారు అద్దాలను, నా తలను పగలగొట్టాలని ప్రయత్నించాడు. అదీ నా పరిస్థితి. వెంటనే అప్రమత్తమైన నా భార్య నన్ను పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లింది. ఫిర్యాదు చేద్దామని వెళ్తే అక్కడ ఎలాంటి స్పందనా రాలేదు. కర్ణాటకలో ఇలాంటి పరిస్థితులు ఆశ్చర్యంగా ఉన్నాయి." అంటూ ఆ భార్యాభర్తలు వీడియోలో వ్యాఖ్యానించారు.

# భూ భారతి చట్టంతో భూ సమస్యలకు పరిష్కారం

**మంగపేట ఏప్రిల్ 22(జనంసాక్షి)**




రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భూ సమస్యలను పరిష్కరించడానికి అమలు చేయనున్న భూ భారతి చట్టం ద్వారా ఎక్కువ మొత్తంలో ప్రజల, రైతుల భూ సమస్యలు పరిష్కారం అవుతాయని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద మండల తహసిల్దార్ అధ్యక్షతన భూ భారతి చట్టం పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించగా ముఖ్యఅతిథిగా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క, జిల్లా అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) మహేందర్.జి హాజరయ్యారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మహేందర్ జి, మంత్రి సీతక్క లు మాట్లాడుతూ ప్రజలు, రైతులు ప్రతి ఒక్కరు కూడా భూ భారతి చట్టంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని వారు అన్నారు. అలాగే గతంలో ధరణిలోని పొరపాట్లని సవరించేందుకు కలెక్టర్ కి మినహా ఏ అధికారికీ అవకాశం



లేదని చెప్పారు. దీనివల్ల తాహసిల్దార్ స్థాయిలో పరిష్కారమయ్యే చిన్న సమస్యలు కూడా వేల సంఖ్యలో పేరుకుపోయేవని అన్నారు. చిన్న చిన్న సమస్యలు కూడా తహసిల్దార్లు, ఆర్డీవో పరిష్కరించలేని పరిస్థితి ఉండేదని పేర్కొన్నారు. భూ భారతి చట్టం ద్వారా ప్రభుత్వం భూ సమస్యలపై స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చిందని తెలిపారు. ఈ చట్టం ద్వారా పొరపాట్ల సవరణకు అవకాశం ఉందని, మ్యూటేషన్ దరఖాస్తులు త్వరితగతిన పరిష్కారం అవుతాయని తెలిపారు. రెండింతల అప్పిలు వ్యవస్థతో రైతులు, ప్రజలు భూ సమస్యలపై కోర్టు వరకు వెళ్లవలసిన అవసరం దాదాపు ఉండదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పి శివం ఉపాధ్యాయ, జిల్లా గ్రంథాలయ చైర్మన్ భానోత్ రవి చందర్ నాయక్, తహసీల్దార్ తోట రవీందర్, ఎంపీడివో భద్రు నాయక్, అగ్రికల్చర్ ఏవో చేరాలు, డిప్యూటీ తాహసిల్దార్ మల్లేశ్వర్ రావు, డిపీఆర్వో రఫీ, సీఐ శ్రీనివాస్,ఎస్సై టీవీఆర్ సూరి, ఆర్ఐలు శ్రీనివాస్, యేసుపాదం, కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# నాణ్యమైన ధాన్యాన్ని సత్వరమే కొనుగోలు చేయాలి

**పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**మంథని, (జనంసాక్షి) :**



యాసంగి పంట కొనుగోలు లో కొనుగోలు కేంద్రాలకు వచ్చే నాణ్యమైన ధాన్యాన్ని సత్వరమే కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష కోరారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష రామగిరి మండలంలోని బేగంపేట, నవాబ్ పేట, కల్వచర్ల గ్రామాలలో ఐకెపి ద్వారా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ రెవెన్యూ వేణు తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ.. రైతులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా నాణ్యమైన ధాన్యం కొనుగోలు ప్రక్రియ జిల్లాలో జరగాలని అన్నారు. కొనుగోలు చేసిన ధాన్యానికి వెంటనే చెల్లింపులు పూర్తి చేయాలని అన్నారు. ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో తప్పనిసరిగా ప్యాడీ క్లీనర్ ఏర్పాటు చేయాలని అన్నారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని శుభ్రం చేసిన తర్వాత తేమ శాతం రాగానే కొనుగోలు చేయాలని, రెగ్యులర్ గా ధాన్యం తేమ శాతం పరిశీలించాలని అన్నారు. రైస్ మిల్లులకు నాణ్యమైన ధాన్యాన్ని మాత్రమే సరఫరా చేయాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన వసతులు కల్పించాలని, ప్యాడీ క్లీనర్, టార్పాలిన్ కవర్లు, వెయింగ్ యంత్రాలు తేమ యంత్రాలు మొదలగు సామాగ్రి అందుబాటులో పెట్టుకొవాలని అన్నారు. కోనుగోలు కేంద్రాలలో నాణ్యత ప్రమాణాలు పరిశీలించి, భారత ఆహార సంస్థ నిర్దేశించిన నాణ్యత ప్రమాణాలు ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని అన్నారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట మంథని ఆర్డీవో సురేష్, తహసిల్దార్ సుమన్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాతకు అండగా ఉంటాం

**రామగుండం (జనంసాక్షి):**



పెద్దపెల్లి జిల్లా అంతర్గం మండలం పెద్దంపేట గ్రామంలో ఏసంగి పంటల కొనుగోలు కోసం ఏర్పాటు చేసినటువంటి ఐకెపి సెంటర్ను ఈరోజు రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు రాజ్ ఠాకూర్ ముఖ్యఅతిథిగా హాజరై ఐకెపి సెంటర్లు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి సభా అధ్యక్షతగా వహించిన ఓబీసీఎల్ జిల్లా అధ్యక్షుడు పెంద్యాల మహేష్ మాట్లాడుతూ ఎన్నికల ముందు మా నీళ్ళు మాకు కావాలనే స్లోగన్ తో ఇచ్చిన హామీ ప్రకారం గెలిచిన తర్వాత ప్రతి ఎకరాకు సాగునీరు అందించడంలో సఫలీకృత రైతుల గుండెల్లో గూడు కట్టుకున్న నాయకుడు రాజ్ ఠాకూర్ గారు అని ప్రతి గింజ కొనుగోలు చేసి కోతల్లేకుండా రైతుల పక్షాన నిలబడే ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అని అన్నారు. అనంతరం ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజాపాలనలో భాగంగా సన్న వడ్లు పండించిన వారికి బోనస్ గా ఎటువంటి కోత లేకుండా ఒక గింజ కూడా కోత పెట్టకుండా అన్నం పెట్టే అన్నదాతకు అండగా ఉండాలని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అండగా నిలిచి పంట కొనుగోలు చేయడమే కాకుండా సన్న వడ్లకు 500 రూపాయలు ఇవ్వడమో కాకుండా లక్షల రూపాయల రుణమాఫీ ఏకకాలంలో చేయడం జరిగిందని అదేవిధంగా ఈ ప్రాంతంలోని ప్రతి గ్రామం అభివృద్ధి చేయడం నా దేయమని అని అందులో భాగంగా పెద్దంపేట గ్రామం అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తానని తప్పకుండా ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటామని దాంట్లో భాగంగా 200 యూనిట్లు కరెంటు ప్రతి ఇంటికి సన్న బియ్యం గాని అదే విధంగా ఉచిత బస్సు గాని అదేవిధంగా రెండు లక్షల రూపాయల రుణమాఫీ గాని ఇలా చెప్పుకుంటూ పోతే అనేక కార్యక్రమాలు చేసి చూపించిన ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అని అన్నారు.

# డ్రగ్స్ వాడకం వల్ల ఒక తరాన్ని కోల్పోతున్నాం




**భీమదేవరపల్లి:ఏప్రిల్ 22(జనం సాక్షి)**

డ్రగ్స్ నిర్మూలన పోరు యాత్ర రెండో రోజుకు కొనసాగింది. యాత్రలో భాగంగా ఉదయం 8 గంటలకు మంగళపల్లి గ్రామంలో ప్రారంభమై గొల్లపల్లి, గట్లనర్సింగపూర్,గొల్లపల్లి,ముస్తాపూర్ గ్రామంలో జేఏసీ ప్రతినిధులు మహిళా సంఘాల ప్రతినిధులు విస్తృతంగా పర్యటించినారు. ప్రతి గ్రామంలో మహిళలను యువతను సమీకరించి డ్రగ్ సేవించడం ద్వారా లోన్ యాప్స్ ద్వారా అప్పులు చేసి ఆన్లైన్ బెట్టింగ్లో లక్షలాది రూపాయలు నష్టపోయి ,ఆన్లైన్ గేమ్స్ ద్వారా నష్టపోయి కుటుంబాలు అనేక రకాలుగా బజారు పాలవుతున్నాయని తెలియజేసినారు .ము స్తాఫాపూర్ గ్రామంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ టి.సుధాకర్ మాట్లాడుతూ డ్రగ్స్ వివిధ రూపాల్లో అనగా చాక్లెట్స్,ఐస్ క్రీమ్,పౌడర్ ,సిగరెట్ ,సిరంజి ఇలాంటివి గ్రామ గ్రామాన దొరకడం వలన పాఠశాల విద్యార్థుల నుండి యువతి యువకులు విచ్చలవిడిగా వాడుతుండటం వల్ల కొద్ది నెలల్లోనే వివిధ అనారోగ్యలపాలై హాస్పిటల్స్ కు వస్తున్నారు. కొందరిని బ్రతికించలేని పరిస్థితులలో అవయవాలు అన్ని దెబ్బతింటున్నాయి అని అన్నారు. అంతే కాకుండా గంజాయి లాంటివి వాడటం వల్ల మెదడుపై తీవ్ర ప్రభావం చూపి ఏం చేస్తున్నారో తెలియని మత్తులోకి దిగజారి తల్లిదండ్రుల పట్ల,తోటి అక్క చెల్లెళ్ల పట్ల వావివరుసలు లేకుండా ప్రవర్తిస్తూ అత్యాచారాలు చేస్తున్నటువంటి సంఘటనలు చూస్తున్నాం అని అన్నారు. లోన్ యాప్స్,ఆన్లైన్ గేమ్స్,బెట్టింగ్స్ వాటిలో పాల్గొని అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. గ్రామాలలో విద్యార్థి యువత ఈ విధంగా బానిసలై అర్ధాంతరంగా తనవులు చాలుస్తున్నారు. అంటే ఒక భవిష్యత్తు తరం లేకుండా పోయే ప్రమాదం ఏర్పడింది. అందువల్ల తల్లులే ప్రధాన భూమిక వహించి పిల్లలను రక్షించుకోవాలని కోరారు. నేటి యాత్రలో కవ్వా లక్ష్మారెడ్డి,ఏపీఎం దేవానందం,ద్యాగాల సారయ్య, మేకల వీరన్న యాదవ్,చెప్యాల ప్రకాష్,ఇల్లందుల లక్ష్మణ్,ఎదులపురం తిరుపతి ,గాండ్ల పద్మ,కోడూరు శ్రీదేవి,దండి లక్ష్మి, మాట్ల వెంకటస్వామి,పెట్టం కుమారస్వామి, రేణిగుంట బిక్షపతి,ఉప్పుల కుమారస్వామి, వేముల జగదీష్, మాడుగుల ఈశ్వరయ్య,మంగ రామచంద్రం,సిసి మాడుగుల నాగమణి, బొల్లంపల్లి మమత,ఎర్ర కార్తీక్ పాల్గొన్నారు.

# దళారులను నమ్మి రైతులు మోసపోవద్దు

**ఎమ్మెల్యే జీ ఎస్సార్, కలెక్టర్ రాహుల్ శర్మ**

**చిట్యాల/మొగుళ్ళపల్లి (జనంసాక్షి)**



రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లో విక్రయించాలని భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు.

మంగళవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మొగుళ్లపల్లి మండలాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, కలెక్టర్ రాహుల్ శర్మ ప్రారంభించారు. అనంతరం వారు ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని సూచించారు. రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని అన్నారు. రైతులు పండించిన వరి ధాన్యమునకు బోనస్ రూ 500 ఈ రాష్ట్ర ప్రభుత్వం నేరుగా బ్యాంకు అకౌంట్లో వేస్తుందన్నారు. ధాన్యం కొనుగోలు వేగంగా, సమర్థంగా జరగాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించి,కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు ఎప్పటికప్పుడు ట్యాబ్ ఎంట్రీలు చేయాలని సూచించారు. కొనుగోలులో అధికారులు, సిబ్బంది జాగ్రత్తగా వ్యవహరించి, రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. ఇటువంటి చర్యల ద్వారా ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా, సమయానుకూలంగా జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఎఫ్ఏక్యూ వచ్చిన ధాన్యం కొనుగోలు లో జాప్యం చేయొద్దని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యం కేటాయించిన మిల్లులకు రవాణా చేయాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉండటం వల్ల అకాల వర్షాల ఇబ్బందులు వస్తాయని అన్నారు. తరుగు, తాలు పేరుతో రైతులను ఇబ్బంది పెడితే అధికారులదే భాద్యత అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, డిఆర్డీఓ నరేష్, పౌర సరఫరాల అధికారి శ్రీనాథ్, డిఎం రాములు, తహసిల్దార్ హేమ, మార్కెట్ కమిటీ చైర్మన్ గుమ్మడి శ్రీదేవి, సింగిల్ విండో చైర్మన్ తదితరులు పాల్గొన్నారు.

# పర్యవేక్షణ లోపం.. సిబ్బంది నిర్లక్ష్యం

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):**



**కాలు విరిగిందని వస్తే పట్టించుకోని వైనం**

జయశంకర్ భూపాలపల్లి జిల్లాకేంద్రం లోని వంద పడకల ఆసుపత్రిలో పర్యవేక్షణ లోపం, సిబ్బంది నిర్లక్ష్యం వెరసి రోగులు కష్టాల్లో కూరుకుపోతు న్నారు. నిరుపేదల సౌకర్యార్థం నిర్మిం చిన ఆసుపత్రిలో నిర్లక్ష్యపు నీడలు కమ్ముకు న్నాయి. అనారోగ్య కారణాలతో ఎంతో ఆశతో ఆసుపత్రికి వచ్చిన రోగులకు చేదు అనుభవాలు ఎదురవుతున్నాయి. బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని బావుసింగ్ పల్లి గ్రామానికి చెందిన అజ్మీర కళమ్మ అనే వృద్ధురాలు మంగళవారం ప్రమాదవశాత్తు కింద పడి కాలు విరిగిపోయింది. స్థానికుల సహాయంతో 108 వాహనంలో జిల్లాకేంద్రంలోని వంద పడకల ఆసుపత్రికి తరలించారు. కాగా కాలుకు అయిన గాయంతో నొప్పితో బాధపడుతున్న వృద్ధురాలును క్రిందకు దింపి ఆసుపత్రిలోనికి తీసుకెళ్లడానికి హాస్పిటల్ సిబ్బంది ఎవరు రాకపోవడంతో వృద్ధురాలి కోడలు, వదిన కలిసి స్ట్రక్చర్ పై ఎమర్జెన్సీ వార్డుకు తీసుకెళ్లారు. ఇదిలా ఉంటే డ్యూటీలో ఉన్న నర్సులు సైతం గంటన్నర అయినా రోగిని పట్టించుకోకపోవడంతో వారు హాస్పిటల్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సరైన పర్యవేక్షణ లేకపోవడంతో సిబ్బంది తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఆసుపత్రిలో వైద్య సేవలపై ఇంత నిర్లక్ష్యంగా వరిస్తున్న వారిపై ఉన్నతాధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

## కూరగాయలు కొన్న ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

**పాలకుర్తి, ఏప్రిల్ 22 (జనంసాక్షి)**



పాలకుర్తి నుండి జనగామ వెళ్లేమార్గంలో కోలుకొండ వద్ద ఎమ్మెల్యే యశస్విని రెడ్డి సాధారణ మహిళగా కూరగాయలు కొనుగోలు చేశారు. మార్గమధ్యంలో కూరగాయలు అమ్ముతున్న మహిళను చూసి కారును ఆపి, మాట్లాడుతూ కూరగాయలు కొనుగోలు చేశారు. "మంచిగా ఉన్నాయి, నేను ఎరిస్తా.. బిడ్డా అంటూ.. ఎమ్మెల్యే యశస్విని రెడ్డి కి కూరగాయలు అమ్మారు. ఎమ్మెల్యే యశస్విని కూడా సాధారణ గృహిణిలా మాట్లాడారు. ప్రజా సమస్యలు తెలుసుకుంటూ, తన కుటుంబ బాధ్యతలను కూడా సమర్థంగా నిర్వహిస్తున్న ఆమె నడవడిని చూసిన వారు ఆశ్చర్యపోయారు. ఈ దృశ్యాలు అక్కడి ప్రయాణికులను ఆకట్టుకున్నాయి.

## ఇంటర్మీడియట్ ఫలితాల్లో సాన్వి విద్యార్థుల అఖండ విజయం

**కరీంనగర్ బ్యూరో, ఏప్రిల్ 22 (జనంసాక్షి)**



: కరీంనగర్ రేకుర్తి సాన్వి జూనియర్ కళాశాల డిఫెన్స్ అకాడమీకి చెందిన విద్యార్థులు ఇంటర్మీడియట్ ఫలితాల్లో మంచి ఉత్తీర్ణత శాతంతో పాటు రాష్ట్ర స్థాయి ఉత్తమ మార్కులు సాధించారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో రాచకొండ రాజు 985, పల్లె శివరాం 975 మార్కులు, ప్రథమ సంవత్సరంలో ఎం పి సి లో పనస అజయ్ 464, దిడ్డి అభినయ్ 459, సీ ఈ సి లో దూలం సిద్దార్థ 474 మార్కులు సాధించి ప్రథమ స్థానాల్లో నిలిచారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను కళాశాల చైర్మన్ ఎర్రంశెట్టి మునిందర్ విద్యార్థులను వేరువేరుగా అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ ఎర్రంశెట్టి మునిందర్ మాట్లాడుతూ... సాన్వి జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ తో పాటు డిఫన్స్ ఉద్యోగాలకు సిద్ధమవుతూనే ఇంటర్మీడియట్లో రాష్ట్రస్థాయి మార్కులు సాధించడంతో పాటుగా, ఐ ఐ టీ వంటి పోటీ పరీక్షలలో కూడా ప్రతిభ కనబరచడం గర్వకారణంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు మోహన్ జనార్దన్, నవీన్ జగదీశ్వర్, మమతా పాల్గొని విద్యార్థులను అభినందించారు.

# ఇంటర్ ఫలితాలలో

## ఢిల్లీ జూనియర్ కళాశాల ప్రభంజనం



**కరీంనగర్ బ్యూరో, ఏప్రిల్ 22 (జనంసాక్షి)**

: మంగళవారం రోజు ఇంటర్ ఫలితాలలో ఢిల్లీ జూనియర్ కళాశాల (సి.సి.నెంబర్ 35361), కొత్తపల్లి విద్యార్థులు మొదటి సంవత్సరం లో ఎంపిసి లో 467, 466, 465 మార్కులు, ద్వితీయ సంవత్సరం ఎంపిసి లో 990, 989 మార్కులు సాధించారు. అదే విధంగా మొదటి సంవత్సరం సిఈసి లో 488 మార్కులు, ద్వితీయ సంవత్సరం సిఈసి లో 942 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిబ కనబరిచారని చైర్మన్ కొత్త సతీష్ రెడ్డి తెలిపారు. కళాశాల చైర్మన్ కొత్త సతీష్ రెడ్డి, ప్రిన్సిపాల్, అధ్యాపకులు ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించారు.

# ఉగ్రవాదుల దాడి పిరికిపంద చర్య

**కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్**

**హైదరాబాద్ఏప్రిల్ 22 (జనంసాక్షి)**

జమ్మూ కశ్మీర్‌లో ఉగ్రవాదుల దుశ్చర్యలో పర్యాటకుల మరణంపట్ల కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అమాయక పర్యాటకులపై ఉగ్రవాదుల కాల్పులు పిరికిపంద చర్య అని అభివర్ణించారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలియజేశారు. ఉగ్రవాద చర్యలు తమ సంకల్పాన్ని సడలించలేవని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో,

హోంమంత్రి అమిత్ షా దృఢమైన మార్గదర్శనంలో కేంద్ర ప్రభుత్వం ఈ పరిస్థితిని గమనిస్తూ ఉందన్నారు. ఈ దాడికి పాల్పడిన వారు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. మృతుల కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటామని పేర్కొన్నారు.

# పోషణ లోపం ఉన్న పిల్లలకు పౌష్టిక ఆహారం అందించండి

**వికారాబాద్ జిల్లా బ్యూరో ఏప్రిల్ 22 (జనం సాక్షి)**



:పోషణలోపం ఉన్న పిల్లలను గుర్తించి పోషక ఆహారంను అందించేలా తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించాలని శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ ఆవరణలో ఏప్రిల్ 8 నుండి 22 వరకు నిర్వహించే పోషణాపక్షం ఆరోగ్య ముగింపు ఉత్సవాల్లో చేవెళ్ల పార్లమెంటు సభ్యులు కొండ విశ్వేశ్వర్ రెడ్డి తో కలిసి సభాపతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ... పోషణ లోపం ఉన్న పిల్లలను గుర్తించి పర్యవేక్షణతో కూడిన అనుబంధ పోషక ఆహారం కార్యక్రమంలో నమోదుచేసి వారి పోషణ స్థితిని మెరుగుపరిచే విధంగా అవగాహన కల్పించాలన్నారు. పోషణ పక్షంలో భాగంగా ముఖ్యంగా మొదటి 1000 రోజుల పిల్లల ఆరోగ్య ప్రాముఖ్యతపై తెలియజేయాలని తెలిపారు. పోషణ ట్రాకర్ ఆప్ లో నమోదు చేసుకునే విధంగా లబ్దిదారులకు సూచించి అవగాహన కల్పించాలని ఆయన తెలిపారు. ఈ ఉత్సవాల భాగంగా అంగన్వాడీ కేంద్రాలలో ప్రీ స్కూల్ సంసిద్ధత కార్యకలాపాల దినోత్సవం సందర్భంగా చిన్నారులకు ప్రశంసా పత్రాలను స్పీకర్ అందజేశారు. ఈ సందర్భంగా అంగన్వాడి సూపర్వైజర్లు, టీచర్లు అంగన్వాడీలలో అందించే పోషక ఆహార పదార్థాలను తయారుచేసి స్టాళ్ల ద్వారా ప్రదర్శించారు.


వీటిని పరిశీలించిన సభాపతి వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, శాసనసభ్యులు

రామ్మోహన్ రెడ్డి, మనోహర్ రెడ్డి, అదటపు కలెక్టర్లు లింగ్యా నాయక్, సుధీర్, ఇంచార్జ్ డిడబ్ల్యుఓ జయసుధ, సిడిపిఓలు రజిత, వెంకటేశ్వరమ్మ, కాంతారావు, మెహరున్నీసా బేగం, ప్రవీణ, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# వా.. గుజరాత్ టైటాన్స్

### ఐపీఎల్ 2025 పాయింట్ల పట్టికలో అగ్రస్థానం





ఐపీఎల్ 2025 సీజన్‌లో గుజరాత్ టైటాన్స్ దూసుకెళ్తోంది. ఏప్రిల్ 21న కోల్కతా నైట్ రైడర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 39 పరుగుల తేడాతో విజయం సాధించి, 12 పాయింట్లతో పాయింట్ల పట్టికలో టాప్ స్థానాన్ని సుస్థిరం చేసుకుంది. 8 మ్యాచ్‌లలో 6 విజయాలు, 2 ఓటములతో ప్లేఆఫ్స్‌కు దగ్గరగా ఉంది.

**శుభ్‌మన్ గిల్: కెప్టెన్ సత్తా**

కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కేకేఆర్‌తో మ్యాచ్‌లో 55 బంతుల్లో 90 పరుగులు (10 ఫోర్లు, 3 సిక్సర్లు) చేసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. ఈ సీజన్‌లో 300 పరుగుల మార్క్ దాటిన ఏడో బ్యాటర్‌గా నిలిచాడు. అతని నాయకత్వం జట్టును ముందుండి నడిపిస్తోంది.

**సాయి సుదర్శన్: ఆరెంజ్ క్యాప్ హీరో**

ఓపెనర్ సాయి సుదర్శన్ ఈ సీజన్‌లో 400 పరుగుల మార్క్‌ను మొదట దాటిన బ్యాటర్‌గా రికార్డు సృష్టించాడు. కేకేఆర్‌తో మ్యాచ్‌లో 36 బంతుల్లో 52 పరుగులు చేసి, 417 పరుగులతో ఆరెంజ్ క్యాప్ సొంతం చేసుకున్నాడు.

**ప్రసిద్ధ్ కృష్ణ: పర్పుల్ క్యాప్ స్టార్**

బౌలర్ ప్రసిద్ధ్ కృష్ణ కేకేఆర్‌తో మ్యాచ్‌లో 2 వికెట్లు తీసి, 8 మ్యాచ్‌లలో 16 వికెట్లతో పర్పుల్ క్యాప్ హోల్డర్‌గా కొనసాగుతున్నాడు. అతని బౌలింగ్ జట్టు విజయాలకు కీలకం. 198/3 స్కోరుతో బలమైన టోటల్ నమోదు చేసిన గుజరాత్ టైటాన్స్, కేకేఆర్‌ను 159/8కు కట్టడి చేసింది. జోస్ బట్లర్ (41 నాటౌట్), రషీద్ ఖాన్ (2/25), మహ్మద్ సిరాజ్ వంటి ఆటగాళ్ల సమష్టి యత్నంతో జట్టు అగ్రస్థానంలో నిలిచింది. ఈ ప్రదర్శనలు గుజరాత్ టైటాన్స్ ఐపీఎల్ 2025లో ఎందుకు ఆధిపత్యం చెలాయిస్తోందో స్పష్టం చేస్తున్నాయి



# యువ అథ్లెట్ల కోసం శివం దూబె సాయం

ఏ వ్యక్తి అయినా ఎదగడం ముఖ్యమే. అదే సమయంలో జీవితంలో ఓ స్థాయికి చేరుకున్నాక ఇతరులకు చేయూతను అందించడం, అండగా ఉండటం, మిగిలిన వారి ఎదుగుదలకు కృషి చేయడం కూడా కీలకమే. ఇప్పుడు అలాంటి ఓ పని చేసి అందరితో శభాష్ అనిపించుకుంటున్నాడు టీమిండియా పేస్ ఆల్‌రౌండర్ శివమ్ దూబె. తమిళనాడులోని పలువురు ప్రతిభ కలిగిన యువ క్రీడాకారులకు సపోర్ట్‌గా ఉంటానంటూ ముందుకొచ్చాడతను. ప్రతిభ కలిగిన 10 మంది యువ అథ్లెట్లకు అండగా ఉంటానని హామీ ఇచ్చాడు దూబె. ఒక్కొక్కరికి రూ.70 వేల చొప్పున ఆ పది మంది క్రీడాకారులకు ఆర్థిక సాయం అందించాడు. తమిళనాడు స్పోర్ట్స్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ (టీఎన్ఎస్‌జేఏ) మంగళవారం నాడు నిర్వహించిన అవార్డ్స్ అండ్ స్కాలర్‌షిప్స్ కార్యక్రమంలో ఈ చెన్నై సూపర్ కింగ్స్ స్టార్ పాల్గొన్నాడు. చీఫ్ గెస్ట్‌గా హాజరైన దూబె.. యువ క్రీడాకారులను మెచ్చుకున్నాడు. వాళ్లకు టీఎన్ఎస్‌జేఏ రూ.30 వేలు చొప్పున స్కాలర్‌షిప్ అందించగా.. దూబె అదనంగా మరో రూ.70 వేలు ప్రకటించాడు. కాగా, స్కాలర్‌షిప్స్ అందుకున్న వారి జాబితాలో పీబీ అభినంద్ (టేబుల్ టెన్నిస్), కేఎస్ వెన్నియా శ్రీ (ఆర్చర్), ముత్తుమీనా వెల్లసామి (పారా అథ్లెటిక్స్), షమీనా రియాజ్ (స్క్వాష్) ఉన్నారు. వీళ్లతో పాటు ఎస్ నందన (క్రికెట్), కమలి పీ (సర్ఫింగ్), ఆర్ అభినయ (అథ్లెటిక్స్), ఆర్సీ జితిన్ అర్జునన్ (అథ్లెటిక్స్), ఏ తక్షాంత్ (చెస్), జయంత్ ఆర్కే (క్రికెట్) కూడా లిస్ట్‌లో ఉన్నారు.

## రాజస్థాన్ రాయల్స్‌పై ఫిక్సింగ్ ఆరోపణలు: యాజమాన్యం ఖండన

ఐపీఎల్ 2025 సీజన్‌లో ఏప్రిల్ 19న లఖ్‌నవూ వేదికగా జరిగిన లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌తో మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ 2 పరుగుల తేడాతో ఓడిపోయింది. ఈ మ్యాచ్‌పై రాజస్థాన్ క్రికెట్ అసోసియేషన్‌తాత్కాలిక అడాక్ కమిటీ కన్వీనర్ జయదీప్ బిహానీ ఫిక్సింగ్ ఆరోపణలు చేశారు. రాజస్థాన్ రాయల్స్, రాజస్థాన్ స్పోర్ట్స్ కౌన్సిల్, బీసీసీఐలు ఆర్‌సీఏ తాత్కాలిక కమిటీని ఐపీఎల్ కార్యకలాపాల నుంచి దూరం పెట్టేందుకు కుట్ర చేశాయని ఆయన ఆరోపించారు. రాజస్థాన్ రాయల్స్ యాజమాన్యం ఈ ఆరోపణలను తీవ్రంగా ఖండించింది. బిహానీ వ్యాఖ్యలు నిరాధారమైనవని, క్రికెట్ సమగ్రతను దెబ్బతీసేవని పేర్కొంది. జైపూర్‌లో ఐపీఎల్ మ్యాచ్‌ల నిర్వహణకు రాజస్థాన్ స్పోర్ట్స్ కౌన్సిల్, బీసీసీఐతో సమన్వయంతో పనిచేస్తున్నామని స్పష్టం చేసింది. బిహానీపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్య మంత్రి, క్రీడా మంత్రి, క్రీడా కార్యదర్శికి ఫిర్యాదు చేసింది. రాయల్స్ సీనియర్ అధికారి దీప్‌రాయ్ కూడా ఈ ఆరోపణలను తోసిపుచ్చారు. బిహానీ వ్యాఖ్యలు రాజస్థాన్ రాయల్స్, రాజస్థాన్ స్పోర్ట్స్ కౌన్సిల్, బీసీసీఐ ఖ్యాతికి నష్టం కలిగించాయని యాజమాన్యం ఆగ్రహం వ్యక్తం చేసింది.



# హైడ్రా వాదన నిజం..

- బతుకమ్మ కుంటకు న్యాయం
- చారిత్రక తీర్పు చెప్పిన సిటీ సివిల్ కోర్టు



హైదరాబాద్, ఏప్రిల్ 22 (జనంసాక్షి) : బతుకమ్మ కుంట విషయంలో హైడ్రా వాదన నిజమైంది. సుదీర్ఘ విచారణలో నిజమే గెలిచింది. మంగళవారం సిటీ సివిల్ కోర్టు చారిత్రక తీర్పునిచ్చింది. బతుకమ్మ కుంట చెరువు కాదు.. ఆ స్థలం నాదే అని కోర్టుకెక్కిన యెడ్ల సుధాకర్ రెడ్డి వాదనలో నిజం లేదని తేల్చి చెప్పింది. యెడ్ల సుధాకర్ రెడ్డి వేసిన పిటిషన్‌ను సిటీ సివిల్ కోర్టు డిస్మిస్ చేసింది. రెవెన్యూ రికార్డులు, విలేజ్ మ్యాప్‌లు, సేటిలైజ్ ఇమేజ్‌లు, సర్వే ఆఫ్ ఇండియా రికార్డుల ఆధారంగా బతుకమ్మ కుంటపై హైడ్రా తరఫు న్యాయవాదులు బలమైన వాదనలు వినిపించారు. దాదాపు నెల రోజుల పాటు వాదోపవాదాల అనంతరం సిటీ సివిల్ కోర్టు జడ్జి ఎం. వెంకటేశ్వర రావు బతుకమ్మ కుంటకు ప్రాణం పోస్తూ తీర్పునిచ్చారు. ఈ తీర్పుతో బతుకమ్మ కుంట అభివృద్ధి పనులకు ఆటంకాలు తొలిగాయి. నగరంలో చెరువుల అభివృద్ధికి శ్రీకారం చుట్టిన హైడ్రాకు ఈ తీర్పు ఊతమిచ్చినట్టయ్యింది. ఈ తీర్పును హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్వాగతించారు. హైడ్రా తరఫున వాదనలు వినిపించిన హైడ్రా, హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ స్టాండింగ్ కౌన్సిల్ మెంబర్లు కె. అనిల్‌కుమార్, ఎస్. శ్రీనివాస్, బి. అజయ్, ప్రభుత్వ తరఫు న్యాయవాది బి. జనార్ధన్, హైడ్రా లీగల్ అంశాలను పరిశీలిస్తున్న ఇన్‌స్పెక్టర్ మోహన్, హైడ్రా న్యాయ సలహాదారు శ్రీనివాస్‌తో పాటు అతని సహచర లాయర్లను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అభినందించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిశానిర్దేశంలో హైడ్రా ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నగరంలో చేపట్టిన 6 చెరువులలో బతుకమ్మ కుంట ఒకటి. హెచ్ఎండీఏ నిధులు సమకూర్చుతున్న ఈ చెరువుల అభివృద్ధి పనులు ఇప్పటికే ప్రారంభమైన విషయం విధితమే.

**ఫిబ్రవరిలో పనులు..**

ఫిబ్రవరి 18వ తేదీన బతుకమ్మ కుంట అభివృద్ధి పనులను హైడ్రా ప్రారంభించింది. మోకాలు లోతు మట్టి తీయగానే బిరబిరా గంగమ్మ బయటకొచ్చింది. బతుకమ్మ కుంట బతికే ఉందని నిరూపించింది. బతుకమ్మ కుంట కాదు.. ఇది మా స్థలమంటూ యెడ్ల సుధాకర్‌రెడ్డి చేసిన వాదనలో పస లేదని నాడే రుజువు చేసింది. అంబర్‌పేట మండలం, బాగ్‌అంబర్‌పేట్‌లోని సర్వే నంబరు 563లో 1962 -63 లెక్కల ప్రకారం బతుకమ్మ కుంట విస్తీర్ణం 14.06 ఎకరాలు కాగా.. బఫర్ జోన్‌తో కలిపి మొత్తం వైశాల్యం 16.13 ఎకరాలు. కబ్జాలకు గురై బతుకమ్మకుంట బక్క చిక్కిపోయి కేవలం 5.15 ఎకరాలుగా మిగిలిపోయింది. దీనిని అభివృద్ధి చేయాలని స్థానికులు హైడ్రాను ఆశ్రయించారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ క్షేత్రస్థాయిలో పరిశీలించి.. అక్కడ ఉన్న నివాసాల జోలికి వెళ్లకుండా ఉన్న స్థలంలోనే చెరువును అభివృద్ధి చేస్తామని చెప్పారు. దీంతో స్థానికుల నుంచి హైడ్రాకు పూర్తి మద్దతు లభించింది. మంగళవారం కోర్టు తీర్పుతో స్థానికులు సంబరాలు చేసుకున్నారు. వెంటనే పనులు చేపట్టి వర్షాకాలం నాటికి చెరువు అభివృద్ధి పనులు పూర్తి చేయాలని హైడ్రాను స్థానికులు కోరారు. వచ్చే బతుకమ్మ సంబరాలు అక్కడే చేసుకునేలా చెరువును అభివృద్ధి చేయాలని.. హైడ్రాకు పూర్తి సహకారం అందిస్తామని ముందుకొచ్చారు.

# సింగరేణి-ఆర్‌విఎన్‌ఎల్ ఒప్పందం ఫెడరల్ స్ఫూర్తికి నిదర్శనం

- రాష్ట్రాల పరస్పర సహకారంతో ఇంధన రంగంలో విప్లవం
- వచ్చే నెల 2వ వారంలో సింగరేణి థర్మల్ ప్లాంట్‌కు శంకుస్థాపన
- త్వరలో సంయుక్త భాగస్వామ్య కంపెనీ ఏర్పాటు, ఎండీ నియామకం
- రాజస్థాన్ విద్యుత్ శాఖ మంత్రి హీరాలాల్ నగర్‌తో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు భేటీ

హైదరాబాద్, ఏప్రిల్ 22 (జనంసాక్షి) :
తెలంగాణ, రాజస్థాన్ రాష్ట్రాల మధ్య సింగరేణి కొలియరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సీసీఎల్) మరియు రాజస్థాన్ రాజ్య విద్యుత్ ఉత్పాదన నిగమ్ లిమిటెడ్ (ఆర్‌వీయూఎన్ఎల్) మధ్య జరిగిన 3,100 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ ఒప్పందం ఇంధన రంగంలో విప్లవాత్మక మార్పులకు, రాష్ట్రాల పరస్పర సహకారానికి నిదర్శనమని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి శ్రీ భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఈ ఒప్పందం ఫెడరల్ స్ఫూర్తిని ప్రతిబింబిస్తుందని, దీన్ని వేగంగా అమలు చేసేందుకు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో రాజస్థాన్ విద్యుత్ శాఖ మంత్రి హీరాలాల్ నగర్‌తో జరిగిన సమావేశంలో వెల్లడించారు.

ఈ ఒప్పందంలో భాగంగా తెలంగాణలో 1,600 మెగావాట్ల థర్మల్ ప్లాంట్‌లో ఒకటైన 800 మెగావాట్ల సింగరేణి అల్ట్రా సూపర్ క్రిటికల్ థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణానికి 2025 మే రెండో వారంలో శంకుస్థాపన చేయాలని డిప్యూటీ సీఎం అధికారులను ఆదేశించారు. ఈ ప్లాంట్ నిర్మాణ బాధ్యతను భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (బీహెచ్ఈఎల్)కు అప్పగించా రు. అలాగే, 3,100 మెగావాట్ల ప్రాజెక్ట్ కోసం సంయుక్త భాగస్వామ్య కంపెనీని తక్షణం ఏర్పాటు చేయాలని, దీనికి మేనేజింగ్ డైరెక్టర్ నియామకాన్ని వేగవంతం చేయాలని నిర్ణయించారు. రాజస్థాన్‌లో 1,500 మెగావాట్ల సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు భూ పరిశీలన పూర్తయిందని, మరోసారి అధికారుల బృందం పరిశీలించి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని భట్టి



ఆదేశించారు. ఈ ప్రాజెక్టులతో ఇరు రాష్ట్రాలు ఇంధన రంగంలో స్వయం సమృద్ధి సాధించగలవని, తెలంగాణ రాష్ట్రం ఐదేళ్లలో 20,000 మెగావాట్ల హరిత ఇంధన ఉత్పత్తి లక్ష్యంతో ముందుకు సాగుతోందని తెలిపారు.

రాజస్థాన్ మంత్రి హీరాలాల్ నగర్ ఈ ప్రాజెక్టు పురోగతిపై సంతృప్తి వ్యక్తం చేస్తూ, ఆర్‌వీయూఎన్ఎల్ నుంచి సమన్వయ అధికారులను నియమించినట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఆర్థిక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, సింగరేణి సీఎండీ ఎన్. బలరామ్, ఆర్‌వీయూఎన్ఎల్ చీఫ్ ఇంజినీర్ వీపీ గార్గ్ తదితరులు పాల్గొన్నారు.

## గెలవాలనే తపన లేదు: సురేశ్ రైనా

ఐపీఎల్‌లో ఐదుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్కే) ఈ సీజన్‌లో ఘోరంగా విఫలమవుతోంది. ఎనిమిది మ్యాచ్‌లు ఆడిన చెన్నై కేవలం రెండు విజయాలతో పాయింట్ల పట్టికలో అట్టడుగున నిలిచింది. జట్టు ఆటతీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సీఎస్కే మాజీ ఆటగాడు సురేశ్ రైనా, జట్టు ఎంపిక సరిగాలేదని, గెలవాలనే తపన లేదని విమర్శించాడు. సాయి సుదర్శన్, సాయి కిశోర్ వంటి స్థానిక ప్రతిభావంతులను మెగా వేలంలో తీసుకోకపోవడం బలహీనతగా చెప్పాడు.

# ఇంటర్మీడియట్ ఫలితాలలో శ్రీ చైతన్య విద్యాసంస్థల విజయభేరి

**శ్రీ చైతన్య విద్యాసంస్థల అధినేత ముద్దసాని రమేష్ రెడ్డి**



కరీంనగర్ బ్యూరో, ఏప్రిల్ 22 (జనంసాక్షి) : మంగళవారం రోజున ప్రకటించినబడిన ఇంటర్ -2025 ప్రథమ, ద్వితీయ ఫలితాలలో మా కరీంనగర్ శ్రీచైతన్య విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి విజయభేరి మ్రోగించారు. బుదవారం రోజు ప్రకటించిన ఫలితాలలో శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీ చైతన్య విద్యాసంస్థల అధినేత ముద్దసాని రమేష్ రెడ్డి అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను బొకెలతో సత్కరించారు. విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా అభ్యసించి గణనీయమైన మార్కులు సాధించి మెరుగైన ఫలితాలను రాబట్టారు. అంకిత భావంతో కృషి చేస్తే సాధించలేనిది ఏదీ లేదని నిరూపించారు. ప్రతిభావంతుల వివరాలు రెండవ సంవత్సర ఫలితాలలో యం.పి.సి విభాగంలో 1000 గాను ఆర్ వైష్ణవి 993, ఎ. లాస్యికా 992, జి. శ్రీనిత్య 991, పి. భరత్ రెడ్డి 991, ఇ. అకిరానందన్ 991, బైపిసి విభాగంలో ఎ. అభ్యుదయ 994, ఎన్. భార్గవి 992, పి. స్ఫూర్తిశ్రీ 990, బి. రోహిత్ 990. సిఇసి విభాగంలో ఎ. మధుమిత 961, యంఇసి విభాగంలో మెరుగు భానుప్రకాశ్ 951. మొదటి సంవత్సర ఫలితాలలో యం.పి.సి. నందు ఎ. లక్ష్మీహసిని 468, జి. శ్రీహిత 467, పి. హాసిని రావు 467, యం. సాత్విక 467, జి. శ్రీనిధి 467, కె. మైత్రి 467, 466 నందు 22 విద్యార్థులు మరియు 465 నందు 14 విద్యార్థులు బైపిసి విభాగంలో ఈ. అఖిల 437, ఔష సినివాసన్ 437, యస్ విష్ణు 436, వి. లహరి 436, అర్ అక్షయశ్రీ 436, సిహెచ్. కార్తిక్ 436 మరియు 430 పైగా మార్కులు సాధించిన విద్యార్థులు 13, యంఇసి. విభాగంలో ఎల్ కమలేశ్ కుమార్ 474, సూర మనీష 470. సిఇసి విభాగంలో టి. హరిణి 492, కె. అంజలి 491 మార్కులు సాధించారు. నాణ్యమైన కార్పోరేట్ స్థాయి విద్యను ఉత్తర తెలంగాణ ప్రాంత విద్యార్థులకు అందించాలనే ఉద్దేశ్యంతో శ్రీ చైతన్య విద్యాసంస్థలు నడుస్తున్నాయని తెలిపారు. శ్రీచైతన్య గ్రూఫ్ అఫ్ జూనియర్ కళాశాలలు స్థాపించిన నాటి నుండి రాష్ట్ర స్థాయి ర్యాంకులకు కేరాఫ్గా నిలవడం సంతోషంగా ఉందన్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యార్థుల బంగారు భవిష్యత్ కు బాటలు వేస్తున్నామని తెలిపారు. పటిష్టమైన ప్రణాళికలతో పాటు నిరంతర పర్యవేక్షణ, అధ్యాపకుల అత్యుత్తమ బోధన విద్యార్థులు పట్టుదల, అహర్నిషల కృషి ఫలితంగా శ్రీ చైతన్య జూనియర్ కళాశాలల విద్యార్థులు రాష్ట్ర స్థాయి మార్కులు , అత్యుత్తమ ఫలితాలతో విజయం సాధించారని తెలిపారు. ప్రతి ఏడాది ఎంసెట్, నీట్, ఐఐటి జెఈఈ పోటి పరీక్షలలో విద్యార్థులు ర్యాంకులు సాధించి శ్రీచైతన్య ఆణిముత్యాలుగా నిలుస్తున్నారని తెలిపారు. అత్యున్నత ఫలితాలు సాధించిన విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు, ఈ ఘన విజయంలో పాలు పంచుకున్న తమ అధ్యాపక బృందానికి అభినందనలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో శ్రీ చైతన్య కళాశాలల డైరెక్టర్ కర్ర నరేందర్ రెడ్డి, డీన్ జగన్ మోహన్ రెడ్డి, జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్స్ మల్లారెడ్డి, రాధాక్రిష్ణ, మోహన్ రావు, ఎజియం శ్రీనివాస్, అధ్యాపక , అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

# ఇంటర్ ఫలితాల్లో జాగృతి విజయకేతనం

- పేదవిద్యార్థుల్లో ఉన్న ప్రతిభను గుర్తించడమే మా జాగృతి లక్ష్యం
- ప్రిన్సిపల్ అంబటి వినోద్ కుమార్



వనపర్తి బ్యూరో, ఏప్రిల్ 22 జనంసాక్షి :
2025 విద్యా సంవత్సరం ఇంటర్మియట్ పబ్లిక్ పరీక్షల యందు మొదటి, రెండవ సంవత్సరం ఫలితాల్లో వనపర్తి జాగృతి కళాశాల విద్యార్థులు మరోసారి ప్రభంజనం సృష్టించారని ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సన్మాన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అంబటి వినోద్ కుమార్ మంగళవారం అన్నరు. జాగృతి కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి,ఉమ్మడి జిల్లా స్థాయి టాప్ మార్కులతో మరొకసారి ప్రభంజనం సృష్టించారని ఇంటర్ సెకండ్ ఇయర్ ఎంపీసీ లో ఎమ్.చరిత 1000 మార్కులకు గాను 995సాధించగా కే.భవ్య 992,బి.శ్వేత 989, డి.భవ్య శ్రీ 989, కే.మేఘన,988,జి.శ్వేత 988, వై.నర్మద 988 ఆర్. ప్రవళిక 988 సాధించారరి. అలాగే సెకండియర్ బైపీసీలో ఏ. జ్ఞానేశ్వరి 1000మార్కులకు గాను 988 సాధించగా ఎమ్.లిఖితాంజలి 981సాధించింది. సీఈసిలో బి. సురేష్ 957, యూ. సుమంత్ 951 మార్కులతో రాష్ట్రస్థాయి ర్యాంకులతో విజయఢంకా మోగించారని వినోద్ కుమార్ తెలిపారు.

ఇంటర్ ఫస్టియర్ ఎంపీసీ లో 470 మార్కులకు గాను పి. లావణ్య 468 సాధించగా..కే. అపూర్వ 467, ఎన్. వేణుప్రసాద్ 467, సిహెచ్. అర్జున్ 466, టీ.పరుషరాముడు 464, బాలసిద్దార్థ 464, లాల్ సింగ్ 464, త్యాగరాజు 463, నాగచైతన్య 463, వెంకట్ రాముడు 462, ఇంద్ర 462, శ్రీజ 462, నారీస్ సాహితి 461, రాంతేజ 461 రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించి ప్రభంజనం సృష్టించారు. బైపిసిలో అర్చన 440 మార్కులకు గాను 433, నస్రీన్ భాను 432, అనుశ్న 432, వైష్ణవి 432 మార్కులను సాధించి మరొకసారి వనపర్తి జిల్లాలో సత్తాను చాటారు.అదేవిధంగా ఎం ఈ సి 487 సిఈసిలో ఎమ్. శ్రీలత 465, అశోక్ 461 మార్కులతో ఉమ్మడి జిల్లా టాపర్లుగా నిలిచారు అని తెలియజేయుటకు ఎంతో సంతోషిస్తు న్నాము అని ఆయన అన్నారు.రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపల్ అంబటి.వినోద్ కుమార్ యజమాన్య సభ్యులు భాస్కర్,శ్యామ్ కుమార్, సత్యనారాయణ బొకె, శాలువలతో సత్కరించి మెమెంటోలనుఅందించారు. మంచి ఫలితాలతో స్టేట్ ర్యాంకులను, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ఫస్ట్ ర్యాంకులను సాధిస్తూ ఉమ్మడి జిల్లాలో సంచలనాలు సృష్టిస్తున్న ఏకైక కళాశాల జాగృతి కళాశాల అని ఆనందాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యజమాన్య సభ్యులు, అధ్యాపక అధ్యాపకేతర బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# నూతన ప్రజాస్వామిక విప్లవమే లక్ష్యంగా పనిచేయాలి


### సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఏ.లాల్ కుమార్



ప్రత్యేక ప్రతినిధి/ జనం సాక్షి :
మార్క్సిస్టు మహోపాధ్యాయులు కామ్రేడ్ లెనిన్ జయంతిని పురస్కరించుకొని సిపిఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ పార్టీ కార్యాలయం మార్క్స్ భవన్‌పై సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఏ. లాల్ కుమార్ జెండా ఆవిష్కరించడం జరిగింది. ఆవిర్భావ వేడుకల సందర్భంగా న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఏ. లాల్ కుమార్ మాట్లాడుతూ....లి భూమి, భుక్తి, ఈ దేశ విముక్తి కోసం 1969లో రివిజనిస్టుల నుండి విప్లవకారులు విడువడి నూతన ప్రజాస్వాముక విప్లవమే లక్ష్యంగా, ప్రతిఘటన పోరాట సిద్ధాంత వెలుగులో విప్లవకారులు పనిచేస్తున్నారన్నారు. దేశంలో ప్రజలందరూ వర్గాలు లేని సమాజంగా, సమానత్వపు సమాజాన్ని, దోపిడీ, పీడన, దౌర్జన్యం, అన్యాయం లేని నూతన సమాజాన్ని నెలకొల్పడమే లక్ష్యంగా పనిచేస్తున్నారన్నారు. అనేకమంది ప్రజల కోసం పనిచేసి తమ అమూల్యమైన జీవితాలను, ప్రాణాలను త్యాగం చేశారన్నారు. భారతదేశం అర్ధ వలస, అర్ధ భూస్వామ్య దేశంగా ఏర్పడి భూస్వాముల చేతిలో భూములను, ప్రజా సంపదను కార్పొరేట్ కంపెనీలకు, గుత్త పెట్టుబడిదారులకు, బహుళ జాతి కంపెనీలకు కట్టబెడుతూ వస్తున్నారన్నారు. దేశంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న పాలకులు, ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలతో దళారీ ప్రభుత్వాలుగా మారిపోయాయన్నారు. ఎన్నికల నాడు అనేక ఉచిత వాగ్దానాలు చేసి అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. దేశంలో ప్రజలందరికీ దున్నేవానికి భూమి కావాలి, ఉండటానికి ఇల్లు కావాలి, తినడానికి తిండి కావాలి, కట్టుకోవడానికి బట్ట కావాలి, చదువుకున్న వారికి ఉద్యోగం కావాలన్నారు. ప్రజలందరికీ సరైన విద్యా, వైద్య సదుపాయాలు కావాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనేక వాగ్దానాలు చేసి రైతాంగాన్ని, ప్రజలను మోసం చేశారన్నారు. రైతాంగం పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక అప్పుల పాలవుతున్నా.... పాలకులు కనీసం పట్టించుకోవడం లేదన్నారు. వేసవికాలం తీవ్రమై మంచినీటి సమస్య తీవ్రమైనా కనీసం గ్రామాలలో పట్టించుకునే పరిస్థితులు లేవన్నారు. గ్రామపంచాయతీ ఎన్నికలు పెట్టలేనటువంటి స్థితిలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉందన్నారు. గ్రామాలలో పాలకవర్గాలు లేక అధికారులు, అధికార యంత్రాంగం, అధికార పార్టీ నాయకులు ఆడిందే ఆటగా.. పాడిందే పాటగా.. ఏర్పడి ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారన్నారు. వెంటనే ప్రజా సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ప్రజా వ్యతిరేకమైన విధానాలను అవలంబిస్తే గత పాలకులకు పట్టిన గతే మీకు పడుతుందని హెచ్చరించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం మతోన్మాద ఫాసిస్టు భావజాలాన్ని రోజు రోజుకు విస్తరిస్తుందన్నారు. దేశ సంపదను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టటమే, అంబానీ, ఆదానీలను మరింత ధనవంతులుగా మార్చడమే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. దేశ ప్రజలను ఊచకోత కోయడమే లక్ష్యంగా కగార్ పేరుతో మధ్యభారతంలో ఆదివాసీలను చిత్రహింసలకు గురిచేసి బూటకపు ఎన్కౌంటర్ల పేరుతో హత్యలు చేస్తున్నారన్నారు. గుజరాత్ లో మారణహోమం, కాశ్మీర్ లో కల్లోలం, మణిపూర్ లో భరతమాత బట్టలు విప్పి నడిబజారులో నిలబెట్టిన బిజెపి ప్రభుత్వం దేశానికి ప్రమాదకరంగా మారిందని పేర్కొన్నారు. అమాయకులైన ఆదివాసీలను, ప్రశ్నించే వారిని, మేధావులను చిత్రహింసలకు గురిచేస్తూ జైళ్లలో నిర్భంధిస్తూ, నక్సలైట్ల పేరుతో చంపేస్తున్నారన్నారు. కమ్యూనిస్టులను, పేద ప్రజల కోసం మాట్లాడే వారిని, హక్కుల గురించి మాట్లాడే వారిని 2026 మార్చి నెల చివరి వరకు చంపేస్తాం అంటూ ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాగాన్ని ధిక్కరించి మాట్లాడడం ప్రజలు గమనించి ఎండగట్టాలన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న ప్రగతిశీల శక్తులు ఐక్యం కావలసిన అవసరం ఉందన్నారు. ప్రజలందరూ చైతన్యంతో నూతన ప్రజాస్వాముక విప్లవమే లక్ష్యంగా పనిచేయాలని." పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అరుణోదయ రాష్ట్ర నాయకులు వి. మల్లన్న, పి ఓ డబ్లు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎం జ్యోతి, పిఓడబ్లు జిల్లా కార్యదర్శి అరుణ ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు సురేందర్, భూతగడ్డ చిన్నయ్య, రాజేశం, సయ్యద్, షబ్బీర్, పివైఎల్ నాయకులు ప్రవీణ్, ధర్మ, దతదితరులు పాల్గొన్నారు.


# రైతులకు ఇబ్బంది కలుగకుండా ధాన్యం సేకరించాలి

**రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా.**



రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 22 (జనంసాక్షి) :
రాజన్న సిరిసిల్ల జిల్లాలో యాసంగి పంట కొనుగోలులో రైతులకు ఇబ్బంది కలగకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే నాణ్యమైన వరి ధాన్యాన్ని సత్వరమే కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అధికారులను ఆదేశించారు.మంగళవారం జిల్లా కలెక్టరేట్ లోని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ ధాన్యం కొనుగోలు పై సంబంధిత అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియ జిల్లాలో జరగాలన్నారు.కొనుగోలు చేసిన ధాన్యానికి వెంటనే చెల్లింపులు పూర్తి చేయాలన్నారు.మన జిల్లాలో ఇప్పటి వరకు 241 కొనుగోలు కేంద్రాలకు గాను 239 కేంద్రాల ప్రారంభం చేసి 198 కొనుగోలు కేంద్రాల నుంచి 16 వేల 22 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, కొనుగోలు చేసిన ధాన్యానికి డబ్బులు వెంటనే జమ అయ్యేలా చూడాలన్నారు.సివిల్ సప్లైస్ డిప్యూటీ తహసిల్దార్లు సిరిసిల్లలో అపెరల్ పార్క్ లో మరియు ఇతర చోట్ల అవసరమైన ఇంటర్మీడియట్ గోదాములను గుర్తించి ధాన్యం తరలింపు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.కొనుగోలు కేంద్రాలకు ట్యాగ్ చేసిన రైస్ మిల్లర్లకు సామర్థ్యం ప్రకారం ధాన్యం అలాట్మెంట్ చేయాన్నారు. మిల్లు అలాట్మెంట్ కాని కోనుగోలు కేంద్రాలకు సమీపంలో గల అపెరల్ పార్క్‌లో ఇంటర్మీడియట్ గోదాము నందు ధాన్యం భద్రత కోసం బుక్ చేయాలన్నారు. కోనుగోలు కేంద్రాలలో నాణ్యత ప్రమాణాలు పరిశీలించి, భారత ఆహార సంస్థ నిర్దేశించిన నాణ్యత ప్రమాణాలు ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలన్నారు.జిల్లాలో నిర్దేశించుకున్న లక్ష్యం మేరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను పూర్తి స్థాయిలో ప్రారంభించాల న్నారు. ఈ సమీక్షా సమావేశంలో డిఆర్డిఓ శేషాద్రి, డిఏఓ అఫ్జలి బేగం, జిల్లా సహకార అధికారి రామకృష్ణ, పౌరసరఫరాలశాఖ అధికారులు రజిత,వసంతలక్ష్మి పాల్గొన్నారు.

# 14 గ్రామాలదీ ఒకే మాట!





## ఇథనాల్ ఫ్యాక్టరీ వద్దంటే వద్దంటూ ముక్తకంఠం

- ఆర్డీవో సమక్షంలో చర్చల్లో తేల్చిచెప్పిన ప్రజలు
- మేలే జరుగుతుందన్న యాజమాన్యం వివరణను తోసిపుచ్చిన రైతులు
- వ్యతిరేకత ఉన్నప్పుడు పరిశ్రమ ఎలా వేస్తారని ప్రశ్నించిన ఆర్డీవో



**గద్వాల, ఏప్రిల్ 22 (జనంసాక్షి) :** పెద్దధన్వాడ ఇథనాల్ ఫ్యాక్టరీ విషయంలో గత కొన్ని నెలలుగా ప్రజలందరిదీ ఒకేమాట, ఒకేబాటగా మరోసారి నిరూపితమైంది. ఎన్నిచెప్పినా, ఎన్నిచూపినా ఫ్యాక్టరీని ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని వెల్లడిరచారు. ప్రాణాలను, పంటలను ఫణంగా పెట్టి ఫ్యాక్టరీని రానిచ్చే ప్రసక్తే లేదంటూ మూకుమ్మడిగా పేర్కొన్నారు. ఇటీవల చర్చల పేరిట పెద్దధన్వాడకు వచ్చిన తహసీల్దార్ ఆదేశాల మేరకు పలు గ్రామాలకు చెందిన ప్రజలు జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో ఆర్డీవో కార్యాలయానికి మంగళవారం పెద్దఎత్తున చేరుకున్నారు. ఆర్డీవో టి శ్రీనివాస్ సమక్షంలో పలు గ్రామాల యువ విద్యావంతులు సహా ఇథనాల్ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు, రైతులతో కలిసి ఇథనాల్ కంపెనీకి చెందిన ప్రతినిధులతో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా దాదాపు మూడు గంటలపాటు నిరంతరాయ అభిప్రాయ సేకరణ కొనసాగినప్పటికీ.. ప్రజలందరూ ఫ్యాక్టరీ వద్దంటే వద్దే వద్దు అంటూ తేల్చిచెప్పారు.

ఇథనాల్ కంపెనీకి చెందినవారు 'ఫ్యాక్టరీతో స్థానిక ప్రాంతాలకు ఎలాంటి నష్టం ఉండదు. మేలే జరుగుతుంది' అని పేర్కొన్నప్పటికీ ప్రజలు నిర్ద్వంద్వంగా తోసిపుచ్చారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల్లో ఇథనాల్ ఫ్యాక్టరీల వల్ల జరిగిన నష్టాలను పోరాట కమిటీ సభ్యులు ఉదహరించారు. తమ వద్ద ఆధారాలతో సహా అక్కడ జరిగిన విధ్వంసం తాలూకు వివరాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఒక్క కంపెనీ కోసం 14 గ్రామాలను నాశనం చేస్తారా అని ప్రశ్నలు లేవనెత్తారు. తాగు, సాగుకే నీరు సరిపడక అనేక ఇబ్బందులు తలెత్తుతుంటే.. కంపెనీ కోసం నీళ్లిచ్చి తామెట్లా బతికేది, పంటలెలా పండిచ్చేదని నిలదీశారు. దీనికి రైతులు కూడా గొంతు కలిపారు. ఫ్యాక్టరీ కట్టేందుకు కొన్న భూములు అమ్మి వెళ్లిపోండి.. లేదా మా ఊర్లన్నీ మొత్తం కొనండి, ఇక్కడ్నుంచి వెళ్లిపోతాం అంటూ కంపెనీవారికి తేల్చిచెప్పారు. సమావేశం ఆసాంతం ప్రజలందరూ ఒకేతాటిపై ఉండటంతో కంపెనీవారు సైతం మిన్నకుండిపోయారు. ముగింపుగా ఆర్డీవో స్పందిస్తూ.. ఇథనాల్ ఫ్యాక్టరీని గ్రామాలన్నీ వ్యతిరేకిస్తున్నప్పుడు ఎలా నిర్మిస్తారని సదరు కంపెనీవారిని ప్రశ్నించారు. ఈ చర్చల సమావేశంలో రాజోలి ఎమ్మార్వో రామ్మోహన్, రాజోలి ఆర్ఐ శ్రీకాంత్, శాంతినగర్ సీఐ టాటాబాబు, రాజోలి ఎస్సై జగదీశ్వర్, ఇథనాల్ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు, పెద్దధన్వాడ, చిన్న ధన్వాడ, నసనూరు, మాన్‌దొడ్డి, చిన్నతాండ్రపాడు, రాజోలి, తుమ్మిళ్ల, వేంసోంపురం, కేశవరం గ్రామాలకు చెందిన చిన్నయ్య, తిమ్మారెడ్డి, పరమేశ్‌గౌడ్, భాస్కర్, కుమార్, యోహన్, రాజు, జయరాంరెడ్డి, పవన్, ఎల్లప్ప, నాగేశ్, నారాయణ, నాగరాజు, అలెగ్జాండర్, మల్లేశ్, బీరప్ప, ఖలీల్, నర్సింహులు, శేషిరెడ్డి, రవి, సంజీవరెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, బాబురావు, మద్దిలేటి, వెంకటరాములు, బాబు, చంద్రన్న, ఉస్మాన్, కుమార్ నాయుడు, శాంతన్న, యువరాజు, శేఖర్, తిరుమలేశ్, మార్క్, వీరేశ్, మధు, మక్బుల్ భాషా, తిమ్మప్ప, రఘునందర్ రెడ్డి, విక్రమ్, సత్యారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, సత్యనారాయణ, లక్ష్మన్న, సునీల్, భీముడు, నాగేశ్, దస్తగిరి, షెడ్రెక్, సత్యనారాయణ రెడ్డి, గురుశేఖర్, యువత పెద్దఎత్తున పాల్గొన్నారు.





## చెన్నమనేని రమేష్ బాబుపై సిఐడి కేసు



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 22 (జనంసాక్షి):** వేములవాడ నియోజకవర్గం నుండి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన చెన్నమనేని రమేష్ బాబు పై మంగళవారం సిఐడి కేసు నమోదు చేసింది. భారత పౌరసత్వం లేకున్నా తప్పుడు పత్రాలతో ఎన్నికలలో పోటీ చేశారని ఆది శ్రీనివాస్ ఆరోపణ చేశారు. సోమవారం హైకోర్టు తీర్పు మేరకు రూ 30 లక్షలు చేన్నమనేని రమేష్ బాబు జరిమాన చెల్లించారు. వీటిలో 25 లక్షలు ఆది శ్రీనివాస్ కు,మరో ఐదు లక్షలు హైకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీ చెల్లించారు.చెన్నమనేని రమేష్ బాబు పై చర్యలు తీసుకోవాలని ఆది శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు రమేష్ బాబు పై సిఐడి అధికారులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. చేన్నమనేని రమేష్ బాబుకు సంబంధించిన పూర్తి వివరాలు అందించేందుకు సిఐడి అధికారుల ముందు ఆది శ్రీనివాస్ హాజరు కానున్నారు.

## ఉపాధి హామీ పని దినాల్లో కేంద్రం భారీ కోత

- రాష్ట్ర కూలీలకు గుండె కోత
- ఒక కోటి 50 లక్షల పని దినాలను తగ్గించిన కేంద్ర ప్రభుత్వం
- రాష్ట్రానికి 10 కోట్ల పని దినాలు కల్పించాలి
- రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ జీ. చిన్నారెడ్డి



**హైదరాబాద్, ఏప్రిల్ 22 (జనంసాక్షి) :** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పని దినాల్లో కేంద్ర ప్రభుత్వం ఒక కోటి 50 లక్షల పని దినాల కోత విధించి కూలీ పనులు చేసే వారికి గుండె కోతకు గురిచేస్తోందని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పథకం ద్వారా పూట గడుపుకునే కూలీలకు కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం షరాఘాతంగా మారిందన్నారు. రాష్ట్రానికి 12 కోట్ల పని దినాలు కల్పించాలని కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపగా.. కేవలం 6.5 కోట్ల కొన్ని దినాలు మాత్రమే కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసి కూలీ పనులు చేసుకునే వారి కుటుంబాలకు తీరని అన్యాయం చేసిందని చిన్నారెడ్డి ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం కక్ష పూరిత విధానాలతో రాష్ట్ర ప్రభుత్వంపై అక్కసు వెళ్ళగక్కుతోందని, అందుకు తాజా నిదర్శనం ఉపాధి హామీ పథకంలో ఒక కోటి 50 లక్షల పని దినాలు కుదించడమేనని చిన్నారెడ్డి పేర్కొన్నారు. గత నాలుగు సంవత్సరాల నుంచి రాష్ట్రంలో వరుసగా ప్రతిఏటా 10 కోట్ల ఉపాధి హామీ పని దినాలు జరుగుతున్నాయని రాష్ట్రంలో ఉపాధి హామీ పథకం పనులు విజయవంతంగా కొనసాగుతున్నాయని చిన్నారెడ్డి వివరించారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పని దినాలలో కోత విధించడం వల్ల కూలీలకు పనులు లభించగా వలస వెళ్లాల్సిన దుస్థితి కలుగుతోందని చిన్నారెడ్డి అన్నారు. రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ వెంటనే కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడాలని, ఉపాధి హామీ పనుల్లో రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయంపై నోరు విప్పాలని చిన్నారెడ్డి డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకం కింద పది కోట్ల పని దినాలు కల్పించాలని చిన్నారెడ్డి ఒక ప్రకటనలో కేంద్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత

- మంత్రి కొండా సురేఖ



**హైదరాబాద్, ఏప్రిల్ 22 (జనంసాక్షి) :** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్క పౌరుడి బాధ్యత అని రాష్ట్ర పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖ శ్రీమతి మంత్రి కొండా సురేఖ గుర్తు చేశారు. మంగళవారం ప్రపంచ ధరత్రీ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ లో ఎర్త్ డే - స్టూడెంట్, యూత్ ఇన్ యాక్షన్ పోస్టర్‌ను ఆమె విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూమి సమస్త జీవరాశులకూ ఆధారమని పేర్కొన్నారు. పుడమి తల్లి మానవాళి జీవనానికి అవసరమై గాలి, నీరు, ఆహారం, ఉపాధి కల్పిస్తోందన్నారు. వాతావరణ మార్పులు వంటి ఇతరత్రా చర్యలతో ప్రకృతి వనరులు విధ్వంసానికి గురవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంధనాలు, గ్రీన్‌హౌస్ వాయువుల వినియోగాన్ని గణనీయంగా తగ్గించుకోవాలని సూచించారు. అలాగే, సౌర-పవన విద్యుత్ వంటి పునరుత్పాదక ఇంధనాలను పెంచుకోవాలన్నారు. రానున్న రోజుల్లో భూమిని కాపాడుకునేందుకు సోలార్ ఎనర్జీ చాలా అవసరమని, సోలార్ ఎనర్జీని ప్రోత్సాహించేందుకు దేవాదాయ శాఖకు చెందిన భూముల వినియోగంపై చర్యలు తీసుకుంటున్నట్టు మంత్రి సురేఖ తెలిపారు. ప్రతి ఒక్కరూ సోలార్ ఎనర్జీని వినియోగించుకునే విధంగా అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని, తద్వారా పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాని ఆమె పిలుపునిచ్చారు.




## నిజామాబాద్ జిల్లాకు పూర్వవైభవం తీసుకువస్తాం



- పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

**నిజామాబాద్, ఏప్రిల్ 22 (జనంసాక్షి) :** నిజామాబాద్ జిల్లాకు పూర్వవైభవం తీసుకొస్తామని పీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. నిజామాబాద్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వారిరువురు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్‌గౌడ్ మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లాలో రైతులకు అవగాహన కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం శాస్త్రవేత్తలు,ఆదర్శరైతులు,అనుభవజ్ఞులైన నిపుణులతో మూడు రోజుల పాటు రైతు మహోత్సవ కార్యక్రమం చేపట్టిందని, రైతే దేవుడు అని నమ్మి రైతు క్షేమంగా ఉండాలని కోరుకునే ప్రభుత్వం మాది అని ఆయన అన్నారు. బీఆర్ఎస్ బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు రైతులు వరి కుప్పల మీద వేచి చూసిన తరుణాలు ఎన్నో జరిగాయని, రైతుల మీద లాటి చార్జీలు, బేడీలు వేసిన చరిత్ర బీఆర్ఎస్ పార్టీ అని అన్నారు. కేంద్రంలో మోదీ రైతు వ్యతిరేక చట్టాలకు ఓటు వేసిన ఘనత బీఆర్ఎస్ పార్టీది, కానీ సన్నబియ్యం ప్రతి పేదవాడు తినాలన్నది కాంగ్రెస్ లక్ష్యం అని, ప్రతి ఒక్కరికీ నెలకి ఆరు కిలో సన్నబియ్యం ఇస్తున్నామని ఆయన అన్నారు. వరి పండించిన రైతులకు క్వింటాలుకు 500 రూపాయల అదనంగా బోనస్ ఇవ్వడం ద్వారా 25 నుండి 40 లక్షలకు సాగి పెరిగింది అని, ఇతర ఏ రాష్ట్రంలో పండని విధంగా వరి పంట మన దగ్గర పండిందని, 2 లక్షల మెట్రిక్ టన్నుల దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా వరి దిగుబడి వచ్చిందని దీనికి కారణం ప్రభుత్వ ప్రోత్సాహకం అని ఆయన అన్నారు. నిజాం సాగర్, శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టుల పూడిక తీస్తామని అన్నారు. జిల్లాకు నీరు రావాలని ప్యాకేజీ 21, 22,23 తీసుకువచ్చిన ఘనత సుదర్శన్ రెడ్డిది అని, ఆ ప్రాజెక్ట్ పూర్తి చేస్తే సుదర్శన్ రెడ్డి కి పేరు వస్తుందని దానిని ఆపింది బీఆర్ఎస్ నాయకులని అన్నారు. నిజామాబాద్ జిల్లాకు పూర్వ వైభవం తీసుకువస్తామన్నారు. ఇంకా లక్షల ఎకరాలకు నీరు అందిస్తాం అని,నిజామాబాద్ జిల్లా అంటే వ్యవసాయ జిల్లా అనే విధంగా ప్రయత్నం చేస్తూ గుత్ప ,అల్లిసాగర్ మరమ్మతులు చేస్తామణి అన్నారు. జిల్లాలో ఎంతో మంది క్రీడాకారులు తయారవుతున్న సందర్భంలో ఇక్కడ మినీ స్టేడియం, సింథటిక్ ట్రాక్ వస్తుందని, ఇండోర్ గేమ్స్ ఆడుకోవడానికి ఇండోర్ స్టేడియం నిర్మాణం చేస్తున్నామన్నారు. పారిశ్రామిక విషయంలో ముందుకు వెళ్ళడానికి నందిపేట సెజ్‌ను ముందుకు తీసుకువెళ్తామని తెలిపారు.

## బైండోవర్ ఉల్లంఘించిన మహిళలకు జైలు

**వరంగల్ ప్రతినిధి, ఏప్రిల్ 22 (జనంసాక్షి) :** నర్సంపేట ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో దుగ్గొండి మండల కేంద్రంలో నాటు సారా విక్రయాలపై నర్సంపేట ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించి పులిచేరు సమ్మక్క నాటు సారా అమ్ముతున్నందున తహసిల్దార్ రవిచంద్ర రెడ్డి ఎదుట బైండోవర్ చేసినట్లు నర్సంపేట ఎక్సైజ్ సీఐ నరేష్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఎక్సైజ్ తెలిపిన వివరాల ప్రకారం గతంలో తాసిల్దార్ ఎదుట హాజరు పరిచి న కానీ ఆమె మళ్ళీ నాటుసారా అమ్ముతుందనే సమాచారం తో ఎక్సైజ్ అధికారులు పట్టుకొని కేసు నమోదు చేసి బైండోవర్ నిబంధనలను ఉల్లంఘించినందుకు దుగ్గొండి తహసిల్దార్ ఎదుట హాజరుపరచగా తాసిల్దార్ రవి చందర్ రెడ్డి జైలు శిక్ష విధించగా వారి ఆదేశాల మేరకు నిందితురాలిని నర్సంపేట మహిళా జైలుకు తరలించారు. ఈ దాడులలో ఎస్ఐ శార్వాణి, సిబ్బంది పాల్గొన్నారు.

## సీఎం ప్రజావాణి పని తీరు అద్భుతం

- నాగాలాండ్ ప్రభుత్వ ఉన్నతాధికారుల కితాబు




**హైదరాబాద్ (జనంసాక్షి) :** సీఎం ప్రజావాణి పని తీరు అత్భుతం, భేష్ అని నాగాలాండ్ రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు కితాబు ఇచ్చారు. మంగళవారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో సీఎం ప్రజావాణిని నాగాలాండ్ రాష్ట్ర ప్రభుత్వ అధికారుల బృందం సందర్శించి ప్రజావాణి జరుగుతున్న తీరు తెన్నులను స్వయంగా పరిశీలించింది. సీఎం ప్రజావాణి గురించి రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్, ప్రజావాణి ఇంచార్జ్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ వివరించారు. సీఎం ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరించడం, వాటిని ఆన్లైన్ లో సంబంధిత శాఖలకు పంపడం, డెస్క్ ఆఫీసర్స్ విధులు, హెల్ప్ డెస్క్, ఫిర్యాదుల ట్రాకింగ్ పని తీరు, తాగు నీటి సౌకర్యం, ప్రభుత్వం అందించే ఐదు రూపాయల భోజనం కేంద్రాన్ని కూడా నాగాలాండ్ అధికారుల బృందం పరిశీలించింది. సీఎం ప్రజావాణి జరుగుతున్న విధానం చాలా బాగుంది అని నాగాలాండ్ బృందం కితాబునిచ్చింది. ఈ విధానాన్ని నాగాలాండ్ రాష్ట్రంలో అమలు చేసేందుకు అక్కడి ప్రభుత్వానికి సిఫార్సు చేస్తామని అధికారులు తెలిపారు. నాగాలాండ్ రాష్ట్ర ఉన్నత అధికారుల బృందంలో కుశ ఫితూ, విక్ వెనో చాలే, అవేలు రుహొూ, అత్ సంగ్లా, తదితరులు ఉన్నారు. వీరి వెంట ఎంసీఆర్ హెచ్ ఆర్ డీ ప్రొఫెసర్ మాధవీ రావులపాటి కూడా ఉన్నారు.




Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370